Dwaraka

ఆంధ్రప్రభ

Estd 1938

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ అష్టమి ఉ. 10.40 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: భరణి తె. 5.40 వరకు, అనంతరం కృత్తిక; అమృతకాలం: రా. 11.00 నుండి 12.30 వరకు; వర్జ్యం: మ. 1.44 నుండి 3.17 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;

సంపుటి: 56 • సంచిక: 284 • గురువారం 25 జనవరి 2018 • హైదరాబాద్ • పేజీలు: 12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

పద్మావత్.. ప్రకంపనల పరాకాష్ఠ..!



జీవర్ (రాజస్తాన్): పద్మావత్ పోస్టర్లు తగులబెడుతున్న ఆందోళనకారులు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి) దేశంలోనే ఇటీవల కాలంలో మరే చిత్రం వివాదాస్పదం కాలేదు. నిర్మాణ సమయం నుంచి సెట్టింగ్స్ దగ్ధం, నటులు, సాంకేతిక నిపుణులపై దాడులు, కోర్టు కేసులు, ధర్నాలు, హర్తాళ్ళు, ఉద్యమాలు, హెచ్చరికలు, ఆఖరకు థియేటర్ల యాజమాన్యాల నుంచి సహాయ నిరాకరణలు.. భారత సర్వోన్నత న్యాయస్థాన ప్రమేయం చిత్ర యూనిట్‌కు, చిత్రాన్ని ప్రదర్శించే థియేటర్లకు రక్షణ కల్పించాలన్న ఆదేశం.. ఇలా ఇంతటి విపత్కర పరిస్థితుల నడుమ చారిత్రక నేపథ్యంతో కూడిన పద్మావత్ చిత్రం గురువారం థియేటర్లలోకి రానుంది. ఆత్మగౌరవం, పౌరుషం, రాజకీయ చాణక్యాలకు ప్రతీకగా రాణి పద్మావతిని రాజ్‌పుత్ వీరులు పరిగణిస్తారు. శత్రువును చీల్చిచెండాడ్డం లేదా ఆత్మార్పణకు పాల్పడ్డం ఈ రెండే పద్మావతికి తెలిసిన రాజకీయ చాణక్యాలు. అతిగొప్ప సౌందర్యరాశిగా పద్మావతిని కవి మాలిక్ మహ్మద్‌జైసి చిత్రీకరించారు. ఈ కథకు చారిత్రక ఆధారాల్లేవు. కానీ 1313 ప్రాంతంలో ఇది జరిగినట్లుగా సూఫీ కవి జైసి 1550వ ప్రాంతంలో అరబ్బీ కవితా విధానంలో పద్మావతి పై ఓ కథనం రాశారు. ఇది దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలో కొచ్చింది. అందానికి, అత్యద్భుత గుణగణాలకు ప్రతీక రాణి పద్మావతి. ఆమె సింహళ యువ రాణి. వేటకొచ్చిన చిత్తూర్ సంస్థానాదీశుడు రతన్ సింగ్ ఆమెను చూస్తాడు. ఇరువురు ప్రేమలో పడతారు. కొంతకాలానికి చిత్తూర్ కోటపై అల్లావుద్దీన్ ఖిల్జీ తన అపార సైన్యంతో దాడిచేస్తాడు. అతని సైన్యం ముందు రతన్‌సింగ్ రాజ్యం నిలబడలేకపోతుంది. ఈ దశలో రాజీ ప్రతిపాదన జరుగుతుంది. కనీసం ఒకసారి పద్మావతి సౌందర్యాన్ని తనను చూడనివ్వమంటూ ఖిల్జీ ప్రతిపాదిస్తాడు. అయితే అందుకు రతన్‌సింగ్, పద్మావతిలు అంగీకరించరు. యుద్ధానికే ముందుకు ఉరుకుతారు. ఈ దశలో ⇨ 3వ పేజీలో...



గుర్గావ్‌లో బస్సులకు నిప్పు

ఉత్తర భారతాన పద్మావత్ సెగలు

రహదార్లు దిగ్బంధం.. వాహనాలు ధ్వంసం

థియేటర్లకు నిప్పు... హై అలర్ట్ ప్రకటన 10



హిటాచీ చైర్మన్ నికనిషి సాన్‌తో మంత్రి కేటీఆర్ సమావేశం. చిత్రంలో హిటాచీ సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యులు

తెలంగాణ పిలుస్తోంది పెట్టుబడులతో రండి!

• భాగ్యనగరం... పరిశ్రమల స్వర్గధామం • నిధుల కల్పనకు జపాన్ ముందుకొచ్చింది • సోలార్ విద్యుత్‌లో దూసుకుపోతున్నాం • దావోస్‌లో కేటీఆర్ పిలుపు • పలు కంపెనీలతో పెట్టుబడులపై చర్చలు • భారీ ప్రాజెక్టులకు మిత్సుబిషి ఆసక్తి • దావోస్‌లో ప్రపంచ దిగ్గజ కంపెనీలతో భేటీ • నోవార్టిస్, మిత్సుబిషి, హెచ్‌పి, ఎయిర్ ఏషియా, ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోలతో భేటీ • పెట్టుబడులు రాబట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు 12లో



ఖమ్మం జిల్లాలో పవన్ రోడ్ షో

నా వ్యూహాలు వేరు!

• ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను • నాపై దాడులు చేసినా భరిస్తా.. ఎదురుదాడి చేయను • నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ సమస్యపై న్యాయపోరాటం • ఖమ్మం చలోరే చలో సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 3లో

4 వేల కొత్త పంచాయతీలు

50 వేల కొలువులు!

దశల వారీగా 75వేల ఉద్యోగాల అంచనా

గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాక ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చే నివేదిక ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖల ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఏయే ప్రభుత్వ శాఖల్లో ఎన్నెన్ని ఉద్యోగాలు భర్తీ చేయాలన్నది స్పష్టత వస్తుందని.. తద్వారా ఖాళీల భర్తీకి అవసరమైన నిధులు మంజూరు చేసేలా ఆర్థిక శాఖకు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తుంది. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుతో పాటు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నాలుగువేల నూతన గ్రామ పంచాయితీలు ఏర్పాటైతే మరో 50వేలకు పైగా ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీలకు తోడుగా రాష్ట్రంలో తండాలు, ఆవాసాలతో సహా అదనంగా నాలుగువేల పంచాయితీలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉన్న విషయం తెలిసిందే. కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిన సంగతి తెలిసిందే. 500లకు మించి జనాభా ఉన్న తండాలు, ఆవాసాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.

కొత్త పంచాయతీరాజ్ చట్ట రూపకల్పనకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే అందజేసిన నివేదికపై అధ్యయనం జరుగుతోంది. ఈనివేదికలో కొత్త ఉద్యోగాల అంశం కూడా చేర్చినట్టు తెలుస్తోంది. గ్రామాలను అభివృద్ధి చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సీఎం కేసీఆర్ చెబుతున్న మాటలకు అనుగుణంగా కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాక ఖాళీల భర్తీకి కూడా చర్యలు తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉద్యోగాల కల్పనకు ప్రయత్నాలు జరుపుతూనే లక్షా 20వేల కొలువుల భర్తీకి దశల వారీగా నోటిఫికేషన్లు జారీచేస్తూ రాతపరీక్షలను నిర్వహిస్తోంది. టిఎస్‌పీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు మౌఖిక ఇంటర్వ్యూలను నిర్వహిస్తూ నియామకపత్రాలను జారీ చేస్తోంది. కొత్త గ్రామ పంచాయితీల్లో నాలుగు వేలకుపైగా వీఆర్‌వోలను, అంతే మొత్తంలో వీఆర్ఏలను నియమించాల్సి ఉంటుంది. దీంతోపాటు నాలుగువేల మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ⇨ 3వ పేజీలో...

కొలువులివే...

- గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు
- వీఆర్వోలు, టీచర్లు, లైన్‌మెన్లు, ఏఈవోలు
- ఏవోలు, సర్వేయర్లు, వైద్యులు

పంచాయతీరాజ్‌లోనూ మనమే ఆదర్శం: సీఎం 3


పవర్ కట్‌చేస్తే భారీ పెనాల్టీ

డిస్కమ్‌లకు కేంద్రం షాక్

ఐదేళ్లకోసారి లైసెన్సులు

వచ్చే బడ్జెట్‌లో బిల్లు

విద్యుత్ మంత్రి సింగ్



న్యూఢిల్లీ: అప్రకటిత విద్యుత్ కోతలు విధించే డిస్కమ్‌లు ముున్ముందు పెనాల్టీ కట్టాల్సి రావొచ్చు. అలాగే డిస్కమ్‌ల లైసెన్సులను ఐదేళ్లకు ఒకసారి పునరుద్ధరిస్తారు. ఇలాంటి నియమ, నిబంధనలతో కూడిన విద్యుత్ సవరణ బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెడతారు. ప్రస్తుతం డిస్కమ్‌లు జీవిత కాలానికి వర్తించేలా లైసెన్సు పొందుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతలకు ⇨ 3వ పేజీలో...



గడప గడపకూ టీఆర్ఎస్

ఫిబ్రవరిలో శ్రీకారం

కేడర్‌లో జోష్ నింపడమే లక్ష్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఇక టిఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఇంటి తలుపుతట్టనున్నారు. ఫిబ్రవరి నుండి ఏప్రిల్ 27న పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించేవరకు వరుస కార్యక్రమాలతో క్యాడర్‌కు చేతినిండా పని కల్పించాలని, జనంతో మమేకమయ్యేలా చేయాలని పార్టీ భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే పలు కార్యక్రమాలపై టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ముఖ్యులతో చర్చించగా.. మేడారం జాతర తర్వాత శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి వీటిని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. నిర్ణయాల్లో భాగంగా గడపగడపకూ టిఆర్ఎస్ కార్యకర్తలను పంపి.. ప్రభుత్వ కార్యక్రమాలను, సబ్బండ వర్గాల సంక్షేమానికి రూపొందించిన పథకాలను వివరించాలని నిర్ణయించారు.

నియోజకవర్గ సమన్వయ కమిటీలు..

ఇక గత ప్లీనరీలో జిల్లా కమిటీలను రద్దుచేసి నియోజకవర్గ సమన్వయకమిటీలను వేయాలని నిర్ణయించినా దానిని అమలుపరచలేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ కమిటీల ఏర్పాటును అధిష్టానం పరిశీలిస్తోంది. ఇక ఖాళీగా ఉన్న మండల కమిటీల ఏర్పాటును కూడా పూర్తిచేసేందుకు షెడ్యూల్ ఖరారు చేసే అవకాశం ఉంది. ఇక రాష్ట్రస్థాయిలో మిగిలిపోయిన కార్పోరేషన్ల డైరెక్టర్ల పదవులు, ⇨ 3వ పేజీలో...

రూ. 88 వేల కోట్లతో బ్యాంకులకు టానిక్

మళ్లీ ఆర్థిక సంస్కరణల అమలు

మొండి బకాయిలు పునరావృతం కావొద్దు: జైట్లీ 6





నకిలీ బర్త్ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు

జీహెచ్‌ఎంసీ సిబ్బందితో సహా మీ-సేవ ఉద్యోగులు అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నకిలీ బర్త్ సర్టిఫికెట్ల ముఠా గుట్టును రాచకొండ కమిషనరేట్ మల్కాజ్‌గిరి జోన్ ఎస్‌వోటీ, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా డెకాయి ఆపరేషన్ నిర్వహించి రట్టు చేశారు. ముఠా సభ్యుల్లో 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఏజెంట్స్ కమ్ బ్రోకర్స్, మీ సేవా ⇨ 2వ పేజీలో...



• దాణా స్కాం.. 3వ కేసు



లాలూకు ఐదేళ్ల జైలు

రూ.5 లక్షల జరిమానా

జగన్నాథ్ మిశ్రాకూ అదే శిక్ష

మరో ఏడుగురికి మూడున్నరేళ్ల జైలు 10లో



9

అలనాటి నటి

కృష్ణకుమారి ఇక లేరు

కేన్సర్‌తో బాధపడుతూ బెంగళూరులో కన్నుమూత

సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి



9

సెల్ఫీ మోజు ప్రాణాల మీదకొచ్చింది

ఎంఎంటీఎస్ రైలుతో సెల్ఫీకి యత్నం.. గాయాలు



అనర్హతపై నో స్టే

ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఈసీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశం 10లో

మిషన్ భగీరథకు ఒడిశా అధికారులూ ఫిదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజలకు మంచినీరేయాలన్న తపన ఉంటే తప్ప మిషన్‌భగీరథ లాంటి ప్రాజెక్టును మొదలుపెట్టడం సాధ్యంకాదని ఒడిశా అధికారులు ప్రశంసించారు. కెసిఆర్ లాంటి చిత్తశుద్ది ఉన్న ముఖ్యమంత్రి ఉన్నందునే ఇంత తక్కువ వ్యవధిలో ప్రాజెక్టు పూర్తికాబోతుందని చెప్పారు. బుధవారం సంగారెడ్డి జిల్లాలున్సాంరెడ్డిపల్లి, పెద్దారెడ్డిపేట, మెదక్ జిల్లా రామచంద్రాపురంలో ఒడిశా తాగునీరు, పారిశుధ్య అధికారులబృందం పర్యటించింది. నాబార్డ్ ఒడిశా, తెలంగాణ శాఖల ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పోజర్ విజిట్ జరిగింది. ఒడిశా రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి పికె నంద, చీఫ్ ఇంజనీర్ ఇన్వెస్టిగేషన్‌తో పాటు పదకొండుమంది ఇంజనీర్లు, ఒడిశా నాబార్డ్ డిజిఎం పాటిల బృందంలో పాల్గొన్నారు. తొలుత సంగారెడ్డి జిల్లాలున్సాంరెడ్డిపేటలో నిర్మించిన ఇన్‌టేక్‌వెల్‌తో పాటు 100ఎంఎల్‌డి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఒడిశా బృందం పరిశీలించింది. ఇన్‌టేక్‌వెల్‌లో జరుగుతున్న ఎలక్ట్రో మెకానికల్ పనులతీరును తెలుసుకుంది. మోటార్లు, పంపుల సామర్థ్యాన్ని మిషన్ భగీరథ సిఈ విజయ్‌ప్రకాశ్ ఒడిశా అధికారులకు వివరించారు. ఆ తర్వాత నీటిశుద్ది సితం విభాగంలో ప్రతి విభాగాన్ని చూసిన ఒడిశా అధికారులు నీటిశుద్దికి వినియోగిస్తున్న ఫిల్టర్ మీడియా వివరాలు తెలుసుకున్నారు.

ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఒడిశా ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి పికె నంద తమ రాష్ట్రంలోనూ పరిమితంగా తాగునీటి సరఫరా ప్రాజెక్టుల ప్రారంభం చాలను కుంటున్నామన్నారు. అందుకోసమే మిషన్ భగీరథను చూసేందుకు వచ్చా మన్నారు. ఒడిశా ఆర్‌డబ్ల్యుఎస్ సిఈ జన్మేజయ్ సేఠి మాట్లాడుతూ తమ రాష్ట్రంలో 85శాతం నీటిసరఫరా భూగర్భజలాల ఆధారంగానే జరుగు తుందన్నారు. ఉపరితల నీటివనరులతో తాగునీటిని అందించాలని తెలంగాణ సంకల్పమే తమను ఇక్కడికి రప్పించిందన్నారు. ఒక ప్రాజెక్టును ప్రారంభించి పనులు చేయడానికి ఎన్నో సమస్యలు ఎదుర్కొ వాల్సివస్తుందన్నారు. ఒడిశా నాబార్డు డిజిఎం పాటిల్ మాట్లాడుతూ తాగునీటి ప్రాజెక్టులకు భగీరథ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. అందుకే నాబార్డ్ తరపున ఒడిశా అధికారులను తెలంగాణకు తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సిఈ విజయ ప్రకాశ్, కన్సల్టెంట్ నర్సింగారావు, ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈలు రఘువీర్, లలిత, కమలాకర్, తెలంగాణ నాబార్డు ఎజిఎం రమేష్, కల్పనతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



'భగీరథ' ప్రయత్నం భేష్

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శి సీకే మిశ్రా

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: ప్రతి ఇంటికీ మంచినీళ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆలోచన అభినందనీయమని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శి సీకే మిశ్రా పేర్కొన్నారు. మిషన్ భగీరథ గురించి తాను విన్నదానికి అనుగుణంగానే క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు ఉందన్నారు. బుధవారం గజ్వేల్ సెగ్మెంట్‌లోని కోమటిబండ హెడ్ వర్క్స్‌ను మిశ్రా పరిశీలించారు. ఇక్కడి నుంచి తాగునీరు ఎన్ని ఇళ్లకు అందుతుందో అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ ఈఎన్సీ సురేందర్ రెడ్డి ప్రాజెక్టు వివరాలను ఆయనకు వివరించారు. భగీరథ మొదలుపెట్టిన 9 నెలల రికార్డు సమయంలోనే గజ్వేల్ సబ్ సెగ్మెంట్‌ను ప్రారంభించామని ఆయన తెలిపారు. అటవీశాఖ అధికారుల సహకారంతో భగీరథ పనులు ఎలాంటి ఆటంకం లేకుండా జరుగుతున్నాయని సురేందర్ రెడ్డి సీకే మిశ్రాకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి శాఖ కార్యదర్శి ఎస్.కె.జోషి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పీకే ఝా, ఈఈ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరానికి కేంద్రం సాయం

ప్రాజెక్టు నిర్మాణం అద్భుతం: సీకే మిశ్రా

మహాదేవపూర్ ప్రభన్యూస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టును పలువురు సందర్శిస్తూ ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. కేంద్రం నుండి జలవనరులశాఖ అధికారులు వచ్చి ప్రాజెక్టు చాలా గొప్పగా నిర్మిస్తున్నారని, దీంతో లక్షలాది ఎకరాలకు సాగు, తాగు నీరు అందుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని జలవనరుల శాఖ అధికారులు ప్రశంసించిన విషయం తెలిసిందే. బుధవారం కేంద్ర పర్యావరణ , అటవీ శాఖ కార్యదర్శి సీకే మిశ్రా హెలికాప్టర్ ద్వారా అన్నారం ప్రాజెక్టుకు చేరుకుని పనులను సందర్శించారు. మ్యాప్ ద్వారా సీఈ హరీరాం ఆయనకు ప్రాజెక్టు వివరాలను వెల్ల డించారు. అంతకు ముందు హెలీక్యాప్టర్ ద్వారా మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపెల్లి పంప్ హౌజ్ పనులను విహంగ వీక్షణ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా విలే కరులతో మాట్లాడుతూ కాళేశ్వర ప్రాజెక్టు దేశ ప్రగతిలో ఒక భాగం అని అను కున్న దాని కంటే ఎక్కువగా కాళేశ్వర ప్రాజెక్టు పనులు జరిగాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించా ఎంతో ఆనందం కలిగిందన్నారు. పనులు వేగ వం తంగా, సాఫీగా పనులు కొనసాగు తున్నాయని అన్నారు. ఈ ప్రాజెక్టు పనుల వలన గ్రీనరీ వాటర్ పెరుగుతుందని కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టులో పెద్దపెద్ద చెట్లను బాధగా కలిగించినా పెద్దఎత్తున చెట్లను నాటడంతో మేలు జరుగుతుందని అన్నారు. వారి వెంట అటవీశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాజాద్, పీసీసీఎఫ్ పీ.కె.ఝా, సీఈ హరిరాం, కలెక్టర్ కర్ణన్, సీసీఎఫ్ఓ ఎంజె.అక్బర్, ఎస్సీ సుధాకర్ రెడ్డి, తదితరులున్నారు.

ఫ్యూచర్ గ్రూపు నుంచి గోల్డెన్ హార్వెస్ట్ రైస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫ్యూచర్ కన్స్యూమర్ సంస్థ గోల్డెన్ హార్వెస్ట్ రైస్ బ్రాండ్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. సోనా మసూరి బియ్యాన్ని స్విస్ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాసెస్ చేసి నాణ్యమైన బియ్యాన్ని వినియోగదారులకు అందిస్తున్నట్లు ఫ్యూచర్ గ్రూపు సీఈవో కిషోర్ బియానీ చెప్పారు. దక్షిణాది సంస్కృతిలో ఆహారం ప్రాధాన్యతను వివరించే విధంగా సురేష్ ప్రొడక్షన్స్, అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి యాడ్ ఫిలిం నిర్మించినట్లు బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. గోల్డెన్ హార్వెస్ట్ రూ.1200 కోట్ల విలువైన బ్రాండ్ ఉత్పత్తులు మార్కెట్ చేస్తుందన్నారు. తృణ ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, డ్రైఫ్రూట్స్ లాంటి పోషక ఆహార ఉత్పత్తులను తమ సంస్థ అందిస్తుందని బియానీ తెలిపారు. గోల్డెన్ హార్వెస్ట్ చిత్రం ప్రత్యేకమైన సాంప్రదాయ, సంస్కృతికి చెందిన అంశాలకు సంబంధించిందని సురేష్‌ప్రొడక్షన్స్‌డైరెక్టర్ రానా దగ్గుబాటి అన్నారు. ఆహారంపై మన అభిరుచిని తెలిపే విధంగా చిత్రీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ స్టూడియో నిర్మాత సుప్రియ యార్లగడ్డ కూడా పాల్గొన్నారు.

నకిలీ బర్త్ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

ఓనర్స్‌తో పాటు జీహెచ్ఎంసీ(అవుట్‌సోర్సింగ్) సిబ్బందిలో ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, నలుగురు సబ్-రిజిస్ట్రార్/హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. అరెస్టయిన నిందితుల పేర్లు చౌలా సునీల్ కుమార్(39)(ఇన్సూరెన్స్ ఏజెంట్, నేరేడ్‌మెట్), బల్లా చంద్రమౌళి(39)(వీవర్, ఎల్‌బి నగర్, స్వస్థలం నల్లగొండ), బాదారవికుమార్(42)(బిజినెస్, అల్వాల్ గూడ, మీర్‌పేట), మేకల వెంకటాద్రి(32), (మీ-సేవా సెంటర్, వెస్ట్ మారేడ్‌పల్లి.. నివాసం.. వనస్థలిపురం), పోతంటి రంజిత్ కుమార్(32)(మీ-సేవాసెంటర్, చింతల్, నివాసం.. చింతల్), గుడ్ల కృష్ణ(48)(మీ- సేవ ఓనర్, జీడిమెట్ల, నివాసం.. జీడిమెట్ల), మొయ్యె నారాయణరావు(34)(మీ- సేవా ఓనర్, చింతల్, నివాసం.. జీడిమెట్ల), బోరం భాను ప్రకాష్(27) (కంప్యూటర్ ఆపరేటర్ (సర్కిల్-15 కుత్బు ల్లాపూర్-సర్కిల్ జీహెచ్ఎంసీ చింతల్ ఆఫీస్, నివాసం.. వనస్థలిపురం), సరా కిరణ్‌కుమార్(35)(కంప్యూటర్ ఆపరేటర్ (సికింద్రాబాద్ సర్కిల్-18, వెస్ట్ మారేడ్‌పల్లి ఆఫీస్ ఇన్‌ఛార్జ్ ఆఫ్ సిటీ సివిల్ కోర్టు, నివాసం.. మేడిపల్లి), అడపాడెడ్డి రాజు(40) (సర్కిల్-18, హెల్త్ అసిస్టెంట్, నివాసం.. ముషీరాబాద్, స్వస్థలం.. విశాఖపట్నం), యెడుగ రామకృష్ణ(42), (సర్కిల్-18 హెల్త్ అసిస్టెంట్, నివాసం.. చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్.. స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా), చిటికెల బాబు నాయుడు(31)(సర్కిల్-18 హెల్త్ అసిస్టెంట్, నివాసం.. మచ్చబొల్లారం, స్వస్థలం, విశాఖపట్నం), రెడ్డినాగబాబు (35)(సర్కిల్-15 హెల్త్ అసిస్టెంట్, నివాసం.. ఓల్డ్ అల్వాల్.. స్వస్థలం.. విశాఖపట్నం). పరారీలో యాదగిరి(ఏజెంట్), ఆనంద్(సబ్-రిజిస్ట్రార్/హెల్త్ అసిస్టెంట్), అబ్బుల్(ఏజెంట్)(సికింద్రాబాద్), తిరుపతి (ఏజెంట్) (ఖైరతాబాద్), విజయ్(ఏజెంట్)(అల్వాల్), దినేష్(ఏజెంట్) (ఓల్డ్ సిటీ), కనకయ్య(ఏజెంట్)(సికింద్రాబాద్), కుమార్ (ఏజెంట్)(సికింద్రాబాద్), మాథ్యూస్ (ఏజెంట్) (సికింద్రాబాద్), నగేష్(ఏజెంట్)(సికింద్రాబాద్), రాజ్ కుమార్ (ఏజెంట్) (సికింద్రాబాద్), శ్రీను(ఏజెంట్) (కూకట్‌పల్లి), సాగర్(ఏజెంట్)(మల్కాజ్‌గిరి), తిరుమలగౌడ్ (ఏజెంట్)(సికింద్రాబాద్) పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. ఏజెంట్లు కమ్ బ్రోకర్లు, మీ-సేవా ఓనర్స్ జీహెచ్ఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు (డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సబ్‌రిజిస్ట్రార్స్/హెల్త్ అసిస్టెంట్స్)తో కలిసి 18 జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలో నకిలీ బర్త్ సర్టిఫికెట్లను తయారు చేసి, ఇష్యూ చేశారు. తమను అప్రోచ్ అయిన ప్రతి ఒక్కరికీ నకిలీ బర్త్ సర్టిఫికెట్లు తయారు చేసి ఇష్యూ చేసి అందినకాడికి దోచుకున్నారు. జీహెచ్ఎంసీని మోసం చేసే యథేచ్ఛగా సర్టిఫికెట్ల ప్రింట్, ఇష్యూ కార్యక్రమం చేశారు. ఈ విధంగా నకిలీ బర్త్ సర్టిఫికెట్లను అసలైన సర్టిఫికెట్లుగా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తొలుత మీ-సేవా ఓనర్స్, ఏజెంట్స్ కమ్ బ్రోకర్లను నుంచి అవసరమైన వారిని గుర్తించామని తెలిపారు. బర్త్ సర్టిఫికెట్ కు సంబంధించిన ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సి మార్క్స్ లిస్టు



అడుగుతారు. అవి లేని పక్షంలో తల్లిదండ్రుల పేర్లతో పాటు అభ్యర్థి పేరు, పుట్టినతేదీ మాత్రం సేకరించి మీ-సేవా ఓనర్స్‌కు వాట్సాప్ మెసేజ్ ద్వారా పంపుతారు. మీ-సేవా ఓనర్స్ ఏజెంట్స్ వద్ద నుంచి ఒక్కో నకిలీ బర్త్ సర్టిఫికెట్‌కు రూ.4000 నుంచి రూ.5,000 వసూలు చేస్తారు. ఏజెంట్స్ నుంచి డబ్బులు వసూలయిన వెంటనే డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు వివరాలను మీ-సేవా ఓనర్స్ అందిస్తారు. వారి దగ్గరకు సమాచారం/మెసేజ్/డాక్యుమెంట్స్/ మీ-సేవా ఓనర్స్ నుంచి మనీ వచ్చిన వెంటనే సబ్-రిజిస్ట్రార్‌కు సమాచారం ఇస్తారు. ఆ సమాచారం అందిన వెంటనే అభ్యర్థుల వివరాలను సబ్-రిజిస్ట్రార్ ఆఫ్ బర్త్ అండ్ డెత్‌లో ఎంటర్ చేసి రిజిస్ట్రేషన్ నెంబర్‌ను అలాట్ చేస్తారు. అనంతరం మరల డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఆ సమాచారాన్ని హ్యాండోవర్ చేసి ఆ ఇన్ఫర్మేషన్ అప్‌లోడ్ చేయమని చెబుతారు. అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్ నకిలీ బర్త్ సర్టిఫికెట్స్ ప్రిపేర్ చేస్తారు. అదే సమయంలో అనుపుత్రి పేరు, డేట్ ఆఫ్ ఎంట్రీ జీహెచ్ఎంసీ ఆన్‌లైన్ సైట్ జీహెచ్ఎంసీ.జీవోవి.ఇన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం అభ్యర్థులు తమ బర్త్ సర్టిఫికెట్లను ఏదీ మీ-సేవా సెంటర్‌లో ప్రింటవుట్ తీసుకునే సౌలభ్యం ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ నెంబర్ కంటిన్యూ చేస్తూ నకిలీ బర్త్ సర్టిఫికెట్లను ప్రిపేర్ చేస్తూ సిస్టమ్‌లో అప్‌లోడ్ చేస్తూ మీ-సేవా సెంటర్‌కు కనెక్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో మీ-సేవా సెంటర్స్ నుంచి కలెక్ట్ చేసిన ప్రింటవుట్స్‌ని వెరిఫై చేసిన సందర్భంలో సర్కిల్-15లో డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్త్ అసిస్టెంట్ నిర్వాకం వెలుగుచూసింది. 1991లో రిజిస్టర్ నెం.1668 నుంచి 1860 వరకు (193), 1995లో రిజిస్టర్ నెం.2636 నుంచి 3398 వరకు (763), 1996లో రిజిస్టర్ నెం.2507 నుంచి 2735 వరకు (219), 1997లో రిజిస్టర్ నెం.2589 నుంచి 2594 వరకు(06), 1998లో రిజిస్టర్ నెం.2711 నుంచి 2720 వరకు (10), 1999లో రిజిస్టర్ నెం.3290 నుంచి 3421 వరకు(132), 2000లో రిజిస్టర్ నెం.3811 నుంచి 3993 వరకు (183), 2001లో రిజిస్టర్ నెం.2635 నుంచి 2767 వరకు (133), 2003లో రిజిస్టర్ నెం.3312 నుంచి 3476 వరకు(165), 2007లో రిజిస్టర్ నెం.4696 నుంచి 4783 వరకు(88), 2008లో రిజిస్టర్ నెం.4770 నుంచి 4857 వరకు (88), 2009లో రిజిస్టర్ నెం.4010 నుంచి 4147 వరకు (137), 2010లో రిజిస్టర్ నెం.4213 నుంచి 4217 వరకు (05) నకిలీ సర్టిఫికెట్స్. మొత్తంగా 2122 ఇష్యూ చేశారు.

ఇలలా ఉండగా ఆయా సర్టిఫికెట్లలో పొందుపర్చిన పుట్టినతేదీ ఆధారంగా ఆయా ఆసుపత్రుల్లో వెరిఫై చేయగా వారిచ్చిన సమయంలో ఆయా ఆసుపత్రులలో ఎవరూ జన్మించలేదని వెల్లడైంది. సర్టిఫికెట్లు పొందే క్రమంలో ఏజెంట్స్/బ్రోకర్లను నమ్మవద్దని, నమ్మి మోసపోవద్దని పోలీసులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. నిబంధనలననుసరించి సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంటుందని, ఇలా దొడ్డిదారిన నకిలీ సర్టిఫికెట్లు పొంది అవి నిజమైనవిగా చూపితే అనేక తిప్పలు తప్పవని పోలీసులు తెలిపారు. కాగా, అరెస్టయిన నిందితుల వద్దనుంచి నకిలీ బర్త్ సర్టిఫికెట్లు, ల్యాప్‌టాప్, సిస్టమ్స్, 13 మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను రాచకొండ సీపీ మహేష్‌భగవత్ మీడియాకు వెల్లడించారు. నకిలీ బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు ప్రైవేట్ ఉద్యోగాలకోసమే తయారు చేస్తున్నారన్నారు. ఈ ముఠా గుట్టు రట్టు చేసిన మల్కాజ్‌గిరి జోన్ ఎస్‌ఓటీ, వనస్థలిపురం పోలీసు సిబ్బందిని రాచకొండ సీపీ మహేష్ భగవత్ అభినందించారు.

బడ్జెట్ కసరత్తు వేగవంతం

- శాఖల వారీ సమీక్షలు షురూ
- తొలిరోజు కీలక శాఖల పద్దులు
- వ్యవసాయ రంగంపై సుదీర్ఘ సమావేశం
- వాస్తవికతకు చేరువుగా అంచనాల మదింపు

ఆంధ్రప్రభ, హైదరాబాద్: బడ్జెట్ కసరత్తు వేగవంతమైంది. శాఖల వారీగా ప్రతిపాదనలను సమర్పించడంతో ఆర్థిక శాఖ నేతృత్వంలో వాటిపై సమీక్షలు షురూ అయ్యాయి. ఒక్కో శాఖకు అవసర మైన నిధులు, ప్రస్తుత ఆర్థిక ఏడాది కేటాయింపులు, ఖర్చులపై సమీక్షిస్తూ ఆర్థిక శాఖ ఈ ఏడాదికి అంచనాలపై వివరాలను రాబడుతోంది. బుధవారం సచివాలయంలో శాఖల వారీగా ప్రతిపాదనలపై సమీక్షలు ఆరంభమయ్యాయి. మంగళవారం వరకు అన్ని ప్రభుత్వ శాఖలు దాదాపుగా తమ అంచనాలను, ప్రతిపాదిత బడ్జెట్‌ను ఆర్ఇక శాఖకు సమర్పించాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు వ్యవసాయ, పశుసం వర్ధక, ఎస్సీ డెవలప్‌మెంట్, ఇంధన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బిసి సంక్షేమం, పర్యాటక-సాంస్కృతిక శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షించారు. ఒక్కో శాఖపై దాదాపు గంటకుపైగా సమీక్ష నిర్వహించారు. అయితే ఈ సమీక్షా సమావేశాలకు ఆయా శాఖల మంత్రులు హాజరు కాలేదు. ఉదయం 11 గంటలనుంచి సాయం త్రం 5 గంటల వరకుసమావేశం కొనసాగింది.



వ్యవసాయ రంగానికి రూ. 15 వేల కోట్లతో ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టాలని నిర్ణ యించిన నేపథ్యంలో ఈ శాఖ బడ్జెట్‌పై కీలకంగా చర్చించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పంట కు పెట్టుబడి సాయం, ఖరీఫ్, రబీ రెండు దఫాలకు ఈ బడ్జెట్‌లోనే ఎకరాకు రూ.8వేలు అందించనున్న నేపథ్యంలో రూ. 10వేలకోట్లకుపైగా ఇందుకు కేటాయించాల్సి ఉంది. దీంతో గంటన్నరకుపైగా ఈ అంశంపై చర్చించారు. కోటి ఎకరాలకు నీరందించే దిశగా సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రస్తు ఆర్థిక ఏడాది రూ. 25వేల కోట్ల కేటాయింపులను బడ్జెట్‌లో పొందు పర్చుగా2018-19లో దీనిని రూ. 27వేల కోట్లకు కోరుతూ ప్రతిపాదనలు సమర్పించారు. మిషన్ కాకతీయ పథకానికి రూ. 25వేల కోట్లను కేటా యించారు. ఇందులో భాగంగా పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్‌కు గతేడాది రూ. 7861కోట్లుకాగా ఈ ఏడాది రూ.4వేల కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 6286కోట్లను ఈ ఏడాదికి రూ. 9వేల కోట్లకు, సీతారామ, భక్త రామదాసు లిఫ్ట్‌కు రూ. 1152 కోట్ల కేటాయిం పులతో ప్రాధాన్యత నిచ్చారు. దేవాదులకు రూ.2132కోట్లు, నాగార్న సాగర్‌కు రూ.1853 కోట్లు, చిన్న నీటిపారుదలకు రూ. 2500 కోట్లు , కాంతన పల్లికి రూ. 1010 కోట్లు కోరుతూ ప్రతిపాదనలు అందడంతో సాధ్యాసాధ్యాలపై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది.

ఇప్పటికే బడ్జెట్ కూర్పు రాష్ట్రాలకు సులువైంది. కేంద్ర బడ్జెట్ ముంద స్తుగానే ప్రవేశపెట్టాలనే వినూత్న నిర్ణయంతో రాష్ట్రాలకు కొంత వెసులుబాటు కల్గుతోంది. ఏప్రిల్ 1నుంచి ప్రారంభం కానున్న ఆర్థిక ఏడాదికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా కేంద్రం ఫిబ్రవరిలోనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టి పార్లమెంట్ ఆమోదం పొందాలని యించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తెలంగాణకు మరింత ప్రయోజనకారి కానుంది. ప్రతీయేటా ఫిబ్రవరి నుంచే వివిధ చెల్లింపులపై అనధికార నిషేదం కొనసాగడం ఆనవాయితీ.

ఇందుకు మిగులు నిల్వ, నిధుల నిర్వహణ ఆర్థిక శాఖకు కత్తిమీద సాముగా ఉంటోంది. మూడు, నాలుగు నెలల ఖర్చులు, వ్యయాలు, కేటాయింపులపై బడ్జెట్ ప్రభావం పడేది. మార్చిలో ప్రవేశపెట్టే బడ్జెట్ ఏప్రిల్, మే నెలల్లో ఆమోదం పొందడం... అప్పటివరకూ ప్రభుత్వ ఖర్చులకు కూడా కష్టం కావడం జరిగేది. రాష్ట్రాల్లో కూడా మార్చిలోనే బడ్జెట్ ప్రవేశపెట్టడం జరగడం, కేంద్ర సాయం, సెంట్రల్ షేర్, కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రాల వాటా తేలకపోవడంతో వాటిని అంచనా వేసుకోవడం జరిగేది. దీంతో బడ్జెట్ లెక్కల్లో వాస్తవికత లోపించడం సహజంగా జరిగేది.

యూఎస్‌లో హైదరాబాద్ వాసి మృతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగర వాసి యూఎస్‌లో కన్నుమూశాడు. ఐటీ ఉద్యోగి చైతన్యరెడ్డి (36) అనే వ్యక్తి గుండెపోటుకు గురై హౌస్టన్ నగరంలో మృతి చెందాడు. సీనియర్ సాఫ్ట్‌వేర్ క్యూఏ అనలిస్ట్‌గా హౌస్టన్‌లోని రాయల్ టెక్నోక్రాట్స్‌లో చైతన్య పనిచేస్తు న్నాడు. యూఎస్‌లో ఐటీ ఉద్యోగిగా అతను పదేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఈ మధ్యనే అతను కంపెనీ మారాడు. హైదరాబాద్‌లోని శ్రీసత్య సాయి కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ నుంచి పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్.. కర్ణాటకలోని గుల్బర్గా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్స్ డిగ్రీని పూర్తి చేసిన చైతన్య టెక్సాస్‌లోని లామర్స్ యూని వర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పట్టాను అందుకున్నాడు. అంతిమ సంస్కారాల నిమిత్తం మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించేందుకు స్థానిక తెలంగాణ సంస్థ మృతుడి కుటుంబసభ్యులకు సహకారం అందిస్తుంది.

స్కూల్ ఫీజుల పెంపునకు హైకోర్టు పచ్చజెండా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రానున్న విద్యా సంవత్సరంలో హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు పెంచుకునేం దుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. అయితే పెంచిన ఫీజును బ్యాంకు ప్రత్యేక ఖాతాల్లో జమచేయాలని పాఠశాల యాజ మాన్యాలకు స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యాన్ని పరిష్కరిం చేంత వరకు పెంచిన రుసుమును ఖాతాల నుంచి ఉపసంహరించరాదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవి.శేషసాయి బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో ఫీజులు పెంచరాదని తెలంగాణ ప్రభుత్వం జనవరి 4, 2018న జారీ చేసిన మెమో ను సవాలు చేస్తూ ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

భారత్ బాధ్యతాయుతమైన న్యూక్లియర్ దేశం

దావోస్: భారత బాధ్యతాయుతమైన న్యూక్లియర్ దేశమని కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి ఎం.జె అక్బర్ అన్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రసంగించిన ఆయన.. అణ్వాయుధాలను ఉపయోగించిన మొదటి దేశం భారత్ కాదని స్పష్టం చేశారు. అణ్వాయుధాలతో ప్రపంచ దేశాలకు ముప్పు అన్న అంశంపై ప్రసంగిస్తూ.. చాలాదేశాలు అణ్వాయుధాలు చూశాయి. అంతిమ నియంత్రణ , మిస్సైల్స్ సందేశం చూడాలి. కొన్ని రోజుల క్రితమే భారత్ ఆస్ట్రేలియా గ్రూప్‌లో చేరిన అణ్వాయుధాల నియంత్రణ ఒప్పందాలు చేసుకుంది. భారత్ చాలా బాధ్యతాయుతమైన అణు దేశమని ప్రపంచ దేశాలు గుర్తించాయి.

జెట్‌స్పీడ్‌లో పంప్‌హౌజ్‌ల నిర్మాణం

- జూన్‌కల్లా 8 పంపులు రెడీ
- డెడ్‌లైన్‌లోగా కాళేశ్వరానికి విద్యుత్ పరఫరా
- ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం పంపుహౌజ్‌ల నిర్మాణం జెట్‌స్పీడులో జరుగుతోంది. విద్యుత్ సరఫరాలైన్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. 400కెవి, 220కెవి లైన్ల పనులు ప్రారంభించారు. 2018జూన్‌కల్లా 8పంపులు రెడీ అవుతున్నట్లు ప్రభుత్వ ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి బుధవారం తెలిపారు. డెడ్‌లైన్‌లోగా కాళేశ్వరంకు విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్‌కో అధికారయంత్రాంగం సకల ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. వర్షాకాలం నాటికి కాళేశ్వరం పంపులు పనిచేయాల్సి ఉన్నందున విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు ఇప్పటికే ఆదేశించారు. డెడ్‌లైన్ లోపే విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, పంపిణీలైన్ల ఏర్పాటు పూర్తిచేస్తామని ట్రాన్స్‌కో ఉన్నతాధి కారులు తెలి పారు. విద్యుత్ ఇరిగేషన్ అధికారు లతో మంత్రి హరీష్‌రావు ట్రాన్స్‌మిషన్ లైన్లు సబ్‌స్టేషన్ల పనులపై ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారు.



కాళేశ్వరం పంపు హౌజ్‌ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుం టున్నందున విద్యుత్ సంస్థలు తమ పనులను మరింత వేగవంతం చేయాలని ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు ఇదివరకే కోరారు. ప్యాకేజీల వారీగా పంపింగ్ స్టేషన్‌ల పూర్తికి గాను లక్ష్యం విధించుకుని ఇరిగేషన్ శాఖ పనిచేస్తుండగా, కాళేశ్వరం ప్యాకేజీ 6కు సంబంధించిన 3పంపులు, ప్యాకేజీ 8కి చెందిన 5పంపులు జూన్ వరకు సిద్దమవుతాయని పెంటారెడ్డి తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం బ్యారేజీల పరిధిలోని పంపుహౌజ్‌ల నిర్మాణానికి అవసరమైన విద్యుత్ సరఫరా అంశాలపై మంత్రి ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులతో నిరంతరం చర్చిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన షెడ్యూల్ ప్రకారం పూర్తిచేసేందుకు విద్యుత్ సంస్థల సహకారం, తోడ్పాటు అవసరమని మంత్రి అభిప్రాయ పడ్డారు. అయితే త్వరితగతిన విద్యుత్ సబ్‌స్టేషన్ల టెస్ట్ పూర్తిచేయాలన్నారు. ఆరు 400కెవి సబ్‌స్టేషన్లు, మూడు 220కెవి సబ్‌స్టేషన్లు, రెండు 132కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ట్రాన్స్‌కో ప్రయత్నిస్తున్నది. కాళేశ్వరం 6,7,8,9,10,11,12 ప్యాకేజీ లలో పంపింగ్ స్టేషన్ల ప్రోగ్రెస్‌ను మంత్రి రెండురోజుల క్రితం సమీక్షించారు. విద్యుత్ టవర్ల నిర్మాణం, హెచ్‌టి లైన్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తున్నారు. కాళేశ్వరం కోసం మొత్తం 59టవర్ల ఏర్పాటు ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉండగా, మంత్రి సూచనలతో రెండు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఒక్కో ప్రాజెక్టు దగ్గర ఒక కంట్రోల్ రూంను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళకు సంబంధించిన పంపింగ్ స్టేషన్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరు వరకు నీటిలరలింపుకు అను గుణంగా సివిల్ పనులు తుదిదశకు చేరుకోవడంతో ఎలక్ట్రిక్ మెకానిక్ పనులు ప్రారంభమయ్యాయి. కాళేశ్వరం నుండి గోదావరిజలాలను తెలంగాణ బీడుభూముల్లో పారించాలనే ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు కోరుతున్నారు. గోదావరి నదిపై నిర్మించే మూడు బ్యారేజీలు, పంపుహౌజ్‌లతో పాటు కీలకమైన ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరు మార్గం పనుల పురోగతిపై ప్రభుత్వం దృష్టిపెట్టింది.

మేడారం నుండి ఎస్సారెస్పీ వరదకాల్వ ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలించడానికి రామడుగు వద్దపంప్‌హౌజ్‌నిర్మించారు. 139మెగావాట్లసామర్థ్యం ఉన్న ఈ మోటార్ల ద్వారా కాళేశ్వరం నుండి నీటిని తరలించనున్నారు. ఇప్పటికే ఒక మోటారు బిగించి డ్రైరన్ కూడా పూర్తిచేశారు. రెండోమోటారు బిగించడం పూర్తయితే మూడు మాసాలలోపే నీటిని ఎత్తిపోసేందుకు రెండుమోటార్లు సిద్దంగా ఉంటాయి. మేడారం రిజర్వాయర్ నుండి నీటిని లిఫ్ట్ చేసేందుకు మరో ఏడుమోటార్లు సిద్దం చేయనున్నారు. మొత్తంగా కాళేశ్వరం నుండి నీటివిడుదల చేసేందుకు అవసరమైన విద్యుత్ వ్యవస్థల నిర్మాణం చకచకా సాగుతోంది.

బార్లకు 'బార్లా'!

- కొత్త నగర పంచాయతీలకు బార్లు
- నోటిఫికేషన్ జారీ

ఆంధ్రప్రభ, హైదరాబాద్: రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత కొత్త బార్లకు లైన్ క్లియరైంది. నూతనంగా ఏర్పాటైన నగర పంచాయతీల్లో 23 బార్లను అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకుగానూ బుధవారం నోటిఫికేషన్ జారీ కాగా ఈనెల 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఫిబ్రవరి 1న దరఖాస్తుల పరిశీలన చేసి వచ్చే నెల 5నుంచి 8 వరకు లాటరీలను తీయాలని నిర్ణయించారు. ఆ తర్వాత 10 ప్రయారిటీక్లీయెరెన్స్‌లను, 12న లైసెన్సులను జారీ చేయనున్నారు. తద్వారా రూ. 50 కోట్ల అదనపు రాబడిని ఆర్జించాలని పథకం వేసింది.

గ్రేటర్ హైదరాబాద్‌లో గతంలో 13000ల జనాభాకు ఒక బార్‌ను నిర్ణయించగా దానిని 11వేల జనాభాకు కుదించారు. ఇతర ప్రంతాల్లో దీనిని 30వేల జనాభానుంచి 25వేల జనాభాకు తగ్గించారు. అంతే కాకుండా పెరిగిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల రూపంలో కొత్త బార్లకు అనుకూలత పెరిగింది. రాష్ట్రంలో ప్రస్తుతం 804 బార్లు ఉండగా అందులో 509 బార్లు గ్రేటర్ హైదరాబాద్‌లోనే కొలువై ఉన్నాయి.

మార్గదర్శకాలు, నిబంధనలను మరింత కఠినం చేయాలని ఆబ్కారీ శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రతీ బార్ సొంతంగా వంట గదిని కలిగి ఉండాలని ఆహార పదార్థాలను సొంతంగా తయారు చేసేలా కార్యాచరణ రూపొందించింది. పార్కింగ్ సౌకర్యంతోపాటు, టాయిలెట్లు, ఇతర వసతులు, జాతీయ రహదారులకు 100 మీటర్ల అవతల బార్లను నెలకొల్పేందుకు నిబంధనలను కఠిన తరం చేసింది. సీసీటీవి కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజ్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్లకు అందించాలని నిర్ధేశించింది.

రాష్ట్రంలో 4 స్లాబ్‌లలో లైసెన్సు రుసుము వసూలవుతోంది. గరిష్టంగా 20 లక్షలకు పైబడిన జనాభా ఉన్న ప్రాంతంలో రూ.55 లక్షలు, కనిష్టంగా 50 వేల జనాభాలోపు ఉన్న ప్రాంతాల్లో రూ.25 లక్షల లైసెన్స్ రుసుమును వసూలు చేస్తున్నారు. అయితే గతేడాది నుంచి ప్రభుత్వం ఆబ్కారీ విధానాన్ని జూలై 1 నుంచి అక్టోబర్ 1కి మార్చింది. కాగా, మారిన ఆబ్కారీ విధానం కేవలం రిటైల్ షాపులకే పరిమితం కాగా బార్ విధానం మాత్రం జూలై 1 నుంచే కొనసాగుతోంది. ప్రతీ ఏడాది బార్లను రెన్యువల్ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఎప్పటికప్పుడు అవసరాలు, ఇతర కారణాల మేరకు లైసెన్స్ రుసుముల్లో ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేస్తోంది.

రాష్ట్రంలో 804 బార్లు, 17 క్లబ్‌లు, పర్యాటక ప్రాంతాల్లో(టూరిజం డెవలప్‌మెంట్-1) 9 బార్లు మద్యం విక్రయాలను కొనసాగిస్తున్నాయి. పర్యాటక ప్రాంతాల్లో లైసెన్స్ రుసుములు రూ.3 లక్షల నుంచి గరిష్టంగా రూ.6 లక్షల వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు బార్ల కనీస వైశాల్యం 500 చ.మీ.గా ఉంది. ఇకపై ఈ స్థాయి మించి ప్రతీ 200 చ.మీ.లకు అదనంగా 10 శాతం ఫీజులు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

లైసెన్స్ స్లాబ్‌లు...

జనాభా	రుసుము
50,000 వరకు	25,00,000
50,000కి పైబడిన	35,00,000
50,000కి పైబడిన, 20,00,000లోపు	38,00,000
20,00,000కు పైబడి	55,00,000



పంచాయతీరాజ్ వ్యవస్థలోనూ మనమే ఆదర్శం కావాలి

- ఉన్నతాధికారులు, అడ్వకేట్ జనరల్‌తో సీఎం కేసీఆర్ సమీక్ష
- న్యాయపరమైన చిక్కులు, లోటుపాట్లు సవరణపై సమాలోచన
- బిల్లు ముసాయిదాపై లోతుగా చర్చ
- ప్రతి కార్యక్రమంలో పంచాయతీల భాగస్వామ్యం ఉండాలని స్పష్టీకరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలో ఎక్కడా లేనివిధంగా మెరుగైన పంచాయతీరాజ్ వ్యవస్థను ఆవిష్కరించి ఆదర్శంగా నిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆకాంక్షించారు. త్వరలో అసెంబ్లీ ముందుకు రానున్న నూతన పంచాయతీరాజ్ చట్టం ముసాయిదాపై అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత గల ఈ అంశంపై బుధవారం ప్రగతిభవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, కొంతమంది సీనియర్ ఐఏఎస్ అధికారులు, నిపుణులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ఎక్కడా న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా పరిశీలించి చట్టాన్ని రూపొందించాలన్నారు. గ్రామ పంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా విశిష్ట బాధ్యతలు, అధికారాలు ఉన్నాయని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఏ గ్రామానికి ఆ గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయితీ చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరుతాయి. ఇప్పుడున్న విధానం కొనసాగితే ప్రయోజనం లేదన్నారు. ప్రస్తుత గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల భయంకరమైన ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఒకప్పుడు కమ్యూనిటీ డవలప్‌మెంట్ ఏజెన్సీలుగా ఉన్న పంచాయతీలు, స్థానిక సంస్థల రానురాను రాజకీయపరమైపోయాయని, వాటిని ప్రక్షాళన చేయాల్సిన తరుణం ఆసన్నమైందని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యవస్థలో సమూలంగా మార్పు రావాలని, గ్రామ పంచాయితీలను మరింత శక్తివంతం చేయాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

ప్రతీ కార్యక్రమంలో గ్రామ పంచాయితీలను భాగస్వాములను చేయాలన్నదే తన తపన అని వ్యాఖ్యానించారు. ఏ గ్రామానికి ఆ గ్రామం మారితేనే యావత్ తెలంగాణ మనం కలలు కంటున్నట్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కాబట్టి గ్రామ పంచాయితీలు ఎలాంటి విధులు నిర్వర్తించాలి? వారికున్న బాధ్యతలేంటి అనే విషయంలో పూర్తిస్థాయి స్పష్టనిస్తూ కొత్త చట్టం తయారు చేయాలన్నారు. సర్పంచ్‌ల మాదిరిగానే ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు కూడా విధులు, బాధ్యతలపై స్పష్టత రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం విధులు, బాధ్యతలు అప్పగించి దులుపుకుంటే గ్రామ పంచాయితీలు ఏ పనీ చేయలేవని, వాటికి కావాల్సిన నిధులు కూడా అందించాలని సీఎం అభిప్రాయపడ్డారు. వచ్చే బడ్జెట్‌లో నేరుగా గ్రామ పంచాయితీలకు జనాభా ఆధారంగా నిధులు కేటాయిస్తామన్నారు. ఒక్కో గ్రామ పంచాయితీకి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు సమకూరుస్తామని చెప్పారు. కేంద్ర నిధులు, కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కింద లభ్యమయ్యే నిధులు, ఫైనాన్స్ కమీషన్ ద్వారా వచ్చే నిధులు, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూరే డబ్బులు అన్నీ జమచేసి గ్రామ పంచాయితీ అప్పగించాలన్నారు. గ్రామస్తుల్లో కూడా శ్రమదానం ద్వారా పనులు చేసుకునే ధోరణిని అలవాటు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి విధులు, బాధ్యతలతో పాటు కావాల్సిన నిధులు, ప్రజల భాగస్వామ్యం, నిరంతర పర్యవేక్షణ ఉంటే సమర్థవంతంగా పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. అన్ని విధాలా సహకారం అందించినా సరే, నిధుల నిర్వహణలో వైఫల్యం చెందినచోట క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారాలు ప్రభుత్వానికి ఉండాలని స్పష్టం చేశారు. వీటన్నింటికీ అవకాశం కల్పించే విధంగా కొత్త పంచాయతీరాజ్ చట్టం తయారు కావాలని సీఎం అధికారులకు చెప్పారు. ఈ చట్టం కూడా పొరుగు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వాన్ని ఆలోచింపజేసే విధంగా ఉండాలని ఈ సందర్భంగా తేల్చి చెప్పారు.

50 వేల కొలువులు

(మొదటిపేజీ తరువాయి)

నాలుగువేల మంది సిబ్బందిని ఎంపిక చేయవలసిన అవసరం ఉంది. పాఠశాలలు లేని పంచాయతీలను గుర్తించి అక్కడ నూతనంగా పాఠశాలలను ఏర్పాటు చేయడంతో పాటు ఇక్కడ పదివేలకుపైగా ఉపాధ్యాయులను భర్తీ చేయవలసి ఉంటుందని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. తండాలు, ఆవాస ప్రాంతాల్లో ఉన్న చంటి పిల్లలకు, బడీడు పిల్లలకు పౌష్టికాహారం అందజేసేందుకు వీలుగా ప్రతి పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉంటుందని మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రతిపాదించింది. ఇలా చేయడంవల్ల నాలుగువేల మంది అంగన్‌వాడీ టీచర్లు, అంతేమొత్తంలో ఆయాలను ఎంపిక చేయవలసి ఉంటుంది. కొత్తపంచాయతీలలో ప్రజలకు నిత్యావసర వస్తువులు, సరుకులు అందజేసేందుకు వీలుగా రాష్ట్ర పౌర సరఫరాలశాఖ నాలుగువేల చౌక ధరల దుకాణాలను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. దీనివల్ల ప్రత్యక్షంగా నాలుగువేల మందికి ఉపాధి కల్పించినట్లవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా పంచాయతీల్లో పాఠశాలలను ఏర్పాటుచేస్తే మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలి. ఒక్కో పాఠశాలలో వంట చేసేందుకు ఒక వంట మనిషిని సహాయంగా మరో ఇద్దరిని ఎంపికచేస్తే ప్రత్యక్షంగా దాదాపు పదివేల మందికి ఉపాధి దొరికినట్లవుతుందని ప్రభుత్వం చెబుతోంది.

ఇలా వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలతో పాటు విద్యుత్ సంస్థల ఆధ్వర్యంలో లైన్‌మెన్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి పారుదలశాఖతో పాటు విద్యాశాఖకు సంబంధించి విద్యాభివృద్ధి అధికారులను ఎంపిక చేయాలి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారులు, సర్వేయర్ల వివిధ శాఖలకు చెందిన పదివేల మంది ఉద్యోగులు, సిబ్బందిని కొత్త గ్రామ పంచాయతీల్లో నియమించవలసిన ఆవశ్యకత ఉంటుందని చెబుతున్నారు. మొత్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న నాలుగువేల గ్రామ పంచాయతీలు వస్తే 50వేలకుపైగా ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయవలసి ఉంటుందని దీంతో అసంతృప్తిగా ఉన్న నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చినట్లవుతుందని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి హామీ ఇచ్చిన లక్షా 20వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇప్పటికే ప్రకటించిన సీఎం కేసీఆర్ కొత్త పంచాయతీల్లో వస్తున్న 50వేలకుపైగా ఉద్యోగాలను కలిపితే తమ పాలనలో లక్షా 70వేలకుపైగా ఖాళీలను భర్తీ చేసినట్లవుతుందని చెపుకునే అవకాశం ఉంది. కొత్త పంచాయతీలు ఏర్పాటైతే రెవెన్యూ విభజన కూడా జరగవలసి ఉంటుందని ఇందుకు సర్వే అధికారులను నియమించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

సర్వే నెంబర్ల మార్పు, వార్డుల పునర్విభజన వంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయగనే సరిపోదని అక్కడ మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూర్చవలసిన పరిస్థితి ఉంటుందని దీనివల్ల పరోక్షంగా వందలాది మందికి ఉపాధి లభ్యమవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయడంవల్ల గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు వేలాది మంది చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి తద్వారా వారి జీవితంలో మలుపు తిప్పినట్టవుతుందని భావిస్తున్నారు. గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాక ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చే నివేదిక ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖల ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఏయే ప్రభుత్వ శాఖల్లో ఎన్నెన్ని ఉద్యోగాలు భర్తీ చేయాలన్నది స్పష్టత వస్తుందని తద్వారా ఖాళీల భర్తీకి అవసరమైన నిధులను మంజూరు చేసేలా ఆర్థికశాఖకు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తుందని చెబుతున్నారు. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు పుణ్యమా అని గ్రామాల అభివృద్ధితో పాటు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తద్వారా గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు దోహద పడతాయని అంచనా వేస్తున్నారు.

పద్మావత్.. ప్రకంపనల పరాకాష్ఠ..!

(మొదటిపేజీ తరువాయి)

పద్మావతితో పాటు మరికొంతమంది రాజపుత్ మహిళలు తమకు తాము ఆత్మార్పణం చేసుకుంటారు. శతృవుల చేతికి చిక్కడం కంటే వీరవనితలుగా అసువులు బాయడం మేలని ఈ నిర్ణయం తీసుకుంటారు. ఈ కథ వెలువడినప్పటి నుంచి రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పద్మావతి వీరనారిగా ప్రసిద్ధిచెందారు. ఆధునిక యువతకు కూడా పద్మావతి ఒక ఐకాన్‌గా రూపొందారు. అలాంటి పద్మావతి కథను చిత్రంగా తీస్తున్నారన్న వార్త పట్ల రాజ్‌పుత్‌లు ఎలాంటి స్పందన ప్రకటించలేదు. కానీ అత్యంత క్రూరుడైన మహ్మదీయ చక్రవర్తి ఖిల్జీ, పద్మావతిల మధ్య ఓ పాటను చిత్రీకరిస్తున్నారన్న వార్త వారిని ఆవేశానికి గురి చేసింది. దీంతో రాజ్‌పుత్రులు రెచ్చిపోయారు. కర్నిసేన పేరిట చిత్రానికి వ్యతిరేకంగా ప్రదర్శనలిచ్చారు. షూటింగ్ జరుగుతున్న సమయంలోనే రెండుసార్లు దాడులు చేశారు. ఓ సారి షూటింగ్ నిమిత్తం వేసిన టెంట్‌లను దగ్ధం చేశారు. ఇలాంటి పాటలేవీ తమ చిత్రంలో లేవని ఎంతగా దర్శక, నిర్మాతలు స్పష్టం చేసినా వీరి ఆగ్రహం చల్లారలేదు. చివరకు ఈ చిత్రాన్ని ప్రదర్శించేందుకు వీల్లేదంటూ పట్టుబట్టారు. రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ప్రభుత్వం కూడా దీనిపై స్టేలు విధించింది. ఇటీవల ముగిసిన గుజరాత్ ఎన్నికల్లో పద్మావతి చిత్రం కూడా ఓ ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. ఉత్తర భారతం మొత్తం ఈ వివాదంతో కొన్ని రోజులు స్తంభించిపోయింది. ఇప్పటికే పలుసార్లు చిత్రాన్ని వాయిదా వేశారు. చివరకు సర్వోన్నత న్యాయస్థానానికి కూడా ఈ వివాదం చేరింది. సుప్రీంకోర్టు అయితే ఏకంగా ఈ చిత్రాన్ని బాన్ చేయడం కుదరదంటూ తేల్చిచెప్పింది. అవసరమైన రక్షణ చర్యలు చేపట్టే బాధ్యత రాష్ట్రాలదేనని స్పష్టం చేసింది. ఓ వైపు అభ్యంతరకర సన్నివేశాల్లేవు.. రాజ్‌పుత్‌ల మనోభావాల్ని ఏమాత్రం దెబ్బతీసే ప్రయత్నం జరగలేదంటూ నిర్మాణ సంస్థలు పదే పదే మొత్తుకున్నాయి. కానీ వివాదం మాత్రం చల్లారలేదు. ఆఖరకు దేశ చరిత్రలోనే ఇంతవరకు ఏ చిత్రానికి వేయని రీతిలో పద్మావత్‌కు సరికొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో చిత్రంలోని దృశ్యాల్లేవు. పోస్టర్ పొడవున వివరణలే నిండిపోయాయి. ఈ చిత్రం సూఫీకవి జయాసి రచనకు మక్కికిమక్కి కాపీ అని ఈ పోస్టర్లలో స్పష్టం చేశారు. అలాగే ఖిల్జీ, పద్మావతిల మధ్య ఎలాంటి స్వప్న సన్నివేశాలు గాని, డ్యూయెట్లుగాని లేవని స్పష్టం చేశారు. రాజ్‌పుత్‌ల ధైర్య సాహసాల్ని ప్రపంచానికి తెలియజెప్పే ప్రయత్నాన్ని ఈ చిత్రంలో చేశామన్నారు. చిత్రంలో రాణిపద్మావతి పట్ల అత్యంత వినయవిధేయతలు, గౌరవ భావాలు ప్రదర్శించామన్నారు. సెన్సార్ సూచించిన ఐదు సవరణలను చేసామన్నారు. ఈ చిత్రం భారతీయులందరూ గర్వించే విధంగా ఉంటుందంటూ ఈ పోస్టర్‌లో వివరణ ఇచ్చారు. ఇలాంటి పోస్టర్ రిలీజవడం దేశ సినీ చరిత్రలో ఇదే ప్రథమంగా పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ప్రీమియర్‌లు విడుదలయ్యాయి. దీన్ని ఒక చిత్రంగా కాక ఓ కాన్వాస్‌పై వేసిన పెయింట్ తరహాలో దర్శకుడు సంజయ్‌లీలా బన్సాలీ తీర్చిదిద్దినట్లు ప్రాథమిక రివ్యూలు వెల్లడించాయి. చరిత్రనెక్కడా వక్రీకరించలేదని, ఈ చిత్రంలో ఎవరి మనోభావాలకు విఘాతం కలగలేదని కూడా రివ్యూలు తేల్చాయి. ఒక్కసారిగా థియేటర్లోని ప్రేక్షకులంతా 13వ శతాబ్దంలోకి తరలిపోయామన్న భావన వ్యక్తం చేసేలా చిత్రమున్నట్లు విమర్శకులు తేల్చారు. దీన్నొక అత్యద్భుత, సాంకేతిక విజువల్ వండర్‌గా పేర్కొన్నారు.



న్యాయస్థానం ఆదేశాల మేరకు పద్మావతి చిత్రం తన పేరును పద్మావత్‌గా మార్చుకుని గురువారం ప్రపంచవ్యాప్తంగా విడుదలౌతోంది. గుజరాత్‌లో మాత్రం విడుదలను నిలిపేశారు. అక్కడి మల్టీప్లెక్స్ థియేటర్ల సంఘ ప్రతినిధులు ఈ చిత్రాన్ని విడుదల చేసేదిలేదంటూ భీష్మించారు. అయినప్పటికీ గుజరాత్‌లో మంగళవారం నుంచి థియేటర్ల దహనకాండ సాగుతోంది. కొన్ని థియేటర్ల ముందున్న వాహనాల్ని కర్ణిసేన సభ్యులుగా భావిస్తున్న దుండగులు కొందరు దగ్ధం చేసారు. చిత్రాన్ని ప్రదర్శిస్తే థియేటర్లకు కూడా నష్టం తప్పదని హెచ్చరించారు.

గతంలో విశ్వరూపం, ఉత్తమ విలన్ వంటి తమిళ చిత్రాలు కూడా అనేక వివాదాల్ని ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా కులమత విబేధాలు రాజేస్తాయన్న ఆరోపణలకు గురయ్యాయి. చివరకు న్యాయస్థానాల ప్రమేయంతోనే ఈ చిత్రాలు విడుదల కావాల్సి వచ్చింది. పద్మావత్ విషయంలో మతఛాందసం మరింత తీవ్రంగా తన ప్రభావాన్ని చూపించింది. బన్సాలీ గతంలో అత్యద్భుత చిత్రరాజాల్ని తీర్చిదిద్దారు. చరిత్రను కళ్ళ ముందు తీర్చిదిద్దారు. మతాలు, ప్రాంతీయత భావాలు ఇకముందు కూడా చిత్ర కథలో కథనాల్ని మనోభావాల పేరిట నియంత్రించే ప్రయత్నం సాగితే భవిష్యత్‌లో చారిత్రక, యదార్థ నేపథ్యం గల చిత్రాల నిర్మాణానికి మరెవరూ సాహసించరని విమర్శకులు వాపోతున్నారు.

నా వ్యూహాలు వేరు!

- జై తెలంగాణ అంటే ఒక సామాజిక మార్పునకు సంకేతం • ఉడుకు నెత్తురున్న, సలసల కాగుతున్నయువత కావాలి
- గుండెల నిండా.. అన్నా మేమున్నాం అంటూ ఆడపడుచులు కదం తొక్కాలి • ఓటుబ్యాంకు రాజకీయాలు చేయను
- మానవత్వంతో కూడిన రాజకీయాలు చేస్తా • కులాలు, మతాలను అర్థం చేసుకోవాలి • నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ సమస్యపై న్యాయ పోరాటం • నాపై ఎలాంటి దాడులు చేసినా భరిస్తా.. ఎదురుదాడి చేయను • సంక్షేమ హాస్టళ్ళ పరిస్థితిని చక్కదిద్దండి • ప్రజల కోసం నా జీవితాన్ని ధారపోస్తా • నాకు అందరి అండ కావాలి
- ఖమ్మం చలోరే.. చలో సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

(ఆంధ్రప్రభ న్యూస్ నెట్‌వర్క్)

జై తెలంగాణ అంటే ఒక సామాజిక మార్పునకు సంకేతమని, ఏ జై తెలంగాణ ఉద్యమం ఏ ఆశయంతో ముందుకు వెళ్ళిందో ఆ ఆశయం కోసం జనసేన పని చేస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. జనసేనకు ఓటుబ్యాంకు రాజకీయాలు అవసరం లేదని, మానవత్వంతో కూడిన రాజకీయాలు చేయాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని ఆయన చెప్పారు. జిల్లాల పర్యటనల్లో భాగంగా బుధవారం మూడో రోజు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన జనసేన పార్టీ సమన్వయకర్తల సమావేశంలో పవన్ కళ్యాణ్ ఉద్విగ్న ప్రసంగం చేశారు.

వృద్ధాశ్రమ నిర్వాహకురాలికి పాదాభివందనం



ఖమ్మం సిటీ బ్యూరో, ప్రభ న్యూస్ : జిల్లా కేంద్రంలో జరిగిన మూడు జిల్లాల స్థాయి జనసేన పార్టీ సమన్వయ కర్తల సమావేశంలో ఆ పార్టీ అధినేత పవన్ అభిమాని, ఖమ్మం నగ రంలోని పాండురంగాపురం జీసస్ వృద్ధాశ్రమం నిర్వాహ కురాలు లక్ష్మిని పలకరించి పవన్ కళ్యాణ్ పాదాభి వందనం చేయడం ఆసక్తికరంగా మారింది. జనసేన పార్టీ ఆహ్వానం మేరకు సభా వేదిక వద్దకు వచ్చి ఉన్న ఆమె పుష్పగుచ్ఛంతో పవన్‌ను కలిసి ఆలింగనం చేసుకుని కంటతడి పెట్టింది. వెంటనే ఆమెను ఓదారుస్తూ నీలాంటి వారు ఈ సమాజానికి కావాలమ్మా, తల్లిలాంటిదానివి.. ఎందరికో తల్లిగా ఉంటు న్నావు అంటూ ఆమెకు పాదాభి వందనం చేశారు. గతంలో ఆ వృద్ధాశ్రమం నిర్వహణ కోసం పవన్ కళ్యాణ్ కొంత ఆర్థిక సహాయం కూడా చేశారు.

దివ్యాంగుడిని హత్తుకున్న పవన్

సమావేశం ముగిసిన అనంతరం హాల్ నుండి బయటకు వెళ్తుండగా, ఆకస్మికంగా ఒక దివ్యాంగుడు పవన్‌కళ్యాణ్‌కు ఎదురుపడడంతో హత్తుకుని అతడితో సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు, జనసేన కార్యకర్తలు పవన్‌ను కలిసేందుకు పోటీ పడ్డారు. పోలీసులకు అదుపుచేయడం కష్టంగా మారింది.

అధికార కాంక్ష లేదు.. అసెంబ్లీలో గళం వినిపిస్తాం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కులాల మధ్య చిచ్చుపెట్టే ఇష్టం తనకు లేదని తెలంగాణలో ఎలా మాట్లాడాలో బేరీజు వేసుకుని ముందుకు వెళతానని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పారు. మూడు రోజుల తన జిల్లాల యాత్రను ముగించుకుని హైదరాబాద్ వచ్చిన పవన్ ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇస్తూ తెలంగాణ ఉద్యమం ఓర్పుగారు, నేర్పుగా జరిగిందని చెప్పారు. సీఎం పదవి కోసమో, అధికారం కోసమో జనసేన పని చేయదని ప్రజలు పడుతున్న కష్టాలు, ఇబ్బందులను చట్టసభల్లో గళం ఎత్తడానికే తాను రాజకీయ రంగప్రవేశం చేశానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమస్యలపై అవగాహ నకు సమయం పడుతుందని అన్నారు. తెలంగాణలోని అంశాలపై జోక్యం చేసుకుంటే తనను వేరుగా చూస్తారని, రాజకీయాలలో తిట్టుకోవడం, నీచమైన భాషను ప్రయోగిం చడం మంచి సంప్రదాయం కాదని అన్నారు. విమర్శలు సద్విమర్శల్లాగే ఉండాలని హితవు పలికారు. తెలంగాణలో సీఎం కేసీఆర్‌కు, ఏపీలో అక్కడి సీఎం చంద్ర బాబుకు అనుకూలంగా మాట్లాడు తున్నానని కొన్ని రాజకీయ పక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మంచిని మంచనే సంప్రదాయం తనదని ఏ ప్రభుత్వం తప్పు చేసినా నిలదీస్తానని చెప్పారు. తన రెండు రోజుల పర్యటనకు కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని వాటిని బేరీజు వేసుకుని ముందస్తు వ్యూహాలను ఖరారు చేసు కుంటానని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన, రాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమాలు, ఆందోళ నలు తాను చూశా నని రాష్ట్ర సాధన చాలా ఓర్పుతో, నేర్పుతో జరిగిందని చెప్పా రు. తనకు అధికార కాంక్షలేదని, ప్రజల సమస్యలే పర మావధిగా 2019 ఎన్నికలలో బరిలోకి దగుతానని చెప్పారు.

బాధ్యతతో కూడిన రాజకీయ వ్యవస్థ రావాలంటే.. జనసేనకు ఉడుకు నెత్తురున్నా, సలసల కాగుతున్న యువత కావాలని చెప్పారు. మార్పును కోరే యువత జనసేనకు కావాలని, గుండెల నిండా అన్నా మేమున్నామంటూ కదంతొక్కే ఆడపడుచులు జనసేనకు అవసరమని చెప్పారు. అందుకే తాను ఎంతో బాధ్యతగా ఉంటానని మెత్తగా, అనుకువగా మాట్లాడే తనను కొన్ని రాజకీయ పక్షాలు విమర్శించినా తానేమీ పట్టించుకోనని తెగేసి చెప్పారు. ఎంతో బాధ్యతతో కూడిన రాజకీయాలు చేయడానికే తాను జనసేనను ప్రారంభించానని కొంతమంది తనను రకరకాలుగా విమర్శించినా ఒరిగేదేమీ లేదని అలా విమర్శిస్తే తనకు సంతోషమేనని ప్రజల సమస్యల సాధనకు తాను ఎలాంటి దాడులకైనా సిద్ధమని స్పష్టంచేశారు. తన మీద భౌతిక, మాటల దాడులు చేసినా భరిస్తానని ఎదురుదాడి మాత్రం చేయనని చెప్పారు. తనకు సమాజంపట్ల చాలా బాధ్యత ఉందని పేర్కొన్నారు. తన సినిమా విజయవంతమైనపుడు శత దినోత్సవం కూడా జరుపుకోనని, పండుగలు, పబ్బాలు, శత దినోత్సవాల పేరుతో ప్రజలు నలిగిపోవడం తనకెంత మాత్రం ఇష్టంలేదని చెప్పారు. రాజకీయ వ్యవస్థలో చిన్నపాటి మార్పు తీసుకురావడానికి జనసేన కంకణం కట్టుకుందని చెప్పారు. రాజకీయాల్లో వచ్చిన తనకు, తన జీవితంలో ఇబ్బందులు ఎదురవుతాయన్న విషయం తనకు తెలుసునని ప్రజా జీవనం ఇబ్బందికి గురైనపుడు చేతులెత్తేసే మనతత్వం తనది కాదని తప్పులు జరిగితే మనస్ఫూర్తిగా క్షమించమని కోరుతానని చెప్పారు. ఎవరి జీవితాన్ని ఇబ్బంది పెట్టడానికి తనకు ఇష్టంలేదని అందరి జీవితాల్లో వెలుగు నింపడమే జనసేన లక్ష్యమని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కాన్షీరాం, నారాయణ్‌గురు, పెరియార్ ఆలోచనా విధానంతో జనసేనను ముందుకు తీసుకువెళతానని చెప్పారు. సినిమాల్లో కొనసాగితే తనను ఎవరూ విమర్శించరని ఆరోపణలు కూడా చేయరని అందరూ ప్రేమిస్తారని అయితే రాజకీయాల్లోకి రాగానే ప్రతి ఒక్కరూ తనను దూషించడానికి అపారమైన అవకాశాలు వచ్చాయని చెప్పారు. తనను కొట్టినా, తిట్టినా, దాడి చేసినా భరిస్తానని, సహిస్తానని, తాను ఒక్కమాట కూడా ఎదురు మాట్లాడనని తెలిపారు. తన పని తాను చేసుకుంటూ వెళతానని తనను ప్రేమించే వాళ్ళకే సమయంకానీ, ద్వేషించే వాళ్ళకే సమయం లేదని అన్నారు. సినిమాల్లో రెండున్నర గంటలు నటించి ప్రేక్షకులను సంతోష పెడతానని అదే రెండున్నర గంటల్లో సినిమాలో సమస్యను పరిష్కరిస్తే ప్రేక్షకులు కరతాళధ్వనులు చేస్తారని పేర్కొన్నారు. కానీ సామాజిక మార్పు రావాలంటే నిజజీవితంలో వచ్చి క్షేత్రస్థాయిలో పనిచేస్తే తప్ప మార్పు రాదని, అందుకనే సమాజంలోని అందరి అండదండలు తనకు కావాలని వేడుకుంటున్నానని చెప్పారు. సమాజంలోని యువతీ యువకుల అండదండలు, వారి తల్లిదండ్రులు ఆశీర్వచనాలు, ఆడపడుచుల దీవెనలు జనసేనకు మరెంతో అవసరమని ఆయన తెలిపారు. భారతదేశ రాజకీయాలను, తెలుగు రాష్ట్రాల్లో పరి స్థితుల్లో మార్పు తీసుకురావాలంటే ప్రస్తుతం ఉన్న కుల వ్యవస్థను అర్థం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పా రు. తనకు కులం లేదు, మతం అంతకన్నా లేదు, ప్రాంతం లేనేలేదు, తాను మానవత్వాన్ని, జాతీయతను గౌరవిస్తానని చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినపుడు కులాలను ఖచ్చితంగా అర్థం చేసుకోవాలని తెలిపారు. కులాల అంశం సామాజిక అంశమని ఈ సామాజిక సత్యాన్ని అర్థం చేసు కోకుండా తెలుగు రాష్ట్రాల రాజకీయాలను, జాతీయ రాజకీయాలను అవగతం చేసుకోవడం ఎంతో క్లిష్టమని ఆయన చెప్పారు. తాను రాజకీయాల్లో రావడానికి అత్యంత ప్రధాన కారణాల్లో నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ సమస్య ఒకటని గుర్తుచేశారు. తాను నటించిన తమ్ముడు సినిమా ప్రదర్శన వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పండుగ జరుపుకోకుండా అందుకు ఖర్చయ్యే మొత్తంతో నల్గొండ జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించాలని భావించానని, అయితే అప్పట్లో జిల్లాలోని వివిధ రాజకీయ పక్షాలు తనను గ్రామాన్ని దత్తత తీసుకోకుండా అడ్డు తగిలాయని ఆరోపించారు. ఒక మంచి పని చేయడానికి ఎందుకు ఇన్ని అడ్డంకులు, వ్యతిరేకత అని ఆయన ప్రశ్నించారు. ఒక సమస్యతో ప్రజలు నలిగిపోతున్నపుడు రాజకీయ పక్షాలు తమ పబ్బం గడుపుకోవడానికి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారానికి ఎలాగైతే న్యాయ పోరాటం చేస్తున్నామో నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రాంత సమస్యల పరిష్కారానికి అదే రీతిలో ముందుకు వెళ్ళాలన్నది జనసేన లక్ష్యమని ఇందుకు యువత సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అభిమానులను, చిన్నపిల్లలను, ఓటుహక్కు లేని వారు జనసేన చుట్టూ తిరుగుతున్నారన్న ఆరోపణలను ఆయన నిర్ద్వంద్వంగా ఖండించారు. నేను అందరి కోసం పని చేస్తానని గతించిన తరాల కోసం ఆలోచించనని చెప్పారు. పసిపిల్లలకు పౌష్టికాహారం లోపం ఎంతో ఉందని ఈ సమస్యను ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. ఎవరెన్ని మాట్లాడినా ఇంకా బలంగా సమస్యల పరిష్కారానికి జనసేన పోరాడుతుందని ఆయన తెలిపారు. మనుషులను విడదీయడం మానవత్వం కాదని, వారిని కలపడమే మానవత్వమని, ఆ మానవత్వం కలిగిన రాజ కీయాలు చేసేందుకు జనసేన ఉద్భవించిందని చెప్పారు. చిన్న వ్యాపారం చేయాలన్నా బాధ్యతతో నిర్వర్తించాలని, అలాగైతేనే లాభాలు వస్తాయని గుర్తుచేశారు. జనసేనకు ముఖ్యంగా తనకు రకరకాల వ్యూహాలు ఉంటాయని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు వేస్తుంటానని గుర్తుచేశారు. సామాజిక న్యాయం కేవలం అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు వస్తే రాదని సమాజంలో ఉన్న బడుగు, బలహీన అట్టడుగు వర్గాల సంక్షేమానికి జనసేన కృషి చేస్తుందని చెప్పారు. రాజకీయాల్లో అన్ని కులాలకు సమాన ప్రాతినిథ్యం లభించాలని అంబేద్కర్ చెప్పినట్టు కుల నిర్మూలన జరగాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఉన్న అన్ని కులాలకు న్యాయం జరిగేలా జనసేన ప్రయత్నిస్తుందని అందులో భాగంగా త్వరలోనే అన్ని కులాల నాయకులతో సంప్రదింపులు జరిపి వారి వారి సమస్యలపై అధ్యయనం చేస్తానని పేర్కొన్నారు. లోతైన ఆలోచనా విధానంతో ముందుకు వెళతానని సామాజిక మార్పుకు అండగా ఉంటానని చెప్పారు. మతాల ప్రస్తావన లేని రాజకీయాలు రావాలని, ప్రతి కులానికి, మతానికి చెందిన వారికి అవకాశాలు రావాలని డిమాండ్ చేశారు. జై తెలంగాణ నినాదం తనకు ఇష్టమని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. చిత్తశుద్ధితో అవినీతి లేని రాజకీయ పోరాటం చేస్తానని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

తెలంగాణ స్మార్ట్‌సిటీ హ్యాక్‌థాన్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ స్మార్ట్‌సిటీ హ్యాక్‌థాన్ - 2018ని రాష్ట్ర ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఆవిష్కరించారు. తెలంగాణలోని ఆరు స్మార్ట్‌సిటీస్‌లో ఈ హ్యాక్‌థాన్‌ను నిర్వహించారు. స్మార్ట్‌సిటీస్‌లో ప్రభుత్వ శాఖలు గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఈ హ్యాక్‌థాన్ కార్యక్రమంలో చేపడతారు. దాదాపు 6వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ హ్యాక్‌థాన్‌లో పాల్గొని మెంటార్స్ సూచనల మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. హ్యాక్‌థాన్ గ్రాండ్ ఫినాలే ఏప్రిల్ మొదటి వారంలో ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో నిర్వహించనున్నట్లు జయేష్ రంజన్ తెలిపారు.

పవర్ కట్‌చేస్తే భారీ పెనాల్టీ

(మొదటిపేజీ తరువాయి)

అపరాధ రుసుము రూపేణా రూ.1,000 చెల్లించాలని ఉంది. కానీ ఇప్పటిదాకా ఏ ఒక్క డిస్కమ్ పైన కూడా అలాంటి అపరాధ రుసుమును విధించిన దాఖలాలు లేవు. ఇ-మొబిలిటిపై ఒక సదస్సుకు హాజరైన సందర్భంగా కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్.కె.సింగ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి డిస్కమ్‌ల లైసెన్సు పునరుద్ధరించాలనే ఒక నియమం సవరణ బిల్లులో ఉంది. తద్వారా సదరు డిస్కమ్ సరిపడ విద్యుత్ సరఫరా చేయగలదా లేదా అని నియంత్రణ వ్యవస్థ నిర్ధారిస్తుందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెంపుదల కోసం కొత్తగా కరెంట్ కనెక్షన్ ఇవ్వడాన్ని నెల రోజుల నుంచి వారం రోజులకు తగ్గిస్తున్నట్టు మంత్రి చెప్పారు. అప్రకటిత విద్యుత్ కోతలపై భారీ పెనాల్టీ విధింపు 2019, ఏప్రిల్ నెల నుంచి అమల్లోకి వస్తుంది అని తెలిపారు. ప్రత్యక్షనగదు బదలీ ద్వారా లక్షిత వినియోగదారులకు సబ్సిడీ గురించి ఆయన మాట్లాడారు. చట్టంలో అవసరమైన మార్పులు చేస్తామని తెలిపారు.

గడప గడపకూ టీఆర్ఎస్



(మొదటిపేజీ తరువాయి)

చైర్మన్ల పదవులను కూడా ఫిబ్రవరిలోనే భర్తీ చేసే అవకాశం ఉందని పార్టీవర్గాలలో చర్చ జరుగుతోంది. ఇక పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ఎమ్మెల్యేలతో సమన్వయం.. బాధ్యతలపై స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో వందసీట్లు సాధించాలన్న లక్ష్యం పెట్టుకున్న టిఆర్ఎస్ అందుకనుగుణమైన వ్యూహాన్ని రూపొందిస్తోంది.

హైదరాబాద్‌లోనే వార్షికోత్సవ సభ?

పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే సభను ఈ ఏడాది కూడా హైదరాబాద్‌లోనే నిర్వహించేందుకు టిఆర్ఎస్ మొగ్గుచూపుతోంది. గత ఏడాది హైదరాబాద్‌లో ప్లీనరీ, వరంగల్‌లో బహిరంగసభ నిర్వహించగా.. అంతకుముందు ఖమ్మంలో నిర్వహించారు. నల్లగొండలో నిర్వహిస్తే ఎలా ఉంటుందన్న దానిపైనా పార్టీలో చర్చ జరుగుతోంది. వార్షికోత్సవ సభలో దీక్షబూనే పలు కార్యక్రమాలతో సాధారణ ఎన్నికలు లక్ష్యంగా క్యాడర్‌ను నవ్యోత్సాహంతో పరుగుపెట్టించాలన్న ఆలోచనలు జరుగుతున్నాయి. ఇక అనుబంధసంఘాల సభలు కూడా నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోంది. విద్యార్థి, మహిళా, రైతు, కార్మికవిభాగాలపై మరింత దృష్టి కేంద్రీకరించనున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 25 జనవరి 2018

మోడీ గళంతో కదలిక!

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన ప్రసంగం అందరిలో కదలిక తెచ్చింది.ఆలోచనల్లో పడవేసింది. అంతర్జాతీయంగా మానవాళి మనుగడను సవాల్ చేస్తున్న ఉగ్రవాదం ఎంత ప్రమాదకరమైనదో, సంపన్న దేశాలు అనుసరిస్తున్న స్వీయ రక్షణ విధానాలు కూడా అంతటి ప్రమాదకరమైనవేనన్నదే ఆయన ప్రసంగం అంతరార్థం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన అంతర్జాతీయ సంస్థలు ఏడు దశాబ్దాలు దాటినా కొన్ని దేశాల అదుపాజ్ఞలలో కొనసాగడం నానాటికీ విస్తరిస్తున్న మానవ నాగరికతకు చేటు తెస్తాయన్న వాస్తవం ఆయన హెచ్చరికలో ఉంది. ముఖ్యంగా, ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు ఇప్పటికీ అగ్రరాజ్యం, దాని మిత్ర దేశాల అధీనంలోనే ఉన్నాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ సంస్థల్లో ప్రాతినిధ్యం లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న లోటు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మన దేశం సాగిస్తున్న యత్నాలను చైనా మినహా ఆ మండలిలో శాశ్వత సభ్యత్వం గల దేశాలన్నీ స్వాగతిస్తున్నాయి. పాకిస్తాన్ కోసం చైనా వ్యతిరేకిస్తోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి వర్ధమాన దేశాల పట్ల చూపుతున్న వివక్ష కూడా ప్రపంచ ఆర్థిక వేదికపై చర్చించాల్సిన ప్రధానాంశం. అభివృద్ధి చెందిన దేశాల అజమాయిషీలో తయారైన అజెండా ప్రకారమే అక్కడ చర్చించడం గడిచిన నలభై ఎనిమిది సంవత్సరాల నుంచి సాగుతున్న తతంగం. ఈ వేదికపై అభివృద్ధి చెందిన, సంపన్న దేశాల నాయకుల ప్రసంగాలు, ఈ వేదికపై ఆమోదించే తీర్మానాలు షరా మామూలుగానే ఉంటున్నాయి. మోడీ ప్రస్తావించిన ఉగ్ర వాదం, స్వీయ రక్షణ విధానం, భూతాపం ఈనాడు యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తున్న ప్రధాన సమస్యలు. ఆయన దేశాల మధ్య పెరుగుతున్న అసమానతల గురించి ప్రస్తావించారు. తన ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) గడిచిన ఇరవై సంవత్సరాల్లో బాగా పెరిగిందన్న మాట నిజమే కానీ, అదే సందర్భంలో అసమానతలు పెరిగిన వాస్తవాన్ని ఆయన కాదనలేరు. ప్రపంచ వేదికపై అగ్రరాజ్యం, సంపన్న దేశాల విధానాలు వర్ధమాన దేశాల ఎదుగుదలకు ఏవిధంగా గుదిబండగా తయారయ్యాయో వివరించడమే ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రపంచ దేశాల్లో అంతా ఒకటేనన్న భావన కనుమరుగు కావడాన్ని గురించి మోడీ వివరించిన తీరు దావోస్ సదస్సు ప్రతినిధులను ఆలోచింపజేసేదే. ఏవిధమైన ప్రయాణ సౌకర్యాలు, సమాచార మార్పిడి సౌలభ్యాలూ లేనప్పుడే అంతా కలిసి ఉన్నాం. ఇప్పుడు ఇలాంటి సౌకర్యాలు ఎన్ని ఉన్నా ఒంటరి తనాన్ని అనుభవించడం మనిషిలో, దేశాల్లో వచ్చిన మార్పునకు సంకేతం. ఇదే విషయాన్ని ప్రధాని చాలా సూటిగా వివరించారు. భూమి మీద సంపద ఏ కొన్ని దేశాలదో, ఏ కొన్ని ప్రాంతాలదో కాదు. మానవాళి కోసమేనన్న విశ్వజనీన సూత్రాన్ని విస్మరించడంవల్లనే సమస్యలు ఉత్పన్నమవుతున్న మాట వాస్తవం. చమురు ఉత్పత్తులను తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఆ విషయం ప్రస్తావించారు. ఉగ్రవాదం అనేది నాగుపాము వంటిదనీ, ఉగ్రవాదంలో తక్కువ, ఎక్కువ ప్రమాదకరమైనది లేదన్న వాస్తవాన్ని మన దేశం మొదటి నుంచి స్పష్టం చేస్తూనే ఉంది. దానిని గ్రహించడానికి అగ్రరాజ్యమైన అమెరికాకు రెండు దశాబ్దాలు పట్టింది. తనదాకా వస్తే గాని తెలియదన్న చందంగా వ్యవహరించిన అమెరికా పాక్‌ని ఇప్పుడిప్పుడే హెచ్చరిస్తోంది. స్వీయ వాణిజ్య అవసరాల కోసం తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు పాకిస్తాన్‌ని వెనకేసుకొస్తున్న చైనా భ్రమలు తొలగిపోయే రోజు ఎంతో దూరంలో లేదు. ఆర్థికాంశాల పై చర్చించే వేదిక పై ఈ సమస్యల ప్రస్తావన అవసరమా?అన్న సందేహం ఎవరికైనా కలగవచ్చు. ఆధునిక కాలంలో ఇవన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉండటం వల్లనే ప్రధాని ప్రస్తావించారు. భూతాపం అంశం కూడా. పారిస్‌లో కుదిరిన ఒప్పందం నుంచి తమ దేశం ఉపసంహరించుకుంటుందన్న ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక కోణం నుంచే చేశారు. ఉద్గారాలను తగ్గించేందుకు చర్యలుతీసుకుంటే నిరుద్యోగ సమస్య ఏర్పడుతుందని ఆయన బహిరంగంగానే అన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ప్రాధాన్యం అమెరికన్లకేనంటూ ఆయన పదే పదే స్పష్టం చేయడం కూడా ఆర్థిక కోణం నుంచి చేసిందేనన్నది సుస్పష్టం. ఐసిస్ సంస్థ పోగు చేసిన అపారమైన సంపద ఉగ్రవాదుల దాడుల కోసమేననడానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. ఆర్థికాంశాల్లో దేశాల మధ్య, దేశాల్లోని వివిధ వర్గాల మధ్య అంతరాలు తగ్గినప్పుడే మానవ సమాజం సంక్షోభాల నుంచి విముక్తమవుతుంది. మోడీ ప్రస్తావించిన ఈ 3 అంశాలు ఆర్థిక వేదికపై కదలిక తెచ్చాయి.

పాఠకీయం

పరిణామ సిద్ధాంతం- అధికారిక రాద్ధాంతం

కేంద్ర మానవ వనరుల శాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పని సెలవిచ్చారు. దానికి ఆయన తెచ్చిన రుజువేమిటంటే ఆ సిద్ధాంతం చెప్తున్నట్టుగా కోతి నుండి మనిషి పుట్టాడన్నది ఎవరూ చూడలేదు, రాయలేదు కదా అన్నది. వాదన బాగానే ఉంది గానీ ఒక శాస్త్రీయ సిద్ధాంతం తప్పు అని నిరూపించడానికి వితండ వాదన ఒక్కటే సరిపోదు. ప్రత్యామ్నాయ వైఖరికి మద్దతుగా బలమైన, నిరూపించదగ్గ సాక్ష్యాలు కావాలి. ఆయన ఇంతటితో ఆగినా బాగుండేది. పాఠ్యాంశాల్లోంచి డార్విన్‌సిద్ధాంతాన్ని తొలగించాలని ఏకాఏకీ తీర్మానించారు. అది బరితెగింపు. బాధ్యతా రాహిత్యం. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు చెప్తున్నాయి. అమాత్యులు అందుకు భిన్నంగా ప్రవర్తించరాదు. వెన్నెముక నిర్మాణ రీతులు, చేతులకు ఐదు వేళ్లుండడం లాంటి సారూప్యాలతో బాటు డీ యెన్ ఏ స్టడీస్ అన్నీ డార్విన్ ప్రతిపాదిత మానవ పరిణామ సిద్ధాంతాన్ని మరింత బలపరుస్తున్నాయి. అందుకు వ్యతిరేక వాదనలేవీ శాస్త్ర పరీక్షల గీటురాయికి నిలిచేవి కావు. శాస్త్ర విజ్ఞానమెప్పుడూ నేనేది చెప్తే అదే సత్యం అనదు. ససాక్ష్యంగా రుజువులుంటే మార్పునంగీకరిస్తుంది. ఆ సాక్ష్యాలు తిరుగులేకుండా నిరూపించదగినవిగా ఉండాలి. బాధ్యతాయుత పదవుల్లో ఉండే వ్యక్తులు ఆషామాషీగా మాట్లాడకుండా వుంటే అదే వారు శాస్త్ర విజ్ఞానానికి చేసే పెద్ద మేలు. (మంత్రి గారు కోతి నుండి మనిషి ఉద్భవించాడంటే నమ్మలేక పోవచ్చు. కానీ బుద్ధుల్లో మనిషి నుండి కోతిగా మారొచ్చనేది నమ్మి తీరాలి. మరి అదే .. పరిణామ సిద్ధాంతం. కాకపోతే ఉల్టాపల్టా)

● డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీ పురం.

స్వతంత్రతలోనూ సర్వోన్నతమే!

సుప్రీంకోర్టును తెలుగులో సర్వోన్నత న్యాయ స్థానం అని అంటున్నాం. దిగువ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నెలకొని ఉన్న న్యాయస్థానాల్లో పరిష్కారం కాని కేసులు సుప్రీంకోర్టుకు వెళ్తుంటాయి. న్యాయం కోరే వారికి పరిష్కారానికి చివరి అవకాశం సుప్రీంకోర్టులోనే లభిస్తుంది. ప్రతిదేశంలోనూ సుప్రీంకోర్టు ఉంటుంది. రాజ్యాంగం మూల స్తంభాల్లో ఒకటైన న్యాయవ్యవస్థ సర్వస్వతంత్రమైనది. మన పొరుగున ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో సుప్రీంకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాలు, తొలగింపులలో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటుంది. పాకిస్తాన్ అధ్యక్షునిగా జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ కొనసాగిన కాలంలో సుప్రీంకోర్టు, న్యాయ మూర్తులను తొలగించే అధికారాన్ని అధ్యక్షునికి దఖలు పడేట్టు రాజ్యాంగాన్ని మార్చి వేశాడు. మన దేశంలో అటువంటి ప్రయత్నాలు ఎమర్జెన్సీ కాలంలో జరిగినా, ప్రజాస్వామ్యవాదుల చైతన్యస్ఫూర్తి వల్ల ఫలించలేదు. మన దేశంలో న్యాయవ్యవస్థకు అంతటి విశిష్ట స్థానం ఉంది. కొద్ది రోజుల క్రితం సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన నలుగురు న్యాయమూర్తులు చరిత్రలో కనీ వినీ ఎరుగని విధంగా మీడియా ముందుకు వచ్చి, సుప్రీంకోర్టు పనితీరుపై విమర్శలు చేయడంతో సుప్రీంకోర్టు వార్తల్లోకి వచ్చింది. మన దేశంలో సుప్రీం కోర్టు పూర్వాపరాలను గురించి సింహావలోకనం....

1921 నుంచి 1964 వరకూ మధ్య కాలంలో మన న్యాయవ్యవస్థ గురించి పరిశీలించినప్పుడు పది ముఖ్యమైన సంఘటనలు ప్రస్తావనకు వస్తాయి.ఈ పదింటిని వరుస క్రమంలో పరిశీలించినట్టయితే, మొదటిగా సర్ హరిసింగ్ గౌర్ తీర్మానం గురించి చెప్పుకోవల్సి ఉంటుంది. 1921లో కేంద్ర శాసనసభలో ఆయన ప్రవేశపెట్టిన ఈ తీర్మానంలో స్వదేశీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పాలనా పరంగా మా వ్యవహారాలను మాకు వదిలి వేయమని బ్రిటిష్ పాలకులను కోరడం అప్పుడే ప్రారంభమైంది. భారత జాతీయ నాయకులు కూడా బ్రిటిష్ పాలకులపై అప్పుడే ఒత్తిడి ప్రారంభించారు. భారత దేశంలో కేంద్రీకృత న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం గురించి వారు బ్రిటిష్ పాలకుల దృష్టికి తెచ్చారు.

బ్రిటిష్‌పాలనలో హైకోర్టుల్లో పరిష్కారం కాని కేసులను లండన్‌లోని ప్రీవీ కౌన్సిల్‌కి పంపేవారు. మన న్యాయ వాదులే అక్కడికి వెళ్ళి వాదించేవారు. ఆరోజుల్లో లండన్‌కే కాదు, మరే విదేశానికి వెళ్ళాలన్నా ఓడల్లోనే ప్రయాణం. ఎక్కువ రోజులు పట్టేది. కేసుల పరిష్కారం మరింత జాప్యమయ్యేది. అందువల్ల హైకోర్టుల్లో పరిష్కారం కాని కేసుల విచారణకు దేశంలోనే అత్యున్నత న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆ రోజుల్లో న్యాయ వాదులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులను బ్రిటిష్ పాలకులకు తీసుకునివచ్చారు. ఆ ప్రయత్నంలో భాగంగానే గౌర్ కేంద్ర శాసనసభలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆయనకు మద్దతుగా మరికొందరు వాదించారు. వారి ప్రయత్నాలు ఫలించలేదు. ప్రీవీ కౌన్సిల్ అధికారాలను తగ్గించడం ద్వారా భారత ప్రయోజనాలు మెరుగవుతాయన్న నమ్మకం ఆనాటి నాయకులకు కలగకపోవడమే ఇందుకు కారణం. ప్రీవీ కౌన్సిల్ విశ్వసనీయతకూ, నిష్పాక్షికతకూ పేరొందడంతో దాని పట్ల ఆ నాటి నాయకులకు నమ్మకం ఉండేది.

మరో పరిణామం 1930లో చోటుచేసుకుంది. లండన్‌లో జరిగిన ఇండియన్ రౌండ్ టేబిల్ సమావేశంలో తొలిసారిగా సమాఖ్య స్ఫూర్తి ప్రస్తావన వచ్చింది. భారత దేశంలోని రాష్ట్రాల తరఫు ప్రతినిధి ఈ సమావేశంలో ఈ ప్రస్తావన చేశారు. బ్రిటిష్ పాలనలో ఉన్న భారత దేశంలోని ప్రావిన్స్‌ల(రాష్ట్రా ల) హైకోర్టుల తీర్పులపై అప్పీళ్ళకు భారత



1921 నుంచి 1964 వరకూ మధ్య కాలంలో మన న్యాయవ్యవస్థ గురించి పరిశీలించినప్పుడు పది ముఖ్యమైన సంఘటనలు ప్రస్తావనకు వస్తాయి.ఈ పదింటిని వరుస క్రమంలో పరిశీలించినట్టయితే, మొదటిగా సర్ హరిసింగ్ గౌర్ తీర్మానం గురించి చెప్పుకోవల్సి ఉంటుంది. 1921లో కేంద్ర శాసనసభలో ఆయన ప్రవేశపెట్టిన ఈ తీర్మానంలో స్వదేశీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పాలనా పరంగా మా వ్యవహారాలను మాకు వదిలి వేయమని బ్రిటిష్ పాలకులను కోరడం అప్పుడే ప్రారంభమైంది.

దేశంలోనే ఫెడరల్ కోర్టు ఒకదానిని ఏర్పాటు చేయాలని ఆయన ఆ ప్రస్తావనలో కోరారు. రాజ్యాంగాన్ని స్థానిక పరిస్థితులకు అన్వయింపజేయడానికి ఫెడరల్ కోర్టు ఉండాల్సిన అవసరం గురించి ఆయన నొక్కి వక్కాణించారు. ఈ విషయమై స్థూలంగా కుదిరిన అంగీకారం పూర్తిగా ఫెడరల్ పరిమితులతో కేంద్ర ట్రిబ్యునల్ ఏర్పాటుకు నాంది పలికింది. అప్పిలేట్ పరిధి లేకుండా ఫెడరల్ కోర్టు కోసం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్‌ని 1935లో ఆమోదించారు. అప్పిలేట్ అధికారాలను ప్రీవీ కౌన్సిల్‌కే విడిచిపెట్టారు.

మూడో ప్రయత్నంగా 1937లో ఫెడరల్ కోర్టు ప్రారంభోత్సవం భారతీయ న్యాయ వ్యవస్థలో మైలురాయి లాంటిది. ఇద్దరు న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తితో ఈ కోర్టు ఏర్పడింది. దీని పరిధి పరిమితి చాలా స్వల్పం. ఎడతెగని వివాదాల పరిష్కారం కోసం ప్రీవీ కౌన్సిల్‌కి తప్పని సరిగా వెళ్ళాల్సి వచ్చేది. కొద్ది సంవత్సరాల పాటు దీనిని ఎవరూ పరిగణనలోకి తీసుకోలేదు. నాలుగున్నర సంవత్సరాల వ్యవధిలో ఈ ఫెడరల్ కోర్టు 27 నిర్ణయాలను మాత్రమే తీసుకుంది. చాలా కీలకమైన తీర్పులపై దాఖలైన అప్పీళ్ళ జోలికి వెళ్ళలేదు. దేశద్రోహం, ప్రివెంటివ్ డిటెన్షన్, ప్రత్యేక క్రిమినల్ కోర్టుల తీర్పులు, ఆర్డినెన్స్‌ల జోలికి వెళ్ళలేదు. ఈ 27 నిర్ణయాల్లో ఒకటి తప్ప మిగిలిన వన్నీ ఏకగ్రీవమే. ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఉన్న బ్రిటిష్ జాతీయుడు, భారతీయ న్యాయమూర్తులతో కలవడంవల్ల ఇది సాధ్యమైంది. ఈ నిర్ణయాలు ఫెడరల్ కోర్టు నిష్పాక్షికతకూ, స్వేచ్ఛకూ నిదర్శనాలు. ప్రభుత్వాధికారులు ఏకపక్షంగా వ్యక్తుల హక్కుల జోలికి వెళ్ళకుండా నిరోధించినవి వీటిలో ఉన్నాయి. వీటితో ఈ కోర్టు పట్ల ఉన్నతమైన విశ్వసనీయత పెరిగింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో తీసుకున్న నిర్ణయాలు భారత దేశలో న్యాయవ్యవస్థ సర్వోన్నతకు అద్దం పట్టేవిగా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాని ప్రభావం ఫెడరల్ కోర్టు పనితీరుపై ఏమాత్రం పడలేదు. రెండేళ్ళ తర్వాత మాత్రం రాజ్యాంగ సభ ప్రీవీ కౌన్సిల్ పరిధి చట్టాన్ని రద్దు చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండేళ్ళ వరకూ ఇందుకోసం ఆగారంటే, ప్రీవీకౌన్సిల్‌తో తెగతెంపులు చేసుకోవడానికి ఎంతో ఆలోచన చేశారన్నది స్పష్టమవుతోంది.

అన్ని కోణాల్లోంచీ పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతీయ న్యాయవ్యవస్థను హడావుడిగా ఏర్పాటు చేయలేదు. భారతీయ న్యాయవ్యవస్థ సర్వోన్నతిని కాపాడేందుకు వీలుగా ఫెడరల్ కోర్టు చట్టంలో మార్పులు చేశారు. ఫెడరల్‌కోర్టు నిర్ణయాలను ప్రీవీ కౌన్సిల్ ఐదు సార్లు మాత్రమే తోసిపుచ్చిందంటే ఫెడరల్ కోర్టును ఎంత స్వతంత్రంగా, సర్వోన్నతంగా తీర్చి దిద్దారో అర్థం చేసుకోవచ్చు.

1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత ఫెడరల్ కోర్టు సుప్రీంకోర్టుగా అవతరించింది. ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులనే సుప్రీంకోర్టులో కొనసాగించినప్పటికీ, పరిధులు, అధికారాలూ కొనసాగించినప్పటికీ, ఫెడరల్ కోర్టుకూ, సుప్రీంకోర్టుకూ ఉన్న పోలికలు చాలా పరిమితమైనవి. సుప్రీంకోర్టు నిర్మాణంలో కూడా మార్పులు చేశారు.

మన న్యాయవ్యవస్థలో ముఖ్యమైన ఏడో పరిణామం....ఎకె గోపాలన్, మద్రాసు స్టేట్ మధ్య నడిచిన కేసుపై సుప్రీంకోర్టు నిర్ణయం. కొత్త రాజ్యాంగాన్ని సుప్రీంకోర్టు ఈ కేసు నుంచే అన్వయించడం ప్రారంభించింది. ప్రాథమిక హక్కుల ప్రమేయం ఉన్న తొలి కేసు కూడా ఇదే. ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టానికి సంబంధించిన తొలి కేసు కూడా ఇదే. దేశంలో ఒక వ్యక్తి దిగువ కోర్టులన్నింటినీ విడిచి పెట్టి తన ఫిర్యాదును నేరుగా సుప్రీంకోర్టుకు నివేదించిన కేసు ఇది. పార్లమెంటు ఆమోదించిన చట్టంలోని కొంత భాగం రాజ్యాంగ విరుద్ధంగా ఉందని సుప్రీంకోర్టు తన అధికారాన్ని వినియోగించి తొలిసారిగా స్పష్టం చేసింది. గోపాలన్ కేసులో సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని విదేశీ రచయితలు ప్రముఖంగా తీసుకున్నారు.

న్యాయవ్యవస్థలో చోటు చేసుకున్న మరో ముఖ్యమైన పరిణామం దురైరాజన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రస్తావన ఇందులో ఉంది. సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులను ప్రస్తావించడం వల్ల ఇదిచాలా ప్రాముఖ్యాన్ని కలిగుంది. ప్రాథమిక హక్కులకే తొలి ప్రాధాన్యం ఉందనీ, ఆదేశిక సూత్రాలు దాని తర్వాతేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి ముఖ్యపరిణామం 1955లో రాజ్యాంగం నాలుగో సవరణ అంశానికి సంబంధించింది. ఆస్తిహక్కు పరిరక్షణకు సంబంధించింది. ప్రభుత్వం వ్యక్తుల ఆస్తులను స్వాధీనం చేసుకునే సందర్భాల్లో వాటి అవసరం ఏమేరకు ఉందో రుజువులు సమర్పించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది.

పదో పరిణామం...సుప్రీం కోర్టు రాజ్యాంగంలోని వివిధ అధికరణాలను అన్వయింపజేయడంలో మరింత ఉదారంగా వ్యవహరించడం1950లో ప్రారంభమైంది. రాజ్యాంగాన్నే ప్రమాణంగా తీసుకోవడం అన్ని కేసుల్లోనూ జరిగింది. ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మొదలైనవన్నీ రాజ్యాంగం పరిధిలోనే ఉండేట్టు చూడటం సుప్రీంకోర్టు తన పరమావధిగా పరిగణిస్తోంది. రాజ్యాంగాన్ని అన్వయించడంలో ఉదారత కనిపిస్తున్నప్పటికీ, మౌలిక సూత్రాలకు ఏమాత్రం భంగం కలగకుండా చూడటంలో సుప్రీంకోర్టు నిర్వహిస్తున్న పాత్ర అమోఘమైనది. బ్రిటిష్ వారి పాలనలో ఉన్న ఫెడరల్ కోర్టు కంటే భిన్నమైన రీతిలో పని చేస్తూ, తన ప్రాముఖ్యాన్ని నిలబెట్టుకుంటోంది. సుప్రీంకోర్టు పరిధి విస్తృతమైనది అయినప్పటికీ, దాని కన్నుగప్పిన వివాదాలు దాదాపుగా లేవనే చెప్పవచ్చు.

● ఎ.పి. స్వామి.



శక్తిమంతమైన ఓటు హక్కు

ఎన్నికల సంఘం ఆవిర్భావ దినం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమైన ఘట్టం. భారత్‌లాంటి పెద్ద దేశంలో ఎన్నికల నిర్వహణ క్రతువులాంటిదే. ఆ క్రతువును నిర్వర్తించడానికి 1950 జనవరి 25న ఒక వేదిక ఆవిర్భవించింది. అదే భారత ఎన్నికల సంఘం. ఈ రోజునే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పాటిస్తున్నారు. భారత రాజ్యాంగం 15వ భాగంలో 324 వ అధికరణం, ఎన్నికలసంఘం నిర్మాణం, అధికారాలు, విధులను ప్రస్తావించింది. ఇది స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకూ, పార్లమెంటు ఉభయ సభలకూ, రాష్ట్రశాసనసభలకూ, విధాన పరిషత్తులకూ ఎన్నికలు నిర్వహించడం దీని ప్రధాన విధి. అక్టోబర్ ఒకటో తేదీన మొదటిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించారు.

వీరు ఆరేళ్ళు గానీ, 65 ఏళ్ళ వయస్సు నిండేవరకు గానీ విధుల్లో ఉంటారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితోనూ, ఇతర ఇద్దరు కమిషనర్లకూ ఒక్కొక్కరికి సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమానమైన వేతనం లభిస్తాయి. మొదటి ఎన్నికల ప్రధాన కమిషనర్ సుకుమారుసేన్. ఆయన 1950 మార్చి 21నుంచి 1958 డిసెంబర్ 19 వరకు విధులను నిర్వహించారు. టిఎన్ శేషన్ హయాంలో ఎన్నికల కమిషన్ ప్రజానీకానికి చేరువైంది. ప్రతియేటా దేశవ్యాప్తంగా ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించి, ఓటు విలువ గురించి అవగాహన కల్పిస్తున్నారు. రాబోయేది ఎన్నికల కాలం, ఓటరు అప్రమత్తం కావాలి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, బ్యాలెట్ల ద్వారా ఓటును వినియోగించుకుంటున్నాం. మనకు ఏ పార్టీ అభ్యర్థి నచ్చకున్నా నోటా బటన్ నొక్కవచ్చు. 1971వ సంవత్సరంలో పురుష ఓటర్ల సంఖ్య 60.89 శాతం ఉంటే 2014 నాటికి అది పెరిగి 67 శాతానికి చేరింది. మహిళా ఓటర్ల సంఖ్య 49.77 శాతం నుండి 66.32 శాతానికి పెరిగింది. ఎన్నికల కమిషన్ ఒత్తిడివల్లనే నూతన ఓటర్లు నమోదుపై దృష్టి సారిస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లలో తిరస్కార ఓటు హక్కును అమలు చేసిన దేశాలలో 14వ స్థానంలో మన దేశం నిలిచింది. 2009 సంవత్సరంలో ఈ నోటా (నన్ ఆఫ్ ది ఎబౌ) హక్కును తీసుకురావాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించింది. 2013 సెప్టెంబర్ నెలలో సుప్రీం కోర్టు రూలింగ్ మేరకు అమలులోకి వచ్చింది. ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది. ఓటును మించిన శక్తి లేదు. విద్యార్థులకు ఓటర్ల దినోత్సవ ప్రాముఖ్యత గూర్చి వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. ఓటును ఎన్నికల సమయంలో శక్తివంతమైన ఆయుధంగా మరల్చుకొని నచ్చినవారికి ఓటు వేయచ్చు.

● కామిడి సతీష్ రెడ్డి, పరకాల

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

ప్రపంచీకరణ నూతన ఆర్థిక విధానాలు సంస్కరణల ఫలాలు కొద్దిమందికి పరిమితమవుతుంటే, పేద, మధ్యతరగతి ప్రజానీకం ఆదాయాలు భారీగా తగ్గిపోతున్నాయి. ఆక్స్ ఫామ్ సర్వే ఈ చేదు నిజాలను వెల్లడించింది. కేంద్ర ఆర్థిక విధానాల్లో తప్పిదాలను ఎత్తిచూపింది. దావోస్‌లో మోడీ ప్రసంగానికి కొన్ని గంటల ముందే వాస్తవాలను చెప్పింది. పాలకులు ఇప్పుడైనా కళ్లు తెరవాల్సిందే. ఈ నివేదిక ప్రకారం మోడీ ప్రభుత్వం దేశంలో అత్యధికులుగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు కాకుండా సంపన్నులకే మేలు చేస్తుందని ఆందోళన చెందింది. ఆర్థిక అసమానతలు దినదినమూ పెరిగిపోతున్నాయి. భారత్‌లోని ఒక్క శాతం ధనికుల సంపద 2017లో రూ.20.9 లక్షల కోట్లు పెరిగింది. ఇది ఒకే సంవత్సరం కేంద్ర బడ్జెట్‌తో సమానం. ఒక్క శాతం మంది వద్ద దేశంలో దాదాపు 73 శాతం సంపద పోగవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే సమయంలో 67 కోట్ల మంది భారతీయుల సంపద కేవలం ఒక్క శాతం మాత్రమే పెరగటాన్ని సర్వే గుర్తించింది. 2017లో భారత్‌లో లక్షాధికారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపింది. 2010 నుంచి భారత్‌లో బిలియనీర్ల సంపద ఏడాదికి సగటున 13 శాతానికి పెరిగిందని విశ్లేషించింది. పాశ్చాత్య దేశాలతో పాటు బారత్ పశ్చిమాసియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, సోమాలియా, లిబియా, సిరియా ఆయా దేశాలలోనూ ఆదాయపరమైన ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. బ్లూమ్ బర్గ్ తెలిపిన వివాదాల ప్రకారం 500మంది అంతర్జాతీయ కుబేరుల జాబితాలో 25మంది భారతీయులున్నారు. అంతర్జాతీయ జాబితాలో 20వ స్థానంలో రిలయన్స్ అంబానీ నిలిచారు. ఒక్క సంవత్సరంలో ఆయన ఆదాయం 76.3 శాతం 1704 కోట్ల డాలర్లు పెరిగి 4.001 కోట్ల డాలర్లకు చేరింది.



బ్లూమ్ బర్గ్ భారతీయ సంపన్నుల జాబితాలో ముఖేష్ అంబానీ తరువాత వరసగా లక్ష్మీమిట్టల్, ప్రేమ్‌జీ, శివనాడర్, పలోంజీ మిస్త్రీ, అజీం షిఫ్ఫీ, గౌతమ్. దిలీప్ ఆదానీలున్నారు. అత్యంత ధనికులు కావడానికి ముఖ్యకారణం స్టాక్ మార్కెట్లు పెరిగిపోవడమే అని బ్లూమ్ బర్గ్ విశ్లేషించింది. లబ్ది పొందింది కూడా వీరే. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్, అలీబాబ టెన్సెంట్ కంపెనీల అధిపతులు, సాఫ్ట్ వేర్ స్మార్ట్ ఫోన్ సహాయంతో తమ వస్తువులను విస్తృతంగా ప్రచారంలో నిర్వహించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా కొనుగోలు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. అమెజాన్ అధినేత జెఫ్ బెజాస్. 3.402 కోట్ల డాలర్లు సంపద పెరిగాయి. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను రెండో స్థానానికి నెట్టి ప్రపంచ సంపన్నుడిగా ముందు వరసలో నిలిచారు. 2016లో బెజాస్ నికర విలువ 9.906 కోట్ల డాలర్లు, గేట్స్ విలువ 9.013 కోట్ల డాలర్లు. టెక్ సంస్థల ఆదాయం పెరిగిపోతోంది. పేద సంపన్న దేశాల్లో ప్రజల తలసరి ఆదాయాలు క్షీణించిపోతున్నాయి. కోట్లకు పడగలెత్తిన టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగాల కొరత సృష్టిస్తున్నాయి. దీంతో నిరుద్యోగం అంతులేకుండా పెరిగిపోతోంది. టెక్నాలజీ మారినప్పుడల్లా పాతవారి ఉద్యోగాలు కోల్పోవడం ఆనవాయితీగా మారిపోయింది. 1979లో జనరల్ మోటార్స్ సంస్థ అమెరికాలో 8,50,000 ఉద్యోగులను నియమిస్తే నేడు మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా నియమించిన ఉద్యోగుల సంఖ్య గూగుల్‌లో 50 వేలమంది, ఫేస్‌బుక్‌లో ఐదువేల మంది పనిచేస్తున్నారు. మెకిన్స్ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం కార్మిక శాఖలో 40 కోట్ల ఉద్యోగాలు 2030 సంవత్సరంలోపు ఊడిపోయి నిరుద్యోగులుగా మారతారు. 2017 లో బిలియనీర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 17 మంది కొత్తగా బిలియనీర్లు అవతరించారు. దీనిమూలంగా అపర కుబేరుల సంఖ్య 101 నుంచి 118 చేరింది. దేశంలో ధనికుల సంపద 4.89 లక్షల కోట్లు పెరిగింది. విద్యా, వైద్యం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 85 శాతం ఉపాధి కార్మిక రంగాల్ని భారత్ నమ్ముకుంటే ఎన్నో ఉద్యోగాలు కొత్తగా ఏర్పడతాయని సర్వే సూచించింది. సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడడం, వ్యవసాయాన్ని పరిరక్షించడం ద్వారానే ఆర్థిక అసమానతల్ని రూపుమాపేందుకు దోహదపడుతుందని సర్వే వివరించింది. ప్రపంచవ్యాప్తంగా సంపదలో 82 శాతం ధనవంతుల వద్దనే ఉంది. కేవలం ఒక శాతం మంది వద్దకు చేరిందని సర్వే అంటోంది. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. పేదలు మరింత పేదవాళ్లుగా మారుతున్నారని నివేదిక చేదు నిజాన్ని వెల్లడించింది. ప్రధాని నరేంద్రమోడీ గెలుపును విదేశీ స్వదేశీ సామ్రాజ్యవాదులు తమ తమ దోపిడీకి దర్జాగా వాడుకుంటున్నారు. భారత ప్రజల దోపిడీకి ప్రపంచ కార్పొరేట్ సామ్రాజ్యవాదానికి భారత్ కోటీశ్వరులకు ప్రధాని కావాలి. భారత దేశంలో 70 శాతం మంది ప్రజల్ని బిచ్చగాళ్లను చేశారు. రేషన్ షాపులలో, బ్యాంక్‌లలో, పెన్షన్ల కోసం ప్రభుత్వ దయాదాక్షిణ్యాల కోసం క్యూ కడుతున్నారు. పాలకులు ప్రజల్ని బిచ్చగాళ్లుగా మార్చివేసి తమ దోపిడీకి తెరలేపారు. 2017లో సాంకేతిక పరిజ్ఞానానికి అగ్రస్థానంలో ఉంది. రైతులు, నిరుద్యోగులు, కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిచావులు పెరిగిపోతున్నాయి. సంస్కరణల పుణ్యమా అని నేడు ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతుంటే పాలకులు కులాలపేరిట డబ్బు వెదజల్లుతున్నారు. దేవుళ్ల పేరుతో ముడుపులు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు గాఢ నిద్ర నుంచి మేల్కొని కార్పొరేట్లకు కొమ్ముకాయడం కాదు - పేదరికాన్ని నిర్మూలించడానికి అడుగులు వేయాలి.

● దామరపల్లి నర్సింహారెడ్డి, 9581358696

రూ.204.5 కోట్ల లోటుతో తొలి బడ్జెట్



బడ్జెట్ అంటే ఆదాయ,వ్యయాల పట్టిక అని సూక్ష్మంగా అర్థం చెప్పుకోవచ్చు. ఆదాయాల్లో నికరాదాయాలు,అంచనాలు వేర్వేరుగాఉంటాయి. అంచనాలు అంటే, ఫలానా రంగంలో వనరుల ద్వారా ఇంత ఆదాయం లభించవచ్చని ఊహించి పేర్కొనడం.బడ్జెట్‌లు కేంద్రంలోనూ, రాష్ట్రా ల్లోనే కాదు,స్థానిక,పంచాయతీరాజ్ సంస్థల్లో కూడాఉంటాయి. ప్రభుత్వ,ప్రభుత్వేతర సంస్థల్లోనూ ఉంటాయి. సాధారణ బడ్జెట్‌ల గురించి టూకీగా....

స్వతంత్ర భారత దేశంలో తొలి సాధారణ బడ్జెట్‌ని 1947 నవంబర్ 26 వ తేదీన ఆనాటి ఆర్థిక మంత్రి ఆర్ కె షణ్ముగంచెట్టి ప్రవేశపెట్టారు. తొలి బడ్జెట్ లో ఆదాయం ఆదాయాన్ని రూ.171.15 కోట్లు మాత్రమే చూపించారు. ఆర్థిక లోటును 204.59 కోట్లుగా చూపించారు. 1951లో జాన్ మత్తాయ్ తొలి కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రణాళికా సంఘం ఏర్పాటుకు రోడ్డు మ్యాప్ ప్రకటించారు. దేశానికి అవసరమైన వనరులను ప్రణాళికా సంఘం అంచనా వేస్తుందని తొలి బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రణాళికా సంఘానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదటి అధ్యక్షునిగా వ్యవహరించారు. బడ్జెట్ ను వార్షిక ఆదాయ ప్రకటనగా రాజ్యంగంలోని112 అధికరణంలో పేర్కొన్నారు.

అప్పట్లో ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన పార్లమెంటుకు సమర్పించేది. ఆ తర్వాత ఫిబ్రవరి నెలాఖరున ప్రవేశపెట్టడం ఆనవాయితీ అయింది. 2016 వరకూ అదే ఆనవాయితీ కొనసాగింది. బడ్జెట్‌తోపాటు ఆర్థిక బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. బడ్జెట్ ముందు రోజు ఆర్థిక సర్వేను పార్లమెంటుకు ప్రభుత్వం సమర్పిస్తుంది. పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టేది వార్షిక బడ్జెట్ అంటారు. తాత్కాలికంగా ప్రభుత్వ ఖర్చుల కోసం ప్రవేశపెట్టేది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అంటారు. తాత్కాలిక బడ్జెట్‌లో ఆదాయ, వ్యయాల పూర్తిపట్టికలు ఉంటాయి. 1959 -61 నుంచి 1963-64 వరకూ 1962-63 తాత్కాలిక బడ్జెట్ సహా అన్ని బడ్జెట్‌లను అప్పటి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత జనతాపార్టీ హయాంలో ఆయన ప్రధానమంత్రిగా వ్యవహరించారు. కాంగ్రెస్‌లో తొలిసారి చీలిక వచ్చిన తర్వాత దేశాయ్ పాత కాంగ్రెస్‌లో కొనసాగడం, ఇందిరాగాంధీ నేతృత్వంలో కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ మార్పుల తర్వాత ఆర్థిక శాఖను ప్రధానమంత్రి ఇందిరాగాంధీయే తన ఆధీనంలో ఉంచుకున్నారు. మొరార్జీ దేశాయ్ మొత్తం 10 బడ్జెట్లను ప్రవేశపెట్టారు. తర్వాత పి.చిదంబరం తొమ్మిది బడ్జెట్‌లను ప్రవేశపెట్టి రెండో స్థానంలో నిలిచారు. అటు పిమ్మట ప్రణబ్ ముఖర్జీ (మాజీ రాష్ట్రపతి) 8 బడ్జెట్‌లనూ, యశ్వంత్ సిన్హా, యశ్వంతరావు చవాన్, సిడి దేశ్ ముఖ్ ఏడేసిసార్లు, మన్మోహన్ సింగ్, టిటి కృష్ణమాచారి ఆరేసి సార్లు బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరుణ్ జైట్లీ ఆర్థిక శాఖ మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. మన దేశానికి 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యంవచ్చింది.స్వతంత్ర భారత దేశంలో మొదటి ఆర్థిక మంత్రి ఆర్ కె షణ్ముగంచెట్టి తొలి బడ్జెట్ ను 1948 మార్చి నెలాఖరు వరకూ ఆదాయం,అంచనాలతో ప్రవేశపెట్టారు. తొలి బడ్జెట్ లో ఆదాయం ఆదాయాన్ని రూ.171.15 కోట్లు మాత్రమే చూపించారు. ఆర్థిక లోటును 204.59 కోట్లుగా చూపించారు.

1951లో జాన్ మత్తాయ్ తొలి కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు.కేంద్ర ప్రణాళికా సంఘం ఏర్పాటుకు రోడ్డు మ్యాప్ ప్రకటించారు.దేశానికి అవసరమైన వనరులను ప్రణాళికాసంఘం అంచనావేస్తుందని తొలి బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రణాళికా సంఘానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదటి అధ్యక్షునిగావ్యవహరించారు.

స్టార్ ఆస్పత్రిలో దక్షిణ భారతదేశంలో తొలి
ఎండోస్కోపిక్ లేజర్ స్పైన్ చికిత్స

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ట్రాన్స్‌ఫర్మినల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ డిస్క్ వ్యాధిని తగ్గించడంలో సర్వవ్యాప్తమైన నూతనవిధానమని, ఈ విధానంలో స్టార్ హాస్పిటల్స్ అనేక విజయవంతమైన సర్జరీలు నిర్వహించిందని బుధవారం యాజమాన్యం ప్రకటించింది. తెలంగాణ, ఏపిలలో 2012లోనే స్టార్ హాస్పిటల్స్‌లో డాక్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో ఈ అధునాతన వైద్యవిధానం ప్రవేశపెట్టి 150కు పైగా సర్జరీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇపుడు దక్షిణ భారత దేశంలోనే తొలిసారి డాక్టర్ సుకుమార్ ఎన్డోస్కోపిక్ హోల్మియం వైఏజి లేజర్‌స్పైన్ సర్జరీని స్టార్ హాస్పిటల్స్‌లో ప్రారంభించారు. ఈ సర్జరీ వల్ల కుట్లు లేకుండా స్పైన్ సర్జరీ జరుగుతుందని డాక్టర్ సుకుమార్ వివరించారు. ఈ ప్రక్రియను స్థానిక అనస్థీషియాలో డేకేర్ విధానంగానే నిర్వహిస్తారన్నారు.

పశుసంపదను పరిరక్షిస్తేనే
మానవ మనుగడ: సందీప్ సుల్తానియా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పశు ఉత్పత్తులైన పాలు, గుడ్లు, మాంసం ద్వారా మనుషులకు పూర్తిస్థాయి పౌష్టిక ఆహారం అందుతుందని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. వీటిని భవిష్యత్ తరాలకు అందించాలంటే ఈ రంగాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టంచేశారు. పశువులను సంరక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. యాంటి బయోటిక్ మందులను తట్టుకునే స్థాయిని పశువుల్లో పెంచాలనే అంశంపై బుధవారం పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను పశువుల్లో పెంపొం దించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పశు వైద్య శాస్త్రవేత్తలు ఈ అం శంపై లోతుగా అధ్యయనంచేసి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా ఫెర్టిలిటీ కేంద్రాలు!



- ●లక్షల్లో చార్జీలు ●పిల్లలు లేని దంపతులే వారి టార్గెట్ ●ప్రైవేట్‌కు చెక్ పెట్టేందుకు గాంధీ ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యాప్తంగా 5-10 శాతం మంది దంపతులు సంతానలేమితో బాధపడుతున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రవ్యాప్తంగా పుట్టగొడుగుల్లా సంతాన సాఫల్య కేంద్రాలు వెలుస్తున్నాయి. అవి కచ్చితమైన ప్రమాణాలు పాటించకుండా ఫెర్టిలిటీ సెంటర్లు దంపతుల నుంచి 4 నుంచి 5 లక్షల వరకు చార్జీల రూపంలో వసూలు చేస్తున్నాయి. మొదటగా సాఫల్య కేంద్రాలకు వచ్చే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారి ఆరోగ్య సమస్య గురించి అడిగి తెలుసుకోవాలి. అనంతరం వారికి ఎలాంటి ట్రీట్‌మెంట్ అవసరమో నిర్ధారించి అనంతరం దానికి సంబంధించి పద్ధతిని అవలంబించాలని ఉన్నా కావాలని చాలామంది సంతానసాఫల్య కేంద్రాల వారు తమ వద్దకు వచ్చిన వారి నుంచి లక్షలు వసూలు చేస్తున్నారు. డబ్బు తీసుకున్నా ఫలితం దక్కడం లేదని పలువురు దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విసిగిపోయిన చాలామంది పలు ఫెర్టిలిటీ సెంటర్లపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం గాంధీలో సంతాన సాఫల్య కేంద్ర ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. దీని కోసం 50 లక్షల రూపాయలను కేటాయించింది. 25వ తేదీ (నేడు) మంత్రి లక్ష్మారెడ్డి దీనిని ప్రారంభించనున్న నేపథ్యంలో సంతాన సాఫల్య కేంద్రాలపై ప్రత్యేక కథనం.

ప్రత్యేక మార్గదర్శకాలు

ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ వారు ఫెర్టిలిటీ సెంటర్ల కోసం ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. ఈ మేరకు అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఆర్ట్)ని అనుమతించింది. అద్దె గర్భాధారణ కూడా ఆర్ట్ పద్ధతుల్లో ఒకటి కావడంతో దీనిని ఆసరాగా చేసుకొని రాష్ట్రంలో సంతాన సాఫల్య కేంద్రాలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. చాలా కేంద్రాలకు పిల్లలు పుట్టని దంపతులే పెట్టుబడిగా భావించి తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో ఆర్ఎంపీలతో పాటు పలువురు ఎంబీబీఎస్ వైద్యులకు కమీషన్ ఇస్తూ పేదలను నిలువునా దోచుకుంటున్నారు.


చాలామంది దంపతులు పిల్లలు లేక అప్పులు తెచ్చి పిల్లలు పుడతారన్న ఆశతో ఫెర్టిలిటీ సెంటర్లను నమ్ముకొని వస్తే అక్కడ డబ్బులు పోతున్నాయి తప్పా పిల్లలు పుట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరోగసీ ద్వారా పిల్లలు కావాలనుకునే వాళ్ల కోసం రాష్ట్రంలో 100కు పైగా సంతాన సాఫల్య కేంద్రాలున్నాయి. హైదరాబాద్‌లో 30, రంగారెడ్డిలో 25, మేడ్చల్ 15, వరంగల్ 6, కరీంనగర్‌లో 6, నిజామాబాద్‌లో 3, మంచిర్యాలలో 1 ఇతర ప్రాంతాల్లో 10కి పైగా కేంద్రాలున్నాయి. ఫెర్టిలిటీ సెంటర్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం హైపవర్ కమిటీని సైతం గత నెలలో ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్య శాఖా కమిషనర్ చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చేసే మార్గదర్శకాల ఆధారంగా ఈ సెంటర్లు పనిచేయాలని ప్రభుత్వం సూచించింది.

నవంబర్‌లో ప్రతిపాదనలు

పిల్లలు లేని జంటలను దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు ఫెర్టిలేటర్ (సంతాన సాఫల్య కేంద్రాలు) ముక్కుతాడు వేయాలని ప్రభుత్వం భావించింది. నవంబర్‌లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రాగా, పైలట్ ప్రాజెక్టు కింద గాంధీ ఆస్పత్రిలో కొన్ని రోజుల పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. సంతానం లేని మహిళలకు గాంధీ ఆస్పత్రి గైనకాలజీ విభాగం ద్వారా ఇప్పటికే ఓపీ కింద ప్రతి గురువారం 30 నుంచి 40 మందికి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. మహిళలకు హార్మోన్ల పరీక్షలను సైతం నిర్వహించారు.ఇక్కడ విజయవంతం అయితే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

అధునాతన పరికరాలతో సంతాన సాఫల్య కేంద్రం



ప్రస్తుతం గాంధీలో ఏర్పాటు చేసిన సంతాన సాఫల్య కేంద్రంలో లేప్రోస్కోపీ, అల్ట్రాసౌండ్, ఆపరేషన్ థియేటర్, మైక్రోస్కోప్, డ్రై ఇంక్యుబేటర్, ఐయూఐ ల్యాంప్, టెస్ట్ ట్యూబ్ వార్మర్, సెఫీ మార్కెట్, కౌంటింగ్ చాంబర్, రెమీ కాంపాక్ట్, క్లీనికల్ సెంట్రీ ఫ్యూజ్, సూప్ర క్లీన్, లేమినార్ ఎయిర్ ఫ్లో క్యాబినెట్ తదితర పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. మొదటగా సంతానం లేని వారికి ఇంట్రాయుటెరిన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ) పద్ధతి ద్వారా ప్రయత్నం చేస్తారు. ఈ విధానం ద్వారా 80 శాతం సక్సెస్ సాధించవచ్చు. అప్పటికీ పిల్లలు కలగపోతే టెస్ట్‌ట్యూబ్ పద్ధతిలో సంతానం అయ్యేలా చూస్తారు. భవిష్యత్తులో దీనిని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మంత్రి లక్ష్మారెడ్డి 25వ తేదీ (గురువారం) దీన్ని ప్రారంభించనున్నారు. దీని కోసం అధునాతన పరికరాలను 20-30 లక్షల రూపాయల ఖర్చుతో సమకూర్చుకున్నాం. ఉన్న సిబ్బందిని దీనికోసం వినియోగించుకుంటున్నాం. గైనకాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇది నడుస్తుంది. డాక్టర్ అనుపమ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఈ సంతానసాఫల్య కేంద్రానికి ఇన్‌చార్జీగా వ్యవహరిస్తారు అని గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ నరసింహారావు నేత తెలిపారు.

జైళ్ల శాఖలో ప్రోత్సాహకాల పెంపు

- ●డీజీ వీకే సింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంస్కరణల అమలులో తెలంగాణ జైళ్ల శాఖ ముందుంది. ఇందులో భాగంగా జైళ్లశాఖలో అవినీతిని నిరూపించిన వారికి రూ.5 వేల రూపాయల నజరానాను ఆ శాఖ డీజీ వీకే సింగ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2017లో అవినీతిపై 12 ఫిర్యాదులు అందాయని, వాటిలో రెండు మాత్రమే నిజమని తేలాయన్నారు. ఆ రెండు ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు. కాగా, ఇప్పటివరకు ముగ్గురికి రూ.5వేల చొప్పున రివార్డు అందజేశామని డీజీ తెలిపారు. అయితే, ఇప్పటివరకూ ఉన్న నజరానాను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ జైళ్లశాఖ డీజీ వీకే సిగ్ నిర్ణయం వెలువరించారు.

దళిత యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ

- ●ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు: మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దళితయువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మకమైన సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయని, ఉన్నత ప్రమాణాలతో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో పాటుగా నాణ్యమైన విద్యను దళిత యువతకు చేరువ చేయడానికి వేగవంతమైన చర్యలు అమలు జరుపుతున్నామన్నారు. దళిత యువతకు ఉపాధి రంగంలో శిక్షణకు గాను జాతీయ పర్యాటక ఆతిథ్య సంస్థతో రాష్ట్ర షెడ్యూల్డు కులాల అభివృద్ధి సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గచ్చిబౌలిలోని జాతీయ పర్యాటక అతిథ్య సంస్థలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి జగదీశరెడ్డి పాల్గొని దళిత యువతకు ఎయిర్ హోస్టెస్-స్టీవార్డులో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిథిమ్ చైర్మన్ బి. వెంకటేశం, సంచాలకులు శేరి చిన్నారెడ్డి, షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ జ్యోతి, ఎస్సీ అభివృద్ధి సహకార సంస్థ సంచాలకులు కరుణాకర్, జనరల్ మేనేజర్ బుచ్చిరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. దళిత విద్యావంతులకు ఎయిర్‌హోస్టెస్ - స్టీవార్డులో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించడం దేశంలోనే ప్రప్రథమమని మంత్రి తెలిపారు. యువతకు ఉపాధి రంగాల్లో శిక్షణకు, మెరుగైన ఉపాధికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జాతీయ పర్యాటక ఆతిథ్య సంస్థ ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. ఎయిర్‌హోస్టెస్, స్టీవార్డు, చెఫ్, పంచకర్మ, హౌస్ కీపింగ్, లాండ్రీ, బేకరీ తదితర రంగాల్లో యువతకు 3, 6 మాసాల శిక్షణ ఇవ్వడానికి జాతీయ పర్యాటక ఆతిథ్య సంస్థతో అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. రాష్ట్ర షెడ్యూల్డు కులాల అభివృద్ధి సహకార సంస్థ ద్వారా రూ. 1.40 కోట్ల వ్యయంతో 164 మందికి పర్యాటక అతిథ్య సంస్థ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఇప్పటికే నేషనల్ అకాడమీ ఆఫ్ కంస్ట్రక్షన్, అపోలో మెడీస్కిల్స్, కెల్ట్రాన్, మహిళా ప్రాంగణాలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం 771మంది దళిత యువ తకు రూ. 235.35 లక్షలతో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నామని జగదీశ్‌రెడ్డి తెలియచేశారు.

అన్ని వసతులతో చేపల మార్కెట్

- ●మంత్రి శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజారులో రూ.5.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హోల్‌సేల్ చేపల మార్కెట్ భవన నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ, మత్స్య, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంద సంవ త్సరాల చరిత్ర కలిగిన ఈ చేపల మార్కెట్‌లో అన్ని రకాల వసతులతో కూడిన ఆధునిక భవ నాన్ని నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ వ్యాపారం చేయాల నుకునే వారికి తప్పని సరిగా షాపును కేటాయిస్తామన్నారు. దీంతోపాటు మల్టీలెవల్ పార్కింగ్‌ను కూడా కల్పించి అన్ని వసతులతో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ రకమైన మార్కెట్లను సికింద్రాబాద్, ఎల్‌బీనగర్, మారేడు పల్లి ప్రాంతాల్లో కూడా నిర్మించేందుకు త్వరలోనే ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దాదాపు 980 చ.మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ హోల్‌సేల్ చేపల మార్కెట్ భవనంలో సెల్లార్‌లో పార్కింగ్‌తో పాటు తదితర సౌకర్యాలను సమకూర్చుతోంది. ఈ భవనానికి అయ్యే 5.25 కోట్ల వ్యయంలో రూ.3 కోట్లు జీహెచ్ఎంసీ భరిస్తుండగా మిగిలిన రూ.2.25 కోట్ల రూపాయలను జాతీయ మత్స్య అభి వృద్ధి సంస్థ అంజేస్తుంది. ఈకార్యక్రమంలో మూసీ ప్రక్షాళన బోర్డు చైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, జేడీ సరళ, డీఎంసీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహనలో
ప్రసార సాధనాలే కీలకం

- ●సమాచార కార్యాలయ అదనపు డైరెక్టర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ విభాగాలు, ప్రసార సాధనాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలను చైతన్య పరిచినప్పుడే అన్ని రకాల వ్యాధులను నియంత్రించవచ్చని పత్రికా, సమాచార కార్యాలయం అదనపు డైరెక్టర్ జనరల్ మరియప్పన్ అన్నారు. మిషన్ ఇంద్రధనస్సు, కుష్టు వ్యాధులపై క్షేత్ర ప్రచార శాఖ (డీఎఫ్‌పీ) కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఇంద్రధనుష్ కార్యక్రమం విజయ వంతం అయ్యిందని, దీనివల్ల చిన్నారుల మరణాలు తగ్గాయన్నారు. మిషన్ ఇంద్రధనుష్‌పై ప్రచారానికి మీడియాను ముఖ్యంగా టెలివిజన్‌ను విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రాంతీయ సీని యర్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ తల్లీ, శిశు మరణాలు తగ్గించడం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచడం, కుష్టు, క్షయ వ్యాధులు, సంక్రమిత వ్యాధులను నియంత్రించేందుకు పటిష్టమైన ప్రచార వ్యూహాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఆదిలాబాద్, నల్లగొండ, మెదక్ జిల్లాలో క్షయ వ్యాధి కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఆమె తెలిపారు. హైదరాబాద్‌లాంటి పట్టణ ప్రాంతాల్లో క్షయ వ్యాధిపై సర్వే చేపట్టవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు శ్రీమతి సుధీర మాట్లాడుతూ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో మరణాలు మూడు వంతులు తగ్గించవచ్చన్నారు. తెలంగాణలో 3 లక్షల మంది పిల్లలకు టీకాలు వేశామన్నారు. తెలంగాణ ఆరోగ్య వైద్య శాఖ కుష్టువ్యాధి నిర్మూలన విభాగం జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు మాట్లాడుతూ కుష్టురోగుల పట్ల సమాజంలో ఇప్పటికి వివక్ష కొనసాగుతోందన్నారు. దీనికోసం ప్రసార సాధనాలు మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్షేత్ర ప్రచార విభాగం జేడీ దేవేంద్ర పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయంలో అగ్నిప్రమాదం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఖైరతాబాద్‌లోని డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ రవాణా కార్యాలయంలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ట్రాన్స్‌పోర్టు కార్యాలయం పాత భవనంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది కొద్ది సమయంలోనే మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో పాత దస్త్రాలు కాలిపోయాయి. విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో పాత భవనంలో మంటలు వచ్చినట్లు అధికారులు వివరించారు. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలోని మంటలు ఎగిసిపడిన పాత భవనాన్ని రవాణా మంత్రి పి. మహేందర్ రెడ్డి పరిశీలించారు. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ కూడా మంత్రి వెంట ఉన్నారు. జేటీసీ పాండురంగ నాయక్ జరిగిన ఘటనపైన మంత్రికి వివరణ ఇచ్చారు. సగం కూలిన పాత భవనంలో విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో మంటలు వచ్చినట్లు మంత్రికి వివరించారు.




ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదం. పరిశీలిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

దాదాపు 40 సంవత్సరాల క్రితం నాటి పాత రికార్డులు ఈ ప్రమాదంలో కాలిపోయాయని జేటీసీ తెలిపారు. ఆ రికార్డులన్నింటిని ఇప్పటికే కంప్యూటరీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మిస్తామన్నారు. ఈ ఘటనపై జేటీసీ రమేష్ ఆధ్వర్యంలో విచారణకు అదేశించారు. తక్షణ పునరుద్ధరణ పనుల కోసం రూ. 10 లక్షలు మంజూరు చేశారు. భద్రపై తీసుకోవలసిన చర్యలపై అధికారులతో మాట్లాడారు.

ఉద్యోగి మృతిపై విచారణ కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసిఫాబాద్ జిల్లాలో బలవన్మరణానికి పాల్పడిన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవీ శ్రీకాంత్ ఉదంతంపై సమగ్ర విచారణకు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ కమిటీలో పంచాయతీరాజ్ సిఈ జాన్ మిల్టన్, తిరుపతిరెడ్డి, ఆదిలాబాద్ ఎస్ఈ రమేష్‌లను నియమిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కమిటీ సమగ్ర విచారణ జరిపి పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

2 జిల్లాలకు టీడీపీ అధ్యక్షుల నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల మేరకు జనగాం జిల్లా అధ్యక్షునిగా బొట్ల శ్రీనివాస్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా కొండపల్లి రాంచంద్రరావును నియమించారు. భూపాలపల్లి జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులుగా చాడా రఘునాథ్‌రెడ్డి, యానా ల అనంత్‌రెడ్డి, గడపర్తి నరసింహమూర్తి, అరికెల ప్రమోద్‌ను నియమించినట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చిలింగం తెలిపారు.

వేసవి రద్దీకి 104 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్యా తిరుపతి, కాకినాడ, నాగర్‌సోల్, నాందేడ్ నుండి వివిధ దూర ప్రాంతాలకు 104 ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నట్లు దక్షిణమధ్య రైల్వే తెలియచేసింది. తిరుపతి-కాకినాడ టౌన్- రేణిగుంట మధ్యన 34 ప్రత్యేక రైళ్లను, తిరుపతి - నాగర్‌సోల్, తిరుపతి వీక్లీ ప్రత్యేక రైళ్లు 36, నాందేడ్ - తిరుపతి - నాందేడ్ ప్రత్యేక రైళ్లు 34 వరకు నడిపించడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మార్చి నుండి జూన్ వరకు ఈ ప్రత్యేక రైళ్లు తిరుగుతాయన్నారు. ప్రత్యేక రైళ్లకు ముందుస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషన్లల్లో ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.

సికింద్రాబాద్ - నర్సాపూర్ మధ్యన ప్రత్యేక రైలు

ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఈ నెల 25న సికింద్రాబాద్ నుండి నర్సాపూర్ మధ్యన ప్రత్యేక రైలును నడిపించబోతున్నారు. ఈ రైలు సికింద్రాబాద్‌లో 20.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.25 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. మార్గమధ్యలో చర్లపల్లి, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు స్టేషన్లల్లో నిలుపుదల చేయడం జరుగుతుంది.


అమరావతి ఎక్స్‌ప్రెస్, నాందేడ్ రైలుకు అదనపు కోచ్‌లు

విజయవాడ - హుబ్లీ - విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్, నాందేడ్ - పన్వెల్ - నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు శాశ్వత ప్రాతిపాదికన అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియచేసింది. నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 29 నుండి అదనంగా ఒక స్లీపర్ కోచ్‌ను, అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 26 నుండి ఒక ఏసీ 3 టైర్ కోచ్‌తో పాటు మరో స్లీపర్ కోచ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్

విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ను ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఇదే తొలి ఎగ్జిక్యూటివ్ లాంజ్ అని తెలియచేశారు. డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్. ధనాంజనేయులు ఈ లాంజ్‌ను బుధవారం ప్రారంభించారు. రైలు ప్రయాణికులకు సౌకర్యవంతమైన విశ్రాంతి గదిగా ఆధునిక సౌకర్యాలతో ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు వివరించారు. ఉచిత ఇంటర్ నెట్, శీతల పానీయాలు, టీ. కాఫీ, దిన పత్రికలు, టెలివిజన్, వాష్ రూమ్, లాకర్, లగేజ్ రాక్ సదుపాయం కల్పించామని. మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా వెయిటింగ్ రూమ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.

త్యాగాల ఫలితాలేవీ..?:గద్దర్



కోదాడ, ప్రభ న్యూస్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని, రాష్ట్రం కోసం యువకులు, విద్యార్థులు చేసిన త్యాగాల ఫలితాలు మూడున్నర సంవత్సరాలలో కనుచూపు మేరలో కన్పించడంలేదని ప్రజా గాయకుడు, టీమాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దర్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో టీమాస్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక, సంబురాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత తేడా ఏంటని సభికులను ప్రశ్నించారు. అక్షరాన్ని, అన్నాన్ని నేడు రాజకీయంతో ముడిపెట్టారని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడితే ఆత్మహత్యలు ఉండవన్నారని, అందులో తానుకూడా ఉన్నానని, నేడు ఆత్మహత్యలు పెరగడంతో మనం ఏమీ సాధించామన్నారు. రాష్ట్రంలో చదువు ఖరీదైపోయిందని, నాటి ఫీజులు, నేటి ఫీజులు ఎలా ఉన్నాయో మనం ఒక్కసారి ఆలోచించాలన్నారు. అమరుల త్యాగాలకు ఫలితాలు వచ్చినప్పుడే నిజమైన తెలంగాణ అన్నారు. కాగా తాను గతంలో రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో కోదాడకు వచ్చానని, ఇప్పుడు రాష్ట్రం వచ్చిన తర్వాత జరుగుతున్న అన్యాయం కోసం వచ్చానని తెలిపారు. గద్దర్ తన ఉపన్యా సంతో పాటు ఆడుతూ పాడుతూ సభికులను ఉత్తేజపర్చారు. టీమాస్ నాయకులు ఎం.ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముల్కలపల్లిరాములు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, టీమాస్‌నాయకులు కుక్కడపు ప్రసాద్, పందిరి నాగిరెడ్డి, గంధం బంగారు, కోట్యానాయక్, బాగ్దాద్, జుట్టుకొండ బసవయ్య, బుర్రి శ్రీరాములు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరాం పార్టీ 'తెలంగాణ జనసమితి'!

- ●గుర్తు 'రైతు నాగలి' ●బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రకటించే అవకాశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ ఏర్పాటు చేసే కొత్త పార్టీ పేరు ' తెలంగాణ జన సమితి'గా దాదాపు ఖరారు అయినట్లుగా తెలిసింది. ముందుగా రెండు, మూడు (తెలంగాణ సకుల జనుల పార్టీ, తెలంగాణ ప్రజా పార్టీ, తెలంగాణ జన సమితి) పేర్ల పైన చర్చ జరిగినప్పటికి ఎక్కువ మంది తెలంగాణ జనసమితి పేరుపైనే మొగ్గు చూపినట్లుగా తెలిసింది. ఇక పార్టీ గుర్తు విషయానికి వస్తే 'రైతు నాగలి'ని ఎంచుకున్నట్లు సమాచారం. పార్టీ జెండా, కలర్ విషయంలో రెండు, మూడు రంగులను పరిశీలించినప్పటికి.. ఫైనల్‌గా టీజేఏసీ జెండానే ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. భారీ బహిరంగ సభ నిర్వహించి కొత్త పార్టీని ప్రకటించాలనే ఆలోచనతో టీజేఏసీ నేతలు ఉన్నారు. కాగా ఫిబ్రవరి 4 న నిర్వహించే టీజేఏసీ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేడర్‌లను ఆహ్వానించనున్నారు. ఈ సమావేశంలో మండల స్థాయి నాయకుల నుంచి కూడా సూచనలు, సలహాలు తీసుకోవాలనే అభిప్రాయంతో టీజేఏసీ ఉంది. పార్టీ ఏర్పాటు చేయబోయే ముందు ప్రజా సమస్యలపైన కేడర్ ఎక్కువగా దృష్టి పెట్టాలనే నిర్ణయానికి వచ్చారు.

ఇదిలా ఉండగా వచ్చే ఎన్నికల్లో సామాజిక న్యాయం ఎజెండానే ప్రజల్లోకి వెళ్లుతూనే.. రాజకీల్లోకి కొత్త తరం నాయకత్వాన్ని తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నట్లుగా వినిపిస్తోంది. దీంతో పాటు భావసారూప్యత కలిగిన పార్టీలతోనూ కలిసి పని చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా తెలిసింది. టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ ఇప్పటికే వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నేతలతోనూ చర్చలు జరిపారు. అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన చాలామంది నేతలు కోదండరామ్‌తో టచ్‌లో ఉన్నట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. తెలంగాణ ఉద్యమం సమయంలో సీఎం కేసీఆర్‌తో పాటు కోదండరామ్ సమాంతరంగా ఉద్యమం చేయడమే కాకుండా వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలను ఏకతాటిపై తీసుకొచ్చారు. ఉద్యమం సమయంలో సన్నిహితంగా ఉన్న నేతలందరూ కోదండరామ్‌తో సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. ఇకపోతే పార్టీని ఏర్పాటు చేసినప్పటికి టీజేఏసీని అదే విధంగా కొనసాగించాలని భావిస్తున్నారు. కోదండరామ్ పార్టీ బాధ్యతలు తీసుకుంటే.. టీజేఏసీ బాధ్యతలను అన్ని వర్గాల ప్రజలను మెప్పించడమే కాకుండా, ప్రజలు గుర్తు పట్టే వ్యక్తికే టీజేఏసీ నాయకత్వం అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. టీజేఏసీలో ప్రస్తుతం విద్యుత్ జేఏసీ నాయకులు రఘు, ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్, వెంకట్‌రెడ్డితో మరో కొందరు కీలకంగా పని చేస్తున్నారు.

మే 2, 3న ఎంసెట్, అగ్రికల్చర్, ఫార్మా పరీక్ష

- ●4, 5, 7 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్ష ●'నీట్' నేపథ్యంలో ఎంసెట్ పరీక్షల్లో స్వల్ప మార్పులు: పాపిరెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) నేపథ్యంలో రాష్ట్రంలో నిర్వహించనున్న ఎంసెట్ పరీక్షల్లో స్వల్ప మార్పులను చేసినట్టు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ముందుగా నిర్ణయించినట్టుగా ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు మే 1, 2కు బదులుగా మే 2, 3 తేదిల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ తరువాత ఎంసెట్ ఇంజనీరింగ్ పరీక్షలను మే 4, 5, 7 తేదిల్లో నిర్వహిస్తామన్నారు. నీట్ పరీక్ష మే 6న దేశ వ్యాప్తంగా సీబీఎస్ఈ నిర్వహిస్తున్నందున ఎంసెట్ పరీక్షల తేదిల్లో స్వల్ప మార్పులను చేయాల్సి వచ్చిందన్నారు. ఎంసెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున స్వల్ప మార్పుల నేపథ్యంలో బుధవారం పాపిరెడ్డి ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో టిఎస్‌టిఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అయితే ఎంసెట్ నిర్వహణ కోసం టిఎస్‌టిఎస్ అధికారులు మే 2 నుంచి 7 వరకు ఏర్పాట్లను చేసుకున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని, 6న నీట్ పరీక్ష ఉన్నందున 7 వరకు ఎంసెట్ పరీక్షను నిర్వహిస్తామని చెప్పారు. మే 6న నీట్ పరీక్ష ఉన్నందున ముందుగా అగ్రికల్చర్, ఫార్మా పరీక్షను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 2, 3 తేదిల్లో ఎంసెట్ రాసిన విద్యార్థులు 6న నీట్‌ను రాస్తారన్నారు. ఎంసెట్‌న్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ప్రతి సెషన్‌కు 25 వేల మందికి పరీక్షను నిర్వహిస్తామన్నారు. ఆ నేపథ్యంలో ఎంసెట్ పరీక్ష ఈసారి 5 రోజులు నిర్వహిస్తున్నామన్నారు.

ఆస్ట్రేలియా గ్రూపులో భారత్


న్యూఢిల్లీ : ఆస్ట్రేలియా గ్రూపులో భారత్ స్థానం సంపాదించుకోవడంపై అమెరికా హర్షం వ్యక్తం చేసింది. భారత్‌తో కలిసి పని చేయడంతో ఎంతో సంతోషాన్ని ఇస్తుందని అమెరికా చెప్పుకొచ్చింది. భవిష్యత్తులో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా భారత్‌తో పాటు అన్ని దేశాల సహకారం తీసుకుంటామని వివరించింది. గత వారమే ఏజీ గ్రూపు (ఆస్ట్రేలియా గ్రూపు)లో భారత్‌కు చోటు దక్కడంతో వ్యాపార విస్తరణతో పాటు శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రగతి సాధించేందుకు ఎంతో తోడ్పడుతుందని చెప్పుకొచ్చింది. మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజిమ్ (ఎంటీసీఆర్), వస్సేనార్ అగ్రిమెంట్ (డబ్ల్యు ఏ), ఆస్ట్రేలియా అగ్రిమెంట్ (ఏజీ) సభ్యుల చెంత భారత్ చేరింది. ఏజీ గ్రూపు ప్రపంచవ్యాప్తంగా పలు రంగాల్లో ఉపయోగపడే సామాగ్రిని సరఫరా చేసేది.



భారత్ బయోటెక్ వాక్సిన్‌కు
డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు

హైదరాబాద్ : అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం తయారు చేస్తున్న రోటావైరస్ డయేరియా వాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ఆమోదం తెలిపింది. ఈ వాక్సిన్‌ను హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ ఉత్పత్తి చేస్తుంది. అయితే డబ్ల్యుహెచ్ఓ ఆమోదం తెలిపితేనే ఐక్య రాజ్యసమితితో పాటు గావి... గ్లోబల్ వాక్సిన్ అనుబంధ సంస్థలు భారత్ బయోటెక్ నుంచి చౌకధరకు ఈ వాక్సిన్‌లను కొనుగోలు చేయవచ్చు. ఆఫ్రికా దేశాల్లో డయోరియాతో ప్రతి ఏడాది వేలాది మంది పసిపిల్లలు చని పోతున్నారు. కాగా ఈ వాక్సిన్‌ను ఇతర కంపెనీలు జీఎస్‌కె, మెర్క్‌లు కూడా సరఫరా చేస్తున్నాయి కానీ.. వాటి ధర భారత్ బయోటెక్‌తో పోల్చుకుంటే చాలా ఎక్కువ. ఆఫ్రికా దేశాలతో పాటు ఇతర మార్కెట్లో కూడా ఈ వాక్సి న్‌కు మంచి డిమాండ్ ఉంది. రోటోవాక్ వాక్సిన్ గావి దేశాలకు భారత్ బయోటెక్ కోర్స్ వాక్సిన్ మూడు డాలర్లకు విక్రయిస్తుండగా.. జీఎస్‌కె 4.17 డాలర్లు, మెర్క్ 10.50 డాలర్లక విక్రయిస్తోంది. నాన్ గావి దేశాలు ఉదా హరణకు దక్షిణాఫ్రికాలో రోటావైరస్ ధర 20 డాలర్లకు విక్రయిస్తున్నారు. భారత్‌కు చెందిన భారత్ బయోటెక్ ఇలాంటి దేశాలతో ఒప్పందాలు కుదుర్చు క ని కోర్స్‌ను 5 డాలర్లకు విక్రయిస్తే ఆ దేశాల్లో డిమాండ్ బాగా పెరగుతుందని బిల్ అండ్ మెలిదా గేట్స్ ఫౌండేషన్‌కుచెందిన డంకన్ స్టీల్ అన్నారు.

రూ.88వేల కోట్లతో బ్యాంకులకు టానిక్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మొండిబాకీలతో కునారిల్లుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధనం అందిచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ దిశగా బుధవారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, ఉన్నతాధికారులతో కలిసి రీ క్యాపిటలైజేషన్ ప్రణాళికను ప్రకటించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు 2.11లక్షల కోట్ల రూపాయలను మూలధనంగా అందిచాలని నిర్ణయించారు. ఇందులో తొలివిడతగా 88,139 కోట్ల రూపాయలను 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఇవ్వనున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ఇందులో సింహభాగం 10,610కోట్ల రూపాయలను ఐడీబీఐ బ్యాంకు పొందనుండడం గమనార్హం. పాత పొరపాట్లు పునరావృతం కాకుండా రుణాల వసూలకు పటిష్టమైన వ్యవస్థాగత యంత్రాంగం రూపొందించు కోవాలని అరుణ్‌జైట్లీ కోరారు. బ్యాంకింగ్ రంగ సంస్కరణలకు పలు నూతన విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రభుత్వ బ్యాంకుల ఆర్థిక స్థితి ఆరోగ్యకరంగా ఉంచడమే ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. రీక్యాపిటలైజేషన్‌లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రీక్యాప్ బాండ్స్ ద్వారా 80వేల కోట్లు, బడ్జెట్ ద్వారా 8,139 కోట్ల రూపాయలు అందించనున్నారు. ఆయాప్రభుత్వ రంగ బ్యాంకులు తమ రుణ సామర్థ్యాన్ని పెంచుకుని ఆర్థికరంగాన్ని పరుగులెత్తించేందుకు ఈ ప్రక్రియను చేపట్టారు. రీ క్యాపిటలైజేషన్‌తో పాటు ఆరుథీమ్‌లు, 30 సూత్రాలతో సంస్కరణల ప్రణాళికను క ూడా బ్యాంకులు అమలు చేయాలని నిర్దేశించారు. ఖాతాదారులకు స్పందించడం, బాధ్యతాయుతమైన బ్యాంకింగ్‌నిర్వహణ, క్రెడిట్ సౌకర్యం, పరిశ్రమలకు మిత్రునిగా ఉండడం, సమ్మిళిత ఆర్థిక వృద్ధి దిశగా పనిచేయడం, డిజిటలైజేషన్ తదితర అంశాలను అమలు చేయాలని సంస్కరణల ప్రణాళికలో కోరారు. ఈ సంస్కరణల అమలు బాధ్యతను బ్యాంకుల ఫుల్‌టైమ్ డైరెక్టర్లకు అప్పగించారు. వారి పనితీరును ఎప్పటికప్పుడు బ్యాంకు బోర్డు మదింపు చేయనుంది. ఖాతాదారులకు అందుబాటులోఉండడం, నాణ్యమైన సేవల అందించడం తదితర అంశాలపై స్వతంత్ర సంస్థతో సర్వే చేయించనున్నారు. సర్వే వివరాలను ప్రతి ఏడాది ప్రజల ముందుంచనున్నారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణ సదుపాయాలను పెంచేందుకు ప్రభుత్వ బ్యాంకులకు భారీగా మూలధనాన్ని సమకూర్చారు. అలాగే ఖాతాదారులు సులభంగా తమ కార్యకలాపాలు నిర్వహించుకోవడం, సేవల పొందడం ప్రధానమని ప్రభుత్వ ఉద్దేశం. అయిదు కిలోమీటర్ల పరిధిలో బ్యాంకు సర్వీసులను ప్రజలకు అందుబాటులోతేవడం, పొరపాటున ఎలక్ట్రానిక్ ట్రాన్సక్షన్స్ ద్వారా డబ్బులు కట్ అయితే దానిని పదిరోజుల్లో తిరిగి రిఫండ్ చేయడం, వెనుకబడ్డ జిల్లాల్లో సైతం మొబైల్ ఏటిఎంలుఏర్పాటు చేయడం, యాప్ ద్వారా బ్యాంకింగ్ అవుట్ లెట్లను కనుగోవడం తదితర లక్ష్యాలతో సంస్కరణలను ప్రతిపాదించారు.

ఏ బ్యాంకుకెంత మూలధనం

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.8800 కోట్లు, ఐడీబీఐ బ్యాంకు రూ.10,610కోట్లు, యూకో బ్యాంకుకు రూ.6,507 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.5,437 కోట్లు, సెంట్రల్‌బ్యాంక్‌కు రూ5,518 కోట్లు కెనరా బ్యాంకుకు రూ.4,865 కోట్లు, ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకుకు రూ. 4,694 కోట్లు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.4,524కోట్లు, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ రూ.3,571 కోట్లు, దేనా బ్యాంకు రూ.3,045 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ.3,173 కోట్లు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2,634 కోట్లు, కార్పొరేషన్ బ్యాంక్‌కు రూ.2,187 కోట్లు, సిండికేట్ బ్యాంక్ రూ.2,839 కోట్లు, ఆంధ్రా బ్యాంక్ రూ.1,890 కోట్లు, అలహాబాద్ బ్యాంకుకు రూ.1,500 కోట్లు, పంజాబ్ అండ్ సింద్ బ్యాంకు రూ.785 కోట్లు కేటాయించారు.

58 శాతం బ్యాంకులు మొండిబకాయిలతో సతమతం

గతేడాది జులై నుంచి డిసెంబర్ కాలంలో 58 శాతం బ్యాంకులు మొండిబకాయిలు పెరిగాయని ఫిక్కీ- ఐబీఏ సర్వే చెబుతోంది. అదే సమయంలో రుణాల డిమాండ్‌కూడా క్రమంగా స్థిరపడుతోందని ఫిక్కీ- ఐబీఏ నివేదికలో పేర్కొంది. బ్యాంకింగ్ పరిశ్రమ మొత్తం ఆస్తుల్లో ప్రైవేట్, విదేశీ బ్యాంకుల వాటా 59 శాతం వరకు ఉంటుంది. ఫిక్కీ-ఐబీఏ నిర్వహించిన సర్వేలో 58శాతం బ్యాంకులు ఎన్‌పీఏ లేదా మొండిబకాయిలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నాయి. మొండిబకాయిలు ఎక్కువ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెటల్స్, ఇంజినీరింగ్ గూడ్స్ రంగాల నుంచే ఎక్కువగా ఉన్నాయని తేలింది. 28 శాతం బ్యాంకులు రుణాల పునర్వ్యవస్థీకరించాలని విన్నపాలు పెరిగాయని పేర్కొనగా.. చివరగా జరిగిన సర్వేలో 40 శాతం వరకు ఉండేది. వచ్చే బడ్జెట్‌లో మొండిబకాయిల కోసం కేటాయంపులపై పూర్తి స్థాయి పన్ను మినహాయింపులు ఇవ్వాలని బ్యాంకులు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో పాటు కార్పొరేట్ టాక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగానికి పెద్దమొత్తంలో పెట్టుబడులకు అవకాశాలివ్వాలని కోరుతున్నాయి. చాలా మటుకు బ్యాంకులు కార్పొరేట్ టాక్స్‌ణు 30 శాతం నుంచి 25 శాతానికి, మ్యాట్‌ను 15 శాతానికి, వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లంచే వారికి పన్ను మినహాయంపు పరిధిని పెంచాలని, దీంతో రుణాల డిమాండ్ పెరుగుతుందని.. కార్పొరేట్‌తో పాటు రిటైల్ రుణాలకు క్రమంగా డిమాండ్ పెరుతుందని ఫిక్కి నివేదిఋలో పేర్కొంది. కాగా ఈ సర్వే జులై నుంచి డిసెంబర్ 2017 మధ్యలో జరిగింది. తజాగా నిర్వహించిన సర్వేలో డిపాజిట్లు తగ్గాయని 48 శాతం బ్యాంకులు అంటే క్రితంసారి జరిగిన సర్వేలో 58 శాతంపెరిగాయని పేర్కొన్నాయి. 35 శాతం మంది బ్యాంకర్లు మాత్రం కాసా డిపాజిట్లు (సేవింగ్స్ అండ్ కరెంట్ అకౌంట్) ఖాతాలు గణనీయంగా తగ్గాయనిపేర్కొన్నాయి. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని బ్యాంకర్లు సూచిస్తున్నాయి. గతేడాది కాలం నుంచి డిజిటల్ లావాదేవీలు జోరందుకున్నాయని వాటిలో కార్డులు, యూపీఏ, ఆధార్‌పేలని బ్యాంకర్లు చెబుతున్నాయి. బ్యాంకులకు మూలధనం సమకూర్చడం పట్ల బ్యాంకర్లు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో రుణాల డిమాండ్ పెరుగుతుందని వారంటున్నారు.

ఆటో ఎక్స్‌పోలో
మారుతి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

న్యూఢిల్లీ : వచ్చేనెల ఢిల్లీలో ప్రారంభం కానున్న ఆటో ఎక్స్‌పోలో మారుతి సుజుకి ఇండియా కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ కాంపాక్ట్ ఎస్‌యూవీ, ఈ-సర్వైవర్‌ను ప్రదర్శనకు ఉంచబోతోంది. భారతీయ మార్కెట్లో 2020లో ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విడుదల చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ- సర్వైవర్ ద్వారా మారుతి సుజుకి స్థానికంగా లభించే విడిభాగాలతో పాటు చార్జింగ్ స్టేషన్‌లను, రీ సైక్లింగ్ బ్యాటలరీ వినియోగిస్తుందని ప్రకటనలో వివరించింది. ఈ ఎస్‌యూవీ ప్రత్యేక ఆకర్షణాల విషయానికి వస్తే న్యూ జనరేషన్ హైబ్రిడ్ టెక్నాలజీతో కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది. దీంతో పాటు సంప్రదాయ ఇంధన వాడకాన్ని తగ్గిస్తుందని మొత్తం ఎలక్ట్రిఫికేషన్ ద్వారా ఈ కారు నడుస్తుందని ఎంఎస్ఐ ప్రకటనలో వివరించింది. ఇక హైబ్రిడ్ కార్ల విషయానికి వస్తే ప్రస్తుతం జపాన్‌లో పవర్ సుజుకిసోలియో, సుజుకి స్విఫ్ట్ కార్లను హైబ్రిడ్ కార్లను జపాన్‌లో ఉత్పత్తిచేసి అక్కడే విక్రయిస్తుంది. అయితే ఈ కార్లను కూడా ఫిబ్రవరి 9-14 వరకు జరిగే ఆటోఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచుతుంది.



నగలఎగుమతులు 4.65 % తగ్గాయి
• ఏప్రిల్-డిసెంబర్‌లో...



న్యూఢిల్లీ : దేశం నుంచి ఎగుమతి అవుతున్న జెమ్స్ అండ్ జ్యువెలరీ గతేడాది ఏప్రి ల్ నుంచి డిసెంబర్ వరకు 4.65 శాతం క్షీణించి 25 బిలి యన్ డాలర్లకు దిగివచ్చాయి. అంతకు ముందు ఏడాది ఇదే కాలం లో 26.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం అభి వృద్ధి చెందిన మార్కెట్లతో పాటు అమెరికాలో డిమాండ్ తగ్గడమేనని జెమ్స్ అండ్ జ్యువెలరీ ప్రమోషన్ కౌన్సి ల్ (జీజెఈపీసీ) గణాంకాలను బట్టి తెలుస్తోంది. దేశం నుంచి జరుగుతున్న ఎగుమ తులు జెమ్స్. జ్యువెలరీ వాటా 14 శాతం వరక ఉంటుంది. బంగారు నగలు, బంగా రు నాణెలకు డిమాండ్ తగ్గడమే ఎగుమతులు క్షీణించడానికి కారణం. ఎగు మతులు పెంచుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలని మెర్చండైజ్ ఎక్స్ పోర్ట్ ఫ్రం ఇండియా స్కీం (ఎంఈఐఎస్) కోరుతోంది. జెమ్స్, జ్యువెలరీ ఎగు మతులు క్షీణిస్తుంటే దీనికి వ్యతిరేకంగా వెండి ఎగుమతులు 16.28 శాతం పెరిగి 3.11 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్ ఎగు మతులు మాత్రం కేవలం 1.85 శాతం మాత్రమే పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలంలో 5.82బిలియన్ డాలర్ల సరకు తిరిగి వస్తే.. క్రితం ఏడాది ఇదే కాలంలో 5.83 బిలియన్ డాలర్ల నగలు తిరిగి వచ్చాయి. జెమ్స్ అండ్ జ్యువెలీర రంంలో భారత్ చైనానుంచి గట్టిపోటీ ఎదురవుతోంది. గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్‌కాలానికి ముతక వజ్రాల దిగుమతి 10.87 శాతం పెరిగి 14 బిల యన్ డాలర్లకు ఎగబాకాయి. అదే సమయంలో బంగారం కడ్డీల దిగుమతి కూడా 13 శాతం ఎరిగి 3.87 బిలయన్ డాలర్లకు చేరింది.

వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ 7శాతం
• జీఎస్‌టీ ప్రభావం తగ్గింది: హెచ్‌ఎస్‌బీసీ

న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ప్రభావం క్రమంగా తగ్గముఖం పడుతున్నందున వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో భారత స్థూల దేశాయోత్పత్తి (జీడీపీ) 7 శాతంగా నమోదు కావచ్చునని బ్రిటిష్ బ్యాంక్ హెచ్‌హెస్‌బీసీ పేర్కొంది. దీంతో పాటు అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా వచ్చే రెండేళ్లలో భారత ఆర్థికవ్యవస్థ 7.4 శాతానికి ఎగబాకుతుందని అంచనా వేసింది. ఇక భారత ఆర్థిక వ్యవస్థ విషయానికి వస్తే వచ్చే మూడు సంవత్సరాల కాలానికి (18-20 ఆర్థిక సంవత్సరాలకు) 7 శాతం నుంచి 7.6 శాతానికి ఎగబాకుతుందని హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త ప్రణుంజల్ భండారీ చెప్పారు.వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ద్వారా భారత వృద్ధిరేటు గత ఆర్థికసంవత్సరం 7.1 శాతం నుంచి ఈ ఆర్థికసంవత్సరానికి 6.5 శాతానికి పడిపోతుందని ఆమె వృద్ధివేటు క్షీణించడానికి కారణాలను వివరించారు. గతేడాది జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ ఇబ్బందులు క్రమంగా సమసిపోయాయని.. ఇక వచ్చే రెండేళ్ల కాలంలో వృద్ధిరేటు జోరందుకుంటుందని ఆమె చెప్పారు.వచ్చే మూడు సంవత్సరాల కాలంలో జీఎస్టీ ద్వారా జీడీపీకి 0.40 శాతం అదనంగా లబ్ది సమకూరుతుందని ఆమె చెప్పారు. హెచ్‌ఎస్‌బీసీకి కొత్తగా నియమించిన కంట్రీ హెడ్ జయంత్ రికాయే కూడా భారత ఆర్థికవ్యవస్థక్రమంగా పుంజుకుంటోందని.. జీఎస్టీసమస్యలనుంచి గట్టెక్కిందన్నారు. కాగా ఈ నెల రెండవ తేదీన విడుదల చేసని నివేదికలో ఈ ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 శాతంగా అంచనా వేసింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల వృద్ధిరేటు తగ్గుతుందని వివరణ ఇచ్చింది. ఆసియన్ దేశాలతో భారత్ 64 బిలియన్ డాలర్ల వాణిజ్యం గత ఏడాది చేసింది. కాగా ఏషియన్ బ్లాక్ భారత్‌కు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి.

గ్లోబల్ టాప్ 250రిటైలర్స్‌జాబితాలో
రిలయన్స్‌రిటైల్

న్యూఢిల్లీ : రిలయన్స్ రిటైల్ గ్లోబల్ టాప్ 250 కంపెనీల్లో ఈ ఏడాది చోటు దక్కించుకుంది. దేశంలోని ప్రజలు పెద్దెత్తున వినియోగవస్తువులు కొనుగోలు చేయడం కూడా రిలయన్స్ రిటైల్‌కు బాగా కలిసొచ్చింది. 2015-16 ఆర్థిక సంవ త్సరంలో రిలయన్స్ రిటైల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో 59.2 శాతం పెరిగాయని డిలాయిట్ గ్లోబల్ నివేదికలో వెల్లడించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ రిటైల్ దుస్తులు, యక్సెసరీస్‌లను రిటైల్ ట్రెండ్స్, రిటైల్ ఫుట్ ఫ్రింట్స్, రిలయన్స్ డిజిటల్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ చెయిన్‌లను నిర్వహిస్తోంది. భారతీయ రిటైల్ చెయిన క్రమంగా జోరందుకుంటోంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ఇబ్బందులను క్రమంగా బయటపడుతోంది. రాబోయే సంవత్సరాల్లో ఏడాదికి 10 శాతం చొప్పున రిటైల్ రంగం అభివృద్ధి చెందుతుందని డెలాయిట్ ఇండియా భాగస్వామి అనిల్ తాల్‌రేజా చెప్పారు. సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐని అనుమతించడంతో భారత్ మార్కెట్లో పెద్దమొత్తంలో గ్లోబల్ రిటైల్లు ఎంట్రీ ఇవ్వ బోతున్నారని ఆయన తెలిపారు. ప్రజలకు ఆదాయం పెరగడంతో పాటు రిటైల్ ప్రా డక్టులపు పెద్దమొత్తంలో వ్యయం చేస్తుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు భారత్ మార్కెట్ వైపు చూస్తున్నారు.

ఏఐతో ఉద్యోగాలకు ఎసరు:జాక్‌మా

దావోస్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా (ఐఏ)తో భవిష్యత్తులో మానవులు చేయాల్సిన పనులుయంత్రాలు చేస్తాయని ఆలీబాబా వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూ టివ్ ఛైర్మన్ జాక్ బుధవారం చెప్పారు. మానవులకు ఏఐ, బిగ్‌డేటాతో ముప్పు పొం చి ఉందన్నారు. ఏఐతో పాటు రోబోలుకలిసి భవిష్యత్తులో ఉద్యోగాలకు ఎసరు తెస్తాయన్నారు. మానవులు చేయాల్సిన పనులన్నీ యంత్రాలే చేస్తాయని ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్యానెల్ చర్చలో పాల్గొంటూ మా అన్నారు. ఏఐ ద్వారా మానవులకు ప్రయోజనం కలగాలి, సాంకేతిక ప్రజలకు ఎంతో కొం త మేలు జరిగేలా ఉండాలని కానీ వారిని ఏ పనిపాట లేకుండా చేయ డం కాదని మా పేర్కొన్నారు. బాధ్యతాయుత టెక్నాలజీ దిగ్గజాల విషయానికి వస్తే గూగుల్, ఫేస్ బుక్, అమెజాన్, అలీబాబాలు అదృష్టవంతమైన కంపెనీలు మా చెప్పుకొచ్చారు. అదే సమయంలో మనకు బాధ్యత కూడా ఉందని.. మంచి మనసులో ఎంతో కొం త మంచి చేయాలన్నారు. భవిష్యత్తు కోసం మనమంతా ఎంతో కొంత చేయూ తనివ్వాలని ఆయన సదస్సులో ప్రసంగిస్తూ అన్నారు. దీనికి ఆయన చెబుతున్న అంశాలు ఏమిటంటే.. మన లాంటి వారి వద్ద డబ్బు ఉంది.. వనరులున్నాయి. వాటి ని టెక్నాలజీపై విని యోగించి ప్రజలకు ఉపాధి కల్పించేలా ఉండాలని.. ప్రజలకు సాధికారిక చేకూర్చి వారి జీవితాలు మెరుగుపడేలా చూడా లని ఆయన వివ రించారు. కొత్త టెక్నాలజీ ద్వారా చాలా మంది విజయం సాధిం చారు. దీంతో పాటు కొత్త టెక్నాలజీ సామా జిక ఇబ్బందులు కూడా తీసుకొ చ్చింద న్నారు. తమ కంపెనీలు సీనియర్ మేనే జ్‌మెంట్‌లో 37 శాతంమంది మహిళా ఉద్యోగులున్నారని అన్నారు. కంపెనీని విజయవంతంగా ముందుకు తీసు కువెళ్లాలంటే మహిళలను పెద్ద సంఖ్యలో తీసుకోవాలని సూచించారు. తన కంపెనీ విజయవంతం అయిందంటే అది మహిళల వల్లే సాధ్యమైందన్నారు.

మూడేళ్ల గరిష్ఠానికి పెట్రోల్ ధరలు
• డీజిల్‌దీ అదే దారి

న్యూఢిల్లీ : గత కొన్ని రోజుల నుంచి పెట్రోల్, డిజెల్ ధరలు చుక్క లనంటుతున్నాయి. దేశ రాజ ధానితో పాటు ఇతర మెట్రో నగరాలలో ఈ రెండు ఇంధన ధరలు రికార్డుస్థాయిలో పెరిగిపోయాయి. ఢిల్లీలోపెట్రోల్ బుధ వారం లీటరు రూ.72.43కు చేరింది. మూడేళ్లలో ఇదే గరిష్ఠం. ఆగస్టు 2014 లో రూ.72.51 పలికింది. కోలకతా, ముంబై, చెన్నైలలో పెట్రోల్ ధరలు వరుసగా రూ.75.13, రూ.80.30, రూ.75.12కు చేరాయి. ఇవి కూడా మూడేళ్ల గరి ష్ఠానికి ఎగ బాకాయి. చివరగా కోలకతాలో గరిష్ఠంగా అక్టోబర్ 2014 లో రూ.75.46 పలకగా.. ముంబైలో 2014 ఆగస్టులో రూ. 80.60, చెన్నై ఆగస్టు 2014లో రూ.75.78గా నమోదైంది. పెట్రోల్‌తో పాటు డిజిల్ ధరలు పోటీ పడి పెరు గుతున్నాయి. బుధవారం నాడు దేశ రాజధానితో పాటు మిగిలిన మెట్రో నగ రాల్లో ఇదే సీన్ కనిపించింది. ఢిల్లీలో డిజెల్ లీటరు రూ.63.38కి విక్రయించగా.. కోలకతా, ముంబై, చెన్నైలలో వరుసగారూ.66.04, రూ.67.50, రూ. 68. 84 లీటరు విక్రయించారు. డిజెల్ విషయానికి వస్తే సరకు రవాణాతో పాటు ఆహార పదార్థాల రవాణాకు ఎక్కు వగా వినియోగిస్తారు. డిజెల్ ధరలు పెరిగితే ద్రవ్యో ల్బణం పెరగుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెట్రోల్, డిజెల్ ధరలు పెరగడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. వాటిలో ముడి చమురు ఎగుమతి చేసే ఒపెక్ దేశాలు ముడి చమురు ఉత్పత్తిని తగ్గించేశాయి. దీంతో అమాంతం ముడి చమురు ధరలు పెరిగాయి. బుధవారం బ్రెంట్ క్రూడ్ పీపా 70 డాలర్ల వద్ద తచ్చాడుతోంది. దీనితో తోడు ప్రభుత్వం అం తర్జాతీయ మార్కెట్ల ధరలతో పెట్రోల్, డిజిల్ ధరలను అను సంధానం చేసింది. గతంలో 15 రోజులకు ఒకసారి ధరల్లో తేడా కనిపించేది. ప్రస్తుతం రోజు వారి ధరలను సవరించ డంయ జరుగుతోంది. పెట్రోల్‌పై కేంద్రస్థాయిలో, రాష్ట్రస్థా యిలో పెద్దమొత్తంలో పన్నులు విధించడంతో పెట్రోల్, డిజెల్ ధరలు పెరిగిపోతున్నాయి. చమురుశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ కూడా దీనిపై స్పందించారు. వచ్చే జీఎస్టీ మం డలి సమావేశంలో పెట్రోల్, డిజెల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని ఆర్థికమంత్రిని కోరతానన్నారు.



ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ
• పదిలక్షల మందికి • టీసీఎస్,ఇన్ఫోసిస్‌తో పాటు పలు కంపెనీల చేయూత



దీవోస్ : ప్రపంచవ్యాప్తంగా సుమారు పది లక్షలమంది ఐటి రంగానికి చెందిన వారు వృత్తినైపుణ్యంలో మరింత నైపుణ్యం పెంచడానికి పలు ఐటి కంపెనీలు ముం దుకొస్తున్నాయి. వాటిలో యాక్సెంచర్, సీఏ టెక్నాలజీస్, సిస్కో, కాగ్నిజెంట్, హెల్వెట్ ప్యాకెర్డ్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పీఈ), పేగా సి స్టమ్స్, పీడబ్ల్యుసీ, సేల్స్‌ఫోర్స్, సాప్‌లు భాగ స్వామ్యం చేపట్టాయి. పైన తెలిపిన కంపెనీలన్నీ కలిసి సుమా ర పది లక్షల మందికి జనవరి 2021 నాటికి శిక్షణ ఇస్తాయని వరల్డ్ ఎకనమీ ఫోరమ్ స్కిల్ సేట్ పోర్టల్ పేర్కొంది. ఐటి రం గంలో నైపుణ్యం గురించి ఫోరమ్ ఐటి గవర్నర్స్ సిస్కో ఛైర్మన్, సీఈవో చుక్ రాబిన్స్‌నేతృత్వంలో ఏర్పడింది. దీని ముఖ్యం ఉద్దేశం ఐటి రంగంలో శరవేగంగా మారుతున్న ఆ టోమేషిన్, నాలుగవ పారిశ్రామిక విప్లవం వల్ల ఈ రంగంలో ఉద్యోగాలు ఊడిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించడం. దీనకి సమాజంలోని అన్నీ వర్గాల నుంచి ప్రభుత్వం, ప్రజలు ప్రైవేట్ పరిశ్రమల మద్దు తు కావాల్సి ఉంటుంది. విద్యావ్యవస్థలో కూడా మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లు విద్యారంగంలో మార్పులు చేయాలని డబ్ల్యుఈసీ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ క్లాస్ స్కాబ్ చెప్పారు.వృత్తినైపుణ్యం శిక్షణకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ ప్లాట్ ఫాం ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 2018న దీనికి సంబం ధించి న పోర్టల్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ పోర్ట ల్‌లో కొత్త టూల్స్ ద్వారా ఉద్యోగులకు శిక్షణ ఇవ్వవచ్చు. ముందుగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని అమెరికా నుంచి మొద లుపెడతారు. దీనికి మైక్ గ్రీగోరియా, సీఏ టెక్నాలజీస్ సీఈ వో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వచ్చే ఏడాది జరిగే డబ్లుఈఎఫ్ వార్షిక సదస్సులో దీని పురోగతిపై నివే దిక ఇస్తారు. కాగ్నిజెంట్‌సీఈవో ఫ్రాంకోయిస్ డిసౌజా మాట్లాడుతూ 21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా సాం కేతిపరంగా వృత్తి నైపుణ్యం కల వారి కొరత ఏర్ప డుతుందని.. ఆ కొరతను నివారించడానికి ప్రపం చవ్యాప్తంగా చర్యలు చేపట్టాలని కోరారు. టీసీఎస్ సీఈవో రాజేష్ గోపీనాథన్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అంతా డిజిటల్ మయమేనని దానికి తగ్గట్లు తమ ఉద్యోగులను కొత్త టెక్నాలజీపై శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ ఫారిఖ్ భవిష్యత్తు అంతా డిజిటల్‌దేనని అందరికి డిజిటల్ లిటరసీపై దృష్టిపెడుతామన్నారు.

బీమా పరిహారం చెల్లింపుల్లో.....
పారదర్శకంగా వ్యవహరించండి
• కొత్త ప్రాడక్టులతో బీమా వ్యాపారాన్ని విస్తరించండి • ఇన్సూరెన్స్ బ్రోకర్ల సదస్సులో ఐఆర్‌డీఏ ఛైర్మన్ విజయన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పాలసీదారులకు బీమా పరి హారం చెల్లింపులో ఇన్సూరెన్స్ కంపెనీలు టెక్నాలజీని విని యోగించుకుని పారదర్శకంగా వ్యవహరించాలని ఐఆర్‌డిఏ ఛైర్మన్ టిఎస్ విజయన్ సూచించారు. దేశంలో బీమా వ్యా పార విస్తరణకు ఎంతో అవకాశం ఉందని, కొత్త ప్రాడక్టులతో పాలసీదారులకు మెరుగైన ప్రయోజనాలు కలిగించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రస్తుతం 4 శాతం మంది కూడా జీవిత బీమా చేయడం లేదని, సాధారణ బీమా అంతకన్నా తక్కువగా ఉందని ఆయన చెప్పారు. ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ, గత ఏడాది లక్షా 27వేల కోట్ల రూపాయల సాధారణ ఇన్సూరెన్స్ ప్రీమియం రాగా, 4 లక్షల కోట్ల మేరకు జీవిత బీమా ప్రీమియం వసూలైందని తెలిపారు. ఆరోగ్య బీమాపై ప్రజలు మొగ్గు చూపుతున్నారని, ఇది ఏటా 43 శాతం పెరుగు తుందని చెప్పారు. మొత్తం బీమా ప్రీమియంలో మెడికల్ ఇన్సూరెన్స్ 27శాతం వాటా కలిగి ఉందని, ఇందులో 30వేల కోట్ల ప్రీమియం బ్రోకర్ల ద్వారా వసూలైందని ఆయన చెప్పా రు. బీమా పాలసీలు పెంచేందుకు ఆన్‌లైన్ ఛానల్‌ను విస్తృ తంగా వినియోగించుకోవాలని చెప్పారు. ఐటి రంగంలో వస్తున్న టెక్నాలజీ ద్వారా యాప్స్ అభివృద్ధిచేసి ఖాతా దారులకు దగ్గరవ్వాలని విజయన్ సూచించారు.బ్రోకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజయ్ కేడియా మాట్లాడుతూ, 2016-17లో 33 శాతం వృద్ధితో లక్షా 28వేల కోట్ల జనరల్ ఇన్యూరెన్స్ ప్రీమియం వసూలైందని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఎన్న డేటా ఎనలటిక్స్, టెక్నాలజీ, బ్రోకర్ల పాత్రతో బీమా రంగాన్ని మరింత విస్తరించేందుకు దోహద పడుతుందన్నారు. పాలసీదారులకు ఎక్కువ ప్రయో జనాలు, లబ్ధి చేకూర్చే విధంగా ఇన్సూరెన్స్ బ్రోకర్లు సహ కరించాలని ఆయన సూచించారు.న్యూ ఇండియా అస్యూ రెన్స్ కంపెనీ సీఎండి జి.శ్రీనివాసన్ మాట్లాడుతూ, ప్రభుత్వరంగ బీమా కంపెనీలు సెటిల్మెంట్లు వేగంగా చేస్తాయని ప్ర జలకు విశ్వాసం ఉందన్నారు. ప్రభుత్వ కంపెనీ పాలసీ దారులు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారని ఆయన అన్నా రు.ఈ సదస్సుకు బ్రోకర్స్ అసోసియేషన్ కార్యదర్శి విజయ రాంపాల్ స్వాగతం పలికారు. ఇన్సూరెన్స్ బ్రోకర్స్, ఇన్సూ రెన్స్ కంపెనీల సీఈవోలు, ఎండీలు దాదాపు 400 మం దికిపైగా ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఉడాన్-2కు అనూహ్య స్పందన



- కొత్తగా అందుబాటులో 43 విమానాశ్రయాలు, హెలీప్యాడ్లు
- సర్వీసులు అందించేందుకు పోటీపడ్డ విమానయాన సంస్థలు
- అత్యధిక బిడ్లు కైవసం చేసుకున్న ఇండిగో
- కేంద్ర పౌరవిమానయాన శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాలను ప్రధాన నగరాలతో అనుసంధానం చేసే ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకంలో మొదటి విడత కంటే 2వ విడతకు అనూహ్య స్పందన లభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు ఈ విషయాన్ని బుధవారం ఢిల్లీలో వెల్లడించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక విమానాశ్రయాలను అందుబాటులోకి తీసుకొచ్చి సామాన్యుడు విమాన ప్రయాణం చేయగలిగేలా చేశామని ఆయన తెలిపారు. తాము ప్రవేశపెట్టిన ఉడాన్ పథకానికి వస్తున్న స్పందన చూస్తుంటే ఉత్సాహం పెరుగుతోందని అశోక్ గజపతి రాజు వ్యాఖ్యానించారు. మొదటి విడత ఉడాన్ ద్వారా 16 కొత్త మార్గాలు అందుబాటులోకి వచ్చాయని, మిగతావి త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 2వ విడత ఉడాన్ పథకంలో తాము రోడ్డు, రైలు సదుపాయం సరిగా లేని ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు ప్రాధాన్యతనిచ్చామని అన్నారు. వీటికి ఊహించినదాని కంటే ఎక్కువ స్పందన లభించిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీపై ఆధారపడకుండా విమానయాన సంస్థలు స్వయం సమృద్ధి సాధించుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.

ఉడాన్-2 ద్వారా జమ్ము-కాశ్మీర్‌లోని కీలక స్థావరం కార్గిల్ పట్టణం దేశంలోని ఇతర నగరాలతో ఎయిర్ కనెక్టివిటీ పొందనుంది. 2వ విడత బిడ్డింగ్‌లో అత్యధిక మార్గాలు గెలుచుకుని ఇండిగో ముందు వరుసలో నిలిచింది. దేశీయ విమానయానంలో అగ్రగాములుగా కొనసాగుతున్న ఇండిగో, జెట్ ఎయిర్‌వేస్ విమానయాన సంస్థలు తొలి దశ బిడ్డింగ్‌కు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే తొలి దశలో బిడ్లు దక్కించుకున్న సంస్థలు కొత్త మార్గాల్లో లాభాలు ఆర్జించడం గమనించిన ఈ రెండు సంస్థలు 2వ దశలో పోటీపడ్డాయి. ఇండిగో 20 మార్గాల్లో బిడ్లు గెలుపొందగా, జెట్ ఎయిర్‌వేస్ 4 మార్గాల్లో బిడ్లు కైవసం చేసుకుంది. ఉడాన్2 పథకం మొత్తం 43 విమానాశ్రయాలు, హెలీప్యాడ్లను పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకురానుంది. దేశవ్యాప్తంగా ఉడాన్ పథకం అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత నుంచి మొత్తం 78 విమానాశ్రయాలక ు విమానయాన సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది. ఇందులో 36 విమానాశ్రయాల్లో అప్పటికే సర్వీసులు ఉండగా అదనంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. మరో 13 విమానాశ్రయాల్లో ఏదో నామమాత్రంగా ఒకటి అరా సర్వీసులు ఉండగా, వాటికి మరిన్ని అదనపు సర్వీసులు జోడించారు. 29 అసలేమాత్రం సర్వీసులు లేని విమానాశ్రయాల్లో కొత్తగా సర్వీసులు ప్రారంభించి వాటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. 2వ విడత ఉడాన్‌లో కర్ణాటకలోని హుబ్లీ, కొప్పల్ సహా దేశవ్యాప్తంగా 45 నగరాలకు విమాన సర్వీసులు అందించేందుకు విమానయాన సంస్థలన్నీ గట్టిగా పోటీ పడ్డాయని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా వెల్లడించారు. అలహాబాద్ నగరం నుంచి 12 నగరాలకు, కేరళలోని కన్నూరు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం నుంచి 8 పట్టణాలకు కొత్తగా సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఉడాన్ పథకం ద్వారా విమానయాన సంస్థలకు ఇచ్చే రాయితీకి రూ. 800 కోట్లు ఖర్చవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది.

సీఏలు నిజాయితీతో వ్యవహరించాలి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సీఏ (చార్టెడ్ అకౌంటెట్లు) తమ వృత్తి ధర్మాన్ని పాటించాలని, దీంతోపాటు అందరికీ మేలు జరిగే విధంగా చూడాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి సూచించారు. బుధవారం సత్యసాయి నిగమాగమంలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు పట్టాల పంపిణీ (స్నాతకోత్సవం) జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఏ అంటే చాలా కఠినమైన పాఠ్యాంశం అని దీనిలో ఉత్తీర్ణులు కావడానికి దీనికోసం చాలా శ్రమించి ఉంటారన్నారు. వారు భవిష్యత్తులో మంచి జీవితాన్ని అనుభవించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టాలు అందుకున్న విద్యార్థులు నీతి, నిజా యితీతో పనిచేయాలని ఆయన సూచించారు. కంపెనీలకు సీఏగా వ్యవహరించినప్పుడు తమ మార్క్‌ని చూపిం చడంతో పాటు నిజాయితీతో కంపెనీ ఎదుగుదలకు తోడ్పా టునందించాలన్నారు. ఐఏఎస్ సందీప్ కుమార్ సుల్తాని యా మాట్లాడుతూ తాను కూడా సీఏ చదివానని, నాకు ఈ సబ్జెక్ట్‌పై అవగాహన ఉందన్నారు. పట్టాలందు కుంటున్న విద్యార్థులకు ఆయన అభినందనలు తెలి పారు. అందరూ నిజాయితీతో పనిచేయాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ఐసీఏఐ సీఏ పూర్వ అధ్యక్షుడు సీఏ ఎం.దేవరాజ రెడ్డి, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ బాబు అబ్రహం కల్లివయాలిల్, ఎస్ఐఆర్‌సీ వైస్ చైర్మన్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఈ ఇనిస్టిట్యూట్ పనిచేస్తుంద న్నారు. 1949 సంవత్సరంలో 1700 మంది సభ్యులతో ఈ సంస్థ ప్రారంభమయ్యిందన్నారు. ప్రస్తుతం 2.80 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే రెండో అతి పెద్ద అకౌటింగ్ సంస్థగా నిలిచిందన్నారు. కొత్తగా ఎన్‌రోల్ అయిన సభ్యులకు మెంబర్‌షిప్ సర్టిఫికెట్ బహూకరిం చేందుకు ఏటా రెండుసార్లు ఐసీఏఐ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తుందని వారు తెలిపారు. ఈ స్నాతకోత్సవం ఐసీ ఏఇ నాలుగు ఈస్ట్, వెస్ట్, సౌత్, సెంట్రల్ రీజియన్లలోని 8 కేంద్రాల్లో జరిగిందని వారు తెలిపారు.

కేసీఆర్ అవినీతి పవన్‌కు కనిపించడం లేదా?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అవినీతిపై పోరాటం చేస్తా నంటున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు.. సీఎం చం ద్రశేఖర్‌రావు అవినీతి కనడటం లేదా..? అని ఏఐసీసీ కార్య దర్శి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు ప్రశ్నించారు. సంస్కృతి కోసం గొప్పగా చెబు తున్న పవన్.. ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్నారో చెబితే బాగుంటుందని విమ ర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో మాజీ ఎంపీ రవీంద్రానాయక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. 38 వేల కోట్ల అవినీతిపై పవన్ తెలుసుకోవాలన్నారు. కేసీఆర్ రాసిచ్చిన స్పీచ్‌నే పవన్ చదువుతున్నారని వీహెచ్ ఆరోపించారు.

కోదండరాం, మంద కృష్ణపై కేసులు పెట్టి..

పవన్‌కు రెడ్ కార్పెటా..? : సబితా ఇంద్రారెడ్డి

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రశ్నించడం మర్చిపోయి.. పాలకులకు వంతపాడుతున్నారని మాజీ హోం శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికే సీఎం కేసీఆర్.. పవన్‌ను రంగంలోకి దింపారని ఆమె విమర్శించారు. టీజేఏసీ చైర్మన్ కోదండరామ్, మంద కృష్ణమాదిగ చేపడుతున్న ఉద్యమాలను అణిచివేయడానికి పోలీసులను ప్రయోగిస్తున్న ప్రభుత్వం.. పవన్‌కు మాత్రం పోలీసులు రెడ్ కార్పెట్ పరుసున్నదని ఆరోపించారు.

స్టీల్ ధరలను తగ్గించాలి

బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇటీవల భారీగా పెంచిన ఐరన్, స్టీల్ ధరల పెంపును ఉపసంహరించకుంటే నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టుల పనులను ఆపివేస్తామని భారతీయ బిల్డర్ల అసోసియేషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఇనుము, ఉక్కు ధరలు 60 శాతానికిపైగా పెరగడంతో అన్ని నిర్మాణ రంగ ప్రాజెక్టుల వ్యయం భరించలేని రీతిలో పెరిగిపోయిందని బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బి.సుగుణాకర్‌రావ కూడా పాల్గొన్నారు. ఇనుము, స్టీల్ ధరలను ప్రభుత్వమే నియంత్రించాలని, అది చేయని పక్షంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల వ్యయం మరింతగా పెరుగుతుందని ఎస్ఎన్ రెడ్డి చెప్పారు. ఇనుము, స్టీల్ ధర ఆరు నెలల క్రితం టన్నుకు రూ.30వేలు ఉండగా, ఇప్పుడు రూ.48వేలకుపైగా పెరిగిందని ఆయన చెప్పారు. స్టీల్ తయారీదారులు సిండికేట్‌గా ఏర్పడి ఏకపక్షంగా ధరలు పెంచారని ఆయన ఆరోపించారు. మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, నీటి పారుదల, భవన నిర్మాణాల మాదిరిగా డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలను కూడా 94 జీవో పరిధిలోకి తీసుకురావాలని ఎస్ఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. జీవో 94 మేరకు ఇనుము, సిమెంట్, ఇసుక ధరలు పెరిగితే అంచనా వ్యయం కూడా పెంచే విధానం ఉందని, కానీ డబుల్ బెడ్‌రూమ్ పథకానికి అలాంటి అవకాశం లేదని ఆయన చెప్పారు. ఇటీవల భారీగా పెరిగిన సిమెంట్, ఇసుక, ఇనుము ధరలతో టెండర్ మేరకు డబుల్ బెడ్‌రూమ్ నిర్మించడం సాధ్యం కావడం లేదని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని ఎన్ఎస్ రెడ్డి కోరారు.

పార్టీ వీడిన వారి పరిస్థితి ఆత్మహత్యా సదృశ్యం

బడుగుల మద్దతు తెదేపాకే : ఎల్ .రమణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజకీయాల్లో హత్యలు ఉండవని, కేవలం ఆత్మహత్యలే ఉంటాయని, పార్టీని వీడి ఇతర పార్టీల్లో వెళ్ళిన వారి పరిస్థితి ఆత్మహత్యా సదృశ్యమేనని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. తెదేపాకు అనుభవం ఉన్న నాయకత్వం ఉందని, బడుగు, బలహీన వర్గాల మద్దతు పార్టీకి ఉందని ఆయన చెప్పారు. తెదేపా కార్యకర్తలకు నాలుగవ బ్యాచ్ శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. పార్టీకి సుశిక్షితులైన కార్యకర్తలు ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

ఆవిర్భావం నాడు కూడా కార్యకర్తలే ఉన్నారు : కొత్తకోట దయాకర్‌రెడ్డి

జాతీయ అధికార ప్రతినిధి కొత్తకోట దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 1982లో ఎన్‌టిఆర్ పార్టీని ఏర్పాటు చేసినపుడు ఎవరూ లేరని, కార్యకర్తలే నాయకుల్లాగా ఎదిగారని అన్నారు. నాయకులు కొందరు పార్టీని వీడినప్పటికీ క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలను తీర్చిదిద్దుతూ ముందుకు వెళతామని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం ఎన్‌టి రామారావు ఎస్టీలకు రిజర్వేషన్లు 6 శాతానికి, ఎస్సీలకు 15 శాతానికి పెంచారని పార్టీ ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ ఆచరణకు నోచుకోలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, జాతీయ పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యుడు బక్కని నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు మేడం రామేశ్వరరావు, పెద్దోజీ రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భద్రత కమిషన్‌ను.. నాలుగు నెలల్లో ఏర్పాటు చేయండి

ఏపీ సర్కారుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర సెక్యూరిటీ కమిషన్(ఎస్ఎస్ సీ), పోలీసు కాంప్లెయింట్ అథారిటీ(పీసీఏ) లను నాలుగు వారాల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆంధ్రప్రదేశ్ సర్కారును ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావు లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. రాష్ట్రంలో పోలీసు అధికారుల చర్యల వల్ల ఇబ్బంది పడ్తున్న ప్రజల సమస్యలపై విచారణ చేపట్టేందుకు యుద్ధ ప్రాతిపదికపై రాష్ట్రస్థాయి సెక్యూరిటీ కమిషన్లు, జిల్లా పోలీసు కాంప్లెయింట్ అథారిటీ లను ఏర్పాటు చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు ఏప్రిల్ 2017లో తీర్పును వెలువరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేసే కమిటీల్లో ఎవరెవరు సభ్యులుగా ఉండాలనేది ఆ తీర్పులో పేర్కొన్నారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీ హోంశాఖ ,ప్రకాశం జిల్లా ఎస్పీ తదితరులు డివిజన్ బెంచ్ ముందు అప్పీలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ హోంశాఖ తరపు ప్రభుత్వ న్యాయవాది విద్యావతి వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నఅంశాల పరిధిని దాటి హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారని విన్నవించారు... పోలీసు అధికారులపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోలీసు ఫిర్యా దుల అథారిటీలను ఏర్పాటు చేయాలని హైకోర్టు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల హోంశాఖ ముఖ్య కార్యదర్శులకు స్పష్టం చేసినట్లు తెలిపారు.. ఆయా సంస్థలను ఏర్పాటు చేయకపోవడంతో సింగిల్ జడ్జి ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభించినట్లు నివేదించారు. ఈ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవరించింది. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినందువల్ల ఎస్ఎస్ సీ,పీసీఏల ఏర్పాటు తప్పనిసరి అని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఏపీకి నాలుగు నెలల గడువు ఇచ్చింది. గత ఏప్రిల్ నెలలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలు చేయలేదని పేర్కొంటూ ఏకలవ్య ఫౌండేషన్ కు చెందిన ఎన్.ఎస్.చంద్రశేఖర్ హైకోర్టుకు లేఖ రాసిన విషయం తెలిసిందే..

నైపుణ్యాభివృద్ధి శిక్షకులకు అరకొర వేతనాలే

- 11 ఏళ్లుగా పెరగని జీతాలు
- రూ. 40వేలు పొందుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటున్న మెంటర్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ డిగ్రీ కాళాశాల విద్యార్థులకు పాఠ్యాంశాల తోపాటు, వారిలో నైపుణ్యానికి మెరుగులు దిద్దేందుకు 2006-07లో ప్రభుత్వం సంకల్పించింది. తర్వాతి కాలంలో ఈ ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇచ్చింది. అయితే, నైపుణ్యాభివృద్ధి శిక్షకులకు మాత్రం శాపంగా మారింది. పదేళ్ల కిందట ప్రారంభ దశలో వేతనంతోనే కాలం వెల్లదీయాల్సి వస్తోంది. ఇతర శాఖలతోపాటు, విద్యాశాఖలోనూ పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు పెరిగినప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఫుల్‌టైమ్ మెంటర్ల వేతనాలు మాత్రం 8వేల వద్దే నిలిచిపోయింది. వీరితోపాటు 2006-07లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా చేరిన వారు ఇప్పుడు రూ. 40,270 నెలవారీ వేతనం పొందుతున్నారు. నైపుణ్య శిక్షకుల వేతనాల్లో మార్పు లేకపోవడం వారి బతుకులను దుర్భరం చేస్తోంది.

2006లో జేకేసీ పేరుతో ఏర్పాటు....

జవహార్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ)లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉద్యోగ నైపుణ్యాలను విద్యార్థులకు బోధించడానికి ఫుల్‌టైమ్ మెంటర్స్ అనే పోస్టును విద్యా శాఖ ద్వారా సృష్టించి కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేశారు. పీజీ విద్యార్హతలతో రాత పరీక్షను నిర్వహించి అందులో ప్రతిభ ఉన్న వారిని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన ఎక్స్‌పర్ట్ కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహించి భర్తీ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక, 2016-17లో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్(టిఎస్‌కెసి)గా రూపాంతరం చెందింది.

బాధ్యతలు ఎక్కువ.. వేతనం తక్కువ..

ఫుల్‌టైమ్ మెంటర్లు డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థులకు అనలిటికల్ స్కిల్స్, అప్టిట్యూడ్ స్కిల్స్, టెక్నికల్స్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, గైడెన్స్ అండ్ జాబ్ ప్రిపేర్డ్‌నెస్ స్కిల్స్‌ను నేర్పించాల్సి ఉంటుంది. వీటితోపాటు కళాశాలకు, కమిషనర్ ఆఫీసుకు సంధానకర్తగా, కళాశాల వెబ్‌సైట్‌ను పర్యవేక్షించాలి. కళాశాలకు సంబంధించిన అన్ని రకాల సాంకేతిక పనులను వీరే చూసుకోవాలి. వీటితోపాటు జిజ్ఞాస, యుఎన్‌డిపి, నాక్, డిఆర్‌సీ మొదలైన పనులను కూడా వీరు చేయాల్సి ఉంటుంది.

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి: మెంటర్ల అసోసియేషన్

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేసే కాంట్రాక్ట్ లెక్చరర్ల వేతనాలు 2006-07లో రూ. 8500 ఉండేది వారి కంటే తక్కువగా వేతనాలు ఇవ్వాలని నిర్ణయించిన విద్యాశాఖ అధికారులు కాంట్రాక్ట్ ఫుల్‌టైమ్ మెంటర్లకు రూ. 8000 వేతనం నిర్ణయించారు.

ఆ తరువాత కాంట్రాక్ట్ లెక్చరర్ల వేతనాలు పెరుగుతూ 40వేలకు చేరాయి. ఫుల్‌టైం పనిచేస్తున్న తమకు కూడా వేతనం పెంచాలని మెంటర్ల అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది. ఇకనైనా ముఖ్యమంత్రి తమ సమస్యలను అర్థంచేసుకోవాలని నివేదిస్తోంది.

వన్యప్రాణుల సంఖ్య పెరిగింది

రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మూడు రోజులుగా కొనసాగుతున్న పులులు, జంతువుల జాతీయ జనగణన తెలంగాణ అటవీ అధికారులకు సంతోషాన్ని నింపింది. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన సర్వేతో పోలిస్తే.. తెలంగాణ రాష్ట్రంలో జంతువుల సంచారం మెరుగైనట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 22 నుంచి జంతువుల జనగణనపై సర్వే అటవీశాఖ అధికారుల సర్వే నిర్వహిస్తుండగా.. మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. అదిలాబాద్ జిల్లా కవ్వాల్ అటవీ ప్రాంతంలో మంత్రి రామన్న ఆరు కిలోమీటర్లు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ జంతువులు ఎక్కడ సంచరిస్తున్నాయో అధికారులు గుర్తించారని, ఆడవుల్లో జంతువుల సంఖ్య పెరిగిందని తెలిపారు. కవ్వాల్ అమ్రాబాద్, కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలోని బెజ్జూర్, పెంచికల్ పేట, పోతపల్లి బొంబాయిగూడ బీట్లలో పులి పంజా గుర్తులు కనిపించాయని తెలిపారు. సిర్పూర్ రేంజ్‌లో చిరుత అడుగులు, ఎలుగుబంటి ఆనవాళ్లు కనిపించాయన్నారు. కదంబ అటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్ వెళ్తున్న మార్గంలో పులి కనిపించినట్లు, ఆ పులి అడవిలోకి వెళ్లేదాకా బస్సును నిలిపివేశారని అధికారులు తెలిపారని మంత్రి రామన్న వివరించారు. భూపాలపల్లి అటవీ ప్రాంతంలో చిరుతపులి, అడవి దున్నల సంచారాన్ని గుర్తించారని, అమ్రాబాద్ అటవీ ప్రాంతంలోని మల్లయ్య లొద్దిలోనూ పులులు, చిరుతల సంచారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు శాఖాహార, వృక్షజాతుల జాతుల జంతువులు లెక్కింపు జరుగుతోందన్నారు.

పాడి పరిశ్రమలో అక్రమాలపై మంత్రి సీరియస్

నేడు ఉన్నతస్థాయి సమీక్షకు ఆదేశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థలో జరుగుతున్న అవకతవకలు, ఉద్యోగుల మధ్య సమన్వయ లోపం, సంస్థ నష్టాలకు గల కారణాలు తదితర అంశాలను పరిష్కరించేందుకు పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ రంగంలోకి దిగారు. ఇప్పటికే సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌పై ఉద్యోగులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన ఆయన కాస్త గట్టిగానే మందలించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత అన్ని ప్రభుత్వరంగ సంస్థలు లాభాల బాటలో పయనిస్తుంటే పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నష్టాల్లో కూరుకుపోవడానికి గల కారణాలేంటని అధికారులను నిలదీశారు. ఇదే అంశంపై గురువారం లాలాపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్షకు ఆదేశాలు ఇచ్చారు.

రాజీవ్ హత్యతో సంబంధం లేదు

సుప్రీం కోర్టులో దోషి పెరరివలన్ పిటిషన్

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసులో తనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును పునః సమీక్ష చేయాలని ఎజి పెరరివలన్ సమర్పించిన పిటిషన్‌పై స్పందించాలని సీబీఐను సుప్రీంకోర్టు కోరింది. 1999 మే నెలలో పెరరివలన్‌ను దోషిగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తనకు ఈ కుట్రతో సంబంధంలేదని పెరరివలన్ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. జస్టిస్ రంజన్ గొగయ్, జస్టిస్ ఆర్ బానుమతిలతో కూడిన ధర్మాసనం బుధవారం పెరరివలన్ పిటిషన్‌ను పరిశీలించి దీనిపై సీబీఐ స్పందనను కోరింది. ఇందుకు సీబీఐకు మూడు వారాల గడువును నిర్దేశించింది.

ఆచార్య పోస్టుల భర్తీకి శోధన కమిటీ

- రాత పరీక్ష లేకుండా నేరుగా ఎంపిక
- విద్యార్హతలు, పరిశోధనకు 50 మార్కులు
- సాంకేతికత, బోధన నైపుణ్యానికి 30 మార్కులు
- ఇంటర్వ్యూకు 20 మార్కులు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- యూనివర్శిటీల వారీగా నోటిఫికేషన్లు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఆచార్య పోస్టుల భర్తీకి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. రాత పరీక్ష లేకుండా నేరుగా ఆచార్య పోస్టులను భర్తీ చేయడానికి మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రతి యూనివర్సిటీ సబ్జెక్టు వారీగా స్ర్కూటిని కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ కమిటీ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఆచార్య పోస్టులకు రాత పరీక్ష లేకుండా, విద్యార్హతలు, పరిశోధనలకు 30 మార్కుల వెయిటేజీ ఇవ్వగా, టెక్నాలజీ, టీచింగ్ స్కిల్స్‌కు 30 మార్కులను కేటాయించింది. వీటితోపాటు ఇంటర్వ్యూకు 20 మార్కులను కేటాయించింది. మొత్తం 100 మార్కులకు గానూ మూడింటిలో వచ్చిన మార్కుల ప్రతిభ ఆధారంగా ఆచార్య పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. యూనివర్సిటీలు ప్రభుత్వం అనుమతించిన పోస్టుల భర్తీ కోసం యూనివర్సిటీ వారీగా నోటిఫికేషన్‌ను జారీ చేయనుంది. నోటిఫికేషన్ కంటే ముందే ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా ఎగ్జిక్యూటీల్లో ఆచార్య పోస్టుల భర్తీకి అనుమతి తీసుకోవల్సి ఉంటుంది. యూనివర్సిటీల ఈసీ కమిటీల సమావేశాలు జరిగిన అనంతరం పోస్టుల భర్తీకి యూనివర్సిటీలు నోటిఫికేషన్‌ను జారీ చేస్తాయి. రాష్ట్రంలో 1061 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

డొమైన్ నాలెడ్జ్, టీచింగ్ స్కిల్స్‌కి 30 మార్కులు

బోధన అనుభవానికి 10 మార్కులు కేటాయిస్తారు, ఇందుకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించారు.
1.గవర్నమెంట్/యూనివర్సిటీ డిగ్రీ/పీజీ కాలేజ్ రెగ్యులర్ టీచర్స్
2. గవర్నమెంట్/యూనివర్సిటీ డిగ్రీ/పీజీ కాలేజ్ కాంట్రాక్ట్ రెగ్యులర్ టీచర్స్
3. ప్రైవేటు ఎయిడెడ్ డిగ్రీ/పీజీ కాలేజ్ రెగ్యులర్ టీచర్స్
4. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ డిగ్రీ/పీజీ కాలేజ్ టీచర్స్
బుక్స్‌కు ప్రింటింగ్‌కు 5 మార్కులు
బుక్- సింగిల్ ఆథర్‌షిప్- 5 మార్కులు
బుక్- జాయింట్ ఆథర్‌షిప్- 3 మార్కులు
బుక్- ఎడిటెడ్ ఆథర్‌షిప్- 3 మార్కులు
బుక్- కో-ఎడిటర్ ఆథర్‌షిప్- 2 మార్కులు
వెయిటేజీ ఫర్ పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్(పిడిఎఫ్) 5 మార్కులు
టీచింగ్ స్కిల్స్ డెమో లెక్చర్స్ ఆధారంగా 10 మార్కులు

ఆరుగురు సభ్యులతో స్ర్కూటినీ కమిటీ

ప్రతి విశ్వవిద్యాలయం అధ్యాపక పోస్టులను భర్తీ చేయాల్సిన అన్ని సబ్జెక్టులకు వేర్వేరు స్ర్కూటిని కమిటీని ఏర్పాటు చేయాలి. కమిటీలో ఆరుగురు సభ్యులు ఉంటారు. సబ్జెక్టుకు సంబంధించిన డీన్, వీసీ ప్రతిపాదించిన నామినీ, ఒక సబ్జెక్టు ఎక్స్‌ఫర్ట్(ఇతర యూనివర్సిటీకి చెందిన వ్యక్తి), తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రతిపాదించిన నామినీ(ఇతర యూనివర్సిటీకి చెందిన వ్యక్తి), హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, చైర్‌పర్సన్ బివోఎస్ సభ్యులుగా ఉంటారు.

విద్యార్హతలు, పరిశోధనకు 30 మార్కులు

- డిగ్రీలో సాధించిన మార్కుల శాతానికి అత్యధికంగా 8 మార్కులు కేటాయిస్తారు.
- 70 శాతానికి మించి మార్కులు సాధిస్తే 8 మార్కులు, 60-70 శాతానికి 6 మార్కులు, 50-60 శాతానికి 4 మార్కులు,
50 శాతానికి 2 మార్కులు కేటాయిస్తారు.
- ఏజీలో 70 శాతం మించితే గరిష్ఠంగా 12 మార్కులు లభిస్తాయి. 60-70 శాతానికి 10 మార్కులు, 50-60 శాతం ఉత్తీర్ణతకు 8 మార్కులు ఇవ్వనున్నారు.
- ఇతర విద్యార్హతలలు జెఆర్‌ఎఫ్/నెట్/స్లెట్/సెట్ అర్హత సాధిస్తే 7 మార్కులు, పిహెచ్‌డికి 7, ఎంఫిఎల్‌కు 5 మార్కులు లభిస్తాయి.
- యూజీసీ గుర్తింపు జర్నల్స్‌లో ప్రచురితమైన వ్యాసాలకు అత్యధికంగా 10 మార్కులు ఇస్తారు.
- సెమినార్స్/కాన్ఫరెన్స్/సింపోజియం/ఎడిటెడ్ వ్యాల్యూమ్స్ విత్ ఐఎస్ఎస్ఎన్/ఐఎస్‌బిఎన్ (ఇతర జర్నల్స్) గరిష్ఠంగా 6 మార్కులు
- టెక్నికల్, ఇంజనీరింగ్, ఇతర కోర్సులు చేసి నెట్/స్లెట్/సెట్ అర్హత లేని వారికి యూనివర్సిటీ వీసీ నియమించిన ప్రత్యేక కమిటీ రాత పరీక్షను 14 మార్కుల కోసం నిర్వహించనుంది. 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. తప్పు సమాధానానికి మైనస్ మార్కులు(0.25 ప్రతి తప్పు సమాధానానికి) ఉంటాయి. గేట్ పరీక్ష మోడల్‌లో సిలబస్ ఉంటుంది.

ఇంటర్వ్యూకు 20 మార్కులు

ఇంటర్వ్యూలో సబ్జెక్ట్ ప్రజెంటేషన్, రీసెర్చ్ విధానం, పర్సనాలిటీ, ఇంటర్వ్యూ ఫెర్మాన్స్‌ను పరిశీలిస్తారు.
మొత్తం విద్యార్హతలు, టెక్నాలజీ, టీచింగ్ స్కిల్స్‌తోపాటు ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల తుది జాబితాను ఎంపిక చేస్తారు.

యూనివర్సిటీ	ప్రొఫెసర్	అసోసియేట్	అసిస్టెంట్	మొత్తం
మహాత్మాగాంధీ యూనివర్సిటీ	10	15	9	34
పాలమూరు యూనివర్సిటీ	12	10	41	63
శాతావాహన యూనివర్సిటీ	9	16	15	40
తెలంగాణ యూనివర్సిటీ	11	25	23	59
ఆర్‌జెకెటియు	25	11	60	96
అంబేద్కర్ ఓపెన్‌యూనివర్సిటీ	-	3	7	10
పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ	-	1	6	7
కాకతీయ యూనివర్సిటీ	-	11	125	136
జెఎన్ఏఎఫ్‌యు	-	5	10	15
జెఎన్‌టియు హైదరాబాద్	32	52	102	186
ఉస్మానియా యూనివర్సిటీ	-	121	294	415

ఘనంగా శ్రీ శారదాపీఠం వార్షికోత్సవం

విశాఖపట్నం, ప్రభ న్యూస్: విశాఖ శ్రీ శారదా పీఠం వార్షికోత్సవం బుధ వారం అత్యంత ఆధ్యాత్మికయుక్తంగా జరిగింది. పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ ఆశీర్వాదంతో బాల స్వామి పర్య వేక్షణలో ఉదయం నుంచి ప్రారంభమైన వార్షకోత్సవ వేడుకల్లో దీక్షాధారణలు, గణపతి పూజ, పుణ్యహ వాచన, పంగవ్య ప్రాసన, అగ్నమధనం, లక్ష్మీగణపతి హోమం, యజుర్వేద సహిత హోమాలు నిర్వ హణతో విశాఖ శ్రీ శారదా పీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భక్తజనులకు కన్నులపండువు చేసింది. స్వరూపానందేంద్ర స్వామి అనుగ్రహ ప్రసంగం చేశారు. నిష్ణాతులైన పండితులకు స్వర్ణ కంకణధారణ చేశారు. ఇక్కడి నూతన స్వర్ణ మండపంలో శ్రీ శారదా చంద్రమౌళేశ్వరులకు విశేష అభిషేక అర్చలను జరిపారు. బాలసరస్వతీ నాట్య బృందం సభ్యులుచే సంప్ర దాయ నృత్య ప్రదర్శనలూ భక్తులు తిలకించారు. పీఠం ట్రస్టీలు సన్యాసిరావు, ప్రకాశరావు,చల్లా రామారావు, శ్రీనివాస్, పీఠం ధర్మాధికారి జి. కామేశ్వర శర్మ, ఆస్థాన పండితు లు కృష్ణశర్మ, వ్యాపార వేత్త తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

నాలెడ్జ్‌హబ్ ఏపీ

విశాఖపట్నం, ప్రభ న్యూస్: సమా జానికి ఉపయోగపడేలా విద్యార్థి లోకాన్ని తీర్చి దిద్దాలని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. విద్యార్థి దశలోనే వారిని ప్రతిభావంతులుగా తీర్చదిద్దడంతో పాటూ సమాజానికా సేవ రంగంలోనూ వారి ప్రమేయంపెరిగేలా చేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధ వారం విశాఖపట్నం ఆంధ్ర విశ్వకళాపరిషత్ సెనేట్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు.ఇక్కడ ఆంధ్ర ప్రదేశ్‌లోని యూనివర్శిటీలకు చెంది న ఉప కుల పతులతో సమావేశం అయ్యానని చెబుతూ తనకు పూర్తి సంతృప్తి లభించిందన్నారు. వీసీల సమావేశం తనకు పూర్తి ఆనందాన్ని పంచిందన్నారు.


ఫిరాయిస్తే పదవులా?

ఏపీ బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు సంచలన వ్యాఖ్యలు

అమరావతి, ఆంధ్రప్రభ : మంత్రి పదవులు పొందిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామాచేసి హుందాగా గెలిచి సభలోకి రావాలని లేదా ఏపార్టీ తరపున గెలిచినా మంత్రి పదవి పొందవచ్చునే నూతన చట్టాన్ని తేవాలని భారతీయ జనతాపార్టీ శాసనసభాపక్ష నాయకుడు విష్ణుకుమార్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ పక్షాల్లో కలకలం సృష్టించాయి. పీఏసీ సమావేశాల ముగింపు సందర్భంగా బుధవారం అసెంబ్లీలో ఆకస్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రజాసంకల్పయాత్రను పురస్కరించు కుని ప్రత్యేక హోదాకు ప్రధాని ఆమోద ముద్ర వేస్తే బీజేపీకి మద్దతు పలుకుతారని వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఈ నేపథ్యంలో విష్ణుకుమార్‌రాజు పీఏసీ సమావేశాల సందర్భంగా వైకాపాకు చెందిన పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రరెడ్డి, ఆదిమూలపు సురేష్‌లతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలోని వైఎస్సార్‌సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఇప్పటికే టీడీపీ బీజేపీ మైత్రిపై మీడియాలో వస్తోన్న భిన్నకథనాలకు తోడు విష్ణు కుమార్‌రాజు చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. అసెంబ్లీలో మీకు నచ్చినది.. నచ్చనిది.. ఏమిటని విష్ణుకుమార్ రాజును మీడియా ప్రశ్నించగా బీజేపీ, వైకాపా, టీడీపీ అందరూ ఉండి సరైన రీతిలో చర్చలు జరిగినప్పుడు ప్రజలకు ఉపయోగకరమైన విషయాలు చర్చించి ప్రభుత్వంలో ఉన్న లోపాలను ఎత్తిచూపి ప్రజలకు మేలు చేయడం నచ్చిన అంశంగా పేర్కొన్నారు. అందరూ వచ్చినప్పుడు అసెంబ్లీ బాగుందని విష్ణుకుమార్‌రాజు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సభ్యులను అధికార పక్షంలో మంత్రులను చేయడం తనకు నచ్చని అంశంగా పేర్కొన్నారు. ఇది కరెక్ట్‌కాదన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారడం సాధారణ అంశమన్నారు. దీనికి గ్రావిటీ తక్కువగా ఉంటుందన్నారు.

ఆ ఇళ్లను అమ్మాలనుకుంటున్నారా?

- నెక్లెస్ రోడ్డులోని 'డబుల్'పై సర్కార్‌కు హైకోర్టు ప్రశ్న



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్‌నగర్‌లో నిర్మించిన 640 డబుల్ బెడ్ రూం ఫ్లాట్లలో సగం ఫ్లాట్లను అమ్మివేయాలని తలపెట్టిందో లేదో తాము తెలుసుకోవాలనుకుంటున్నామని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గుడిసె వాసుల స్థలాల్లో డబుల్ బెడ్ రూం ఫ్లాట్ల నిర్మాణంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వానికి అనుమతిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఎం.జగన్నాథ్ సింగ్ మరో తొమ్మిది ధర్మాసనం ముందు పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి. ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ... డబుల్ బెడ్ రూం ఫ్లాట్లను నిర్మించేందుకు గుడిసె వాసులు తమ భూములను ఇచ్చేందుకు స్వయంగా ముందుకొచ్చినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుత వ్యాజ్యంలోని పిటిషనర్ల భార్యలు కూడా తమ భూములు ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. దీనిపై గడిసెవాసుల తరపు న్యాయవాది జె.ప్రభాకర్ బదులిస్తూ... గుడిసెవాసులు తమ భూములను మాత్రమే స్వాధీనం చేశారని, హక్కులను వదులుకోలేదని తెలిపారు. పిటిషనర్ల భూములను ప్రభుత్వంసేకరించలేదని, పరిహారంకూడా చెల్లించలేదన్నారు.ఒక డబుల్ బెడ్ రూం ఫ్లాట్‌ను ఇస్తామనే హామీతో భూముల నుంచి ఖాళీ చేయించిందని విన్నవించారు. అయితే ప్రభుత్వం ఇప్పుడు తమ భూముల్లో నిర్మించిన 340 ఫ్లాట్లను అమ్మివేయాలని చూస్తోందని తెలిపారు. దీనిపై టీఏజీ స్పందిస్తూ.. ప్రభుత్వం ఆ భూమిలో 620 ఫ్లాట్లను నిర్మిస్తోందని తెలిపారు. వాటిలో గుడిసె వాసులకు 280 ఫ్లాట్లను కేటాయించిందన్నారు. మిగిలిన 340 ఫ్లాట్లను అమ్మివేయాలనుకుంటోందని తెలిపారు. ఆ ఫ్లాట్లను ధరలకు విక్రయిస్తే ఆ సొమ్మును బ్యాంకులో ప్రత్యేక ఖాతాలో జమ చేయాలని సూచించిన ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని మళ్లీ సింగిల్ జడ్జి ముందుకే తిప్పి పంపింది. దీనిపై ప్రమాణ పత్రం దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వర్మకు మహిళా సంఘాల నోటీస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాంగోపాల్‌వర్మ మరో వివాదంలో చిక్కుకున్నారు. గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ పేరుతో తీస్తున్న షార్ట్ ఫిల్మ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి మహిళా సంఘాలు. ఆల్ ఇండియా డెమోక్రాటిక్ ఉమెన్స్ అసోసియేషన్ లీగల్ నోటీసులను పంపింది. 26వ తేదీన విడుదల వుతున్న గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ షార్ట్ ఫిల్మ్‌ని నిలిపివేయాలని కోరింది. దేశంలోని యువతను పెడతోవ పట్టిస్తున్న విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేసింది. వర్మని చూసి మిగతా యువత కూడా సెక్స్ షార్ట్ ఫిల్మ్ వైపు మొగ్గుచూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. పేరున్న సినీ దర్శకుడు ఇలాంటి షార్ట్ ఫిల్మ్ తీయడం వల్ల మిగతా వారు కూడా అనుకరించే ప్రమాదం ఉందని మహిళా సంఘాల నేతలు అన్నారు.

భార్యాభర్తలు గొడవపడి నాలుగేళ్ల చిన్నారిని చిదిమేశారు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భార్యాభర్తల గొడవలో అమాయకుడైన నాలుగేళ్ల చిన్నారి మృత్యువాత పడింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం జానకీపురంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. విశాఖపట్టణం వాస్తవ్యులైన కృష్ణ, నాగమణి సుబాబుల్ మొక్కలు నాటడానికి జానకీపురం వచ్చి స్థిరపడ్డారు. కుటుంబ సమస్యలపై వారిద్దరూ తరచుగా గొడవ పడుతూ ఉండేవారు. కృష్ణమంగళవారం కల్లుతాగి ఇంటికి వచ్చాడు. భార్యతో వాదానికి దిగాడు. దాదాపు గంటపాటు ఇద్దరు గొడవపడ్డారు. సుబాబుల్ కర్రతో కృష్ణ.. నాగమణిని కొట్టడానికి ప్రయత్నించాడు. అయితే దెబ్బ నాగమణి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల కూతురు సుప్రియపై పడింది. మద్యం మత్తులో ఉన్న కృష్ణ ఆ విషయాన్ని గుర్తించలేకపోయాడు. సుప్రియ స్పృహ కోల్పోయింది. కూతురిని తీసుకుని నాగమణి వైరాలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లింది. అయితే, అప్పటికే ఆమె మరణించింది. సంఘటన జరిగిన వెంటనే కృష్ణగ్రామం విడిచి పారిపోయాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వేధింపుల కేసులో లెక్చరర్ల అరెస్టు

హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ జూనియర్ కాలేజీలో దారుణం జరిగింది. ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని ఇద్దరు లెక్చరర్లు లైంగికంగా వేధించిన ఘటన వెలుగుచూసింది. పాఠాలు బోధించాల్సిన లెక్చరర్లు.. మెంటార్‌లో ఉండాల్సింది పోయి కోరిక తీర్చాలని బెదిరించడం కలకలం రేపింది. తన దగ్గరికి రాకపోతే మార్కులు తక్కువగా వేస్తానని ఇద్దరు లెక్చరర్లు బెదిరించారు. మొదట్లో తేలికగా తీసుకున్నా.. ఈ వేధింపులు ఎక్కువవడంతో ఆ విద్యార్థిని తన తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో తల్లిదండ్రులు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కాలేజీలో వేధింపులకు పాల్పడ్డ లెక్చరర్లను అరెస్ట్ చేశారు.

దిగొచ్చాడు.. రూ.1,04,400ని ఏకమొత్తంలో ఆన్‌లైన్‌లో చెల్లించేశాడు...

రోడ్డెక్కితే దూసుకెళ్తారు. లిమిట్ ఉన్నా స్పీడ్ ఏ మాత్రం తగ్గరు..జరిమానాలు వేసినా పట్టించుకోరు... ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా 70 చలానాలు ఉన్నాయి. వీటిలో మూడు ఓవర్‌స్పీడ్ పెనాల్టీలు. ఇవన్నీ కూడా హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఒక కారు చేసిన అరాచకం. ఆ కారు బిఎండబ్ల్యూ. కోట్లు పోసి కొన్న కారులో తన దర్పం చూపించాడు. సిటీ రోడ్లపై ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తున్నా మార్పు రాలేదు. డోంట్ కేర్ అన్నాడు. అన్నీ కలిపి 70 చలానాలు. ఆ కారు నెంబరు ఏపీ 28 6363. చక్రధర్ పేరుపై ఉంది. ఎన్నిసార్లు హెచ్చరించినా వినకపోవడంతో..జరిమానాలు కట్టకపోవడంతో ఆ లిస్టును ట్రాఫిక్ పోలీసులు కోర్టుకు సమర్పించారు. ఇందులో చక్రధర్ పేరు కూడా ఉంది. 70 చలానాలు విధించినా మారని వ్యక్తి.. కోర్టు కేసు, జైలు శిక్ష అనగానే వణికిపోయాడు. అంతే జనవరి 20వ తేదీన అన్నీ చలానాలు కలిపి అక్షరాలా రూ.1,04,400 రూపాయలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు.

ఏసీబీ వలలో ఎస్ఎస్‌సి సీనియర్ అసిస్టెంట్

ఏసీబీ అధికారుల వలలో ఎస్ఎస్‌సి సీనియర్ అసిస్టెంట్ సాయినాథ్ చిక్కారు. వివరాల్లోకి వెళితే.. మార్కుల మోమోలో తప్పుగా నమోదైన పేరు మార్పు చేయడం కోసం సాయినాథ్ రూ.4,500 లంచం డిమాండ్ చేశాడు. ఈ మేరకు నాంపల్లిలోని బోర్డ్ కార్యాలయంలో వెంకటనారాయణ అనే వ్యక్తి నుంచి రూ.4,500లు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

40 మంది జర్నలిస్టులకు ఫిబ్రవరిలో చెక్కులు

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరుకు ఎంపికైన లబ్ధిదారులకు ఫిబ్రవరి నెలలో చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. బుధవారం తెలుగు విశ్వవిద్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షతన పాలకమండలి సమావేశంతో పాటు జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం సీఎం పుట్టినరోజు సందర్భంగా 71 మందికి ఆ తరువాత 30 మందికి ఇప్పటివరకు 100 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఈ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేశామన్నారు. మరో 41 మంది లబ్ధిదారులకు వచ్చే ఫిబ్రవరి నెలలో ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొ న్నారు. మీడియా అకాడమీ ఒక వైపు శిక్షణా తరగతులను నిర్వహిస్తూనే మరో వైపు జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏడు జిల్లాల్లో శిక్షణా తరగతులను నిర్వహించామన్నారు. సభ్యుల సూచన మేరకు ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ జర్న లిస్టులకు కూడా శిక్షణా తరగతులను నిర్వహిస్తామన్నారు. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు తెలంగాణకు చెందిన వారే సంపాదకులుగా ఉన్నారని ఇది భావితరాల జర్నలిస్టులకు స్ఫూర్తిగా ఉంటుందని కావున వీరి జీవన విశేషాలు, ఇంటర్వ్యూలతో కూడిన ఒక పుస్తకం తీసుకు రావాలని నిర్ణయించామన్నారు. ఈ పుస్తకంలో పొందు పరచాల్సిన అంశాల గురించి నిర్ణయం తీసుకోవడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశామని వారి నిర్ణయం మేరకే ఆ పుస్తకం ప్రచురితమవుతుందన్నారు. మీడియా అకాడమీ నూతన భవన నిర్మాణానికి సంబంధించి రూ.15 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణా తరగతులు, తెలంగాణ పత్రికా సంపాదకులు, వారి అనుభవాలు, వారి జీవన రూపురేఖల వంటి అంశాల ఇంటర్వ్యూలుచ డాక్యు మెంటరీలు, మోనోగ్రాఫ్స్, తెలంగాణ పత్రికా రంగ చరిత్ర వంటి పలు అంశాలపై పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పలు పత్రికలకు సంబంధించి ఎడిటర్లు, పలువురు జర్నలిస్టులు, అధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కింద ఏడుగురికి ఉద్యోగాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ఉద్యానశాఖలో కారుణ్య నియామకాల కింద ఏడుగురికి తోటమాలి ఉద్యోగాలను ఇచ్చారు. ఇందుకు సంబంధించి సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అస్లా, సయ్యద్ అలీ, కరన్, వెంకటేశ్, లక్ష్మణ్, మిరాజుద్దీన్, అలీముద్దీన్‌లకు నియామక పత్రాలను అందజేశారు.



ఐఐటీల్లో బాలికలకు సూపర్ న్యూమరీ సీట్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఐఐటీల్లో అమ్మాయిలకు ప్రత్యేకంగా సూపర్ న్యూమరీ సీట్లను కేటాయించనున్నట్లు జేఈఈ అడ్వాన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ తెలిపారు. ఇప్పటి వరకు అమ్మాయిలకు ఐఐటీల్లో 8 శాతం సీట్లు మాత్రమే ఉన్నాయి. లింగ బేధాన్ని తగ్గించాలనే ప్రధాన ఉద్దేశంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆదేశం మేరకు ఈ ఏడాది నుంచి అమ్మాయిలకు ఐఐటీ డిగ్రీ కోర్సుల్లో 14 శాతం సీట్లను కేటాయించాలని నిర్ణయించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన అమ్మాయిలకు ఐఐటీల్లో జరిపే ప్రవేశాల్లో అవకాశం కల్పిస్తారు. ఇప్పటి వరకు ఉన్న రిజర్వేషన్ల ప్రక్రియను సూపర్ న్యూమరీ సీట్ల భర్తీలోనూ అమలు చేస్తారని చెప్పారు.

సినీనటి కృష్ణకుమారి ఇక లేరు



హైదరాబాద్, ఆంధ్రప్రభ సినిమాల్లో: అలనాటి ప్రముఖ నటి కృష్ణ కుమారి బుధవారం ఉదయం తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని తన నివాసంలో కన్ను మూశారు. వారో ప్రముఖ నటి షావుకారు జానకికి స్వయాన సోదరి అయిన కృష్ణకుమారి 1933 మార్చి 6న బంగాల్‌లో జన్మించారు. 1951లో ఆమె సినీరంగ ప్రవేశం జరి గింది. నవ్వితే నవరత్నాలు ఆమెకు తొలి చిత్రం. పల్లెటి దుచు, బంగారు పాప, ఇలవేల్పు, భార్యాభర్తలు, కులగోత్రాలు, లక్షాధికారి, బందిపోటు వంటి చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టాయి. తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళం వంటి భాషల్లో దా దాపు 110 చిత్రాల్లో ఆమె నటించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ తదితర ప్రముఖ హీరో ల సరసన పలు చిత్రాల్లో నటించడంతో పాటు తన దైన అభి నయంతో ఆమె ప్రేక్షకులను మెప్పించారు. కృష్ణకుమారి మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఆమె అంత్యక్రియలు గురువారం బెంగళూరులో జరగనున్నట్లు సమాచారం.

అసెంబ్లీ సీట్ల విషయం ప్రభుత్వానిదే



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, నాయకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న అసెంబ్లీ సీట్ల పెంపు వ్యవహారంపై మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ స్పందించారు. తెలంగాణాకు సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు ఢిల్లీ వచ్చిన ఆయన అసెంబ్లీ సీట్ల పెంపు వ్యవహారానికి సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు 'ఉభయ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు విషయం నాకు తెలియదు. నియోజకవర్గాల పెంపు వ్యవహారం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది. పార్టీకి ప్రమేయం లేదు. హెూం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి విషయం తెలుసు కుంటాను' అని జవాబిచ్చారు. కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ప్రకాష్ జవదేకర్‌తో సమావేశమైన బండారు దత్తాత్రేయ తెలంగాణాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణా సర్కార్ భూమి కేటాయిస్తే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని జవదేకర్ హామీ ఇచ్చారని దత్తాత్రేయ మీడియాకు వివరించారు.

కాంగ్రెస్‌కు ముఖేష్‌గౌడ్.. గుడ్‌బై!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మూల ముఖేష్ గౌడ్ పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతోంది. 2014 ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత.. క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. గాంధీభవన్‌కు కూడా రావడం లేదు. ఇటీవలనే ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. రాజకీయాలపై మళ్లి నజర్ పెట్టిన ముఖేష్‌గౌడ్ కాంగ్రెస్‌ను వీడి టీఆర్ ఎస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకుం టున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. కాగా ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ సూచన మేరకు కారు ఎక్కడానికి రెడీ అవతున్నారనే అసక్తికరమైన చర్చ జరగడం గమనార్హం. వచ్చే ఎన్నికల్లో గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి ముఖేష్ విజయం సాధించాలంటే ముస్లిం మైనార్టీల ఓట్లు కీలకం కానున్నాయి. గతంలో కాంగ్రెస్-మజ్లిస్ పార్టీ మధ్య అవగాహన ఒప్పందం ఉండటంతో ముఖేష్ గెలుపు సునాయసం అయ్యేది. అయితే ఇప్పుడు మారిన పరిస్థితుల్లో ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు సహకరించడానికి ముందుకు రావడం లేదు. టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు జతకట్టే పరిస్థితులు ఉన్నాయి. కానీ ముఖేష్, మజ్లిస్ నేతల మధ్య స్నేహపూర్వకంగానే ఉంటారని అంటున్నారు. టీఆర్ఎస్‌లో చేరితే మద్దతు ఇస్తామని అసదుద్దీన్ సూచన చేయడం వల్ల ముఖేష్ కారు ఎక్కడానికి ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఇదే అంశంపై అసదుద్దీన్ కేసీఆర్‌తోనూ మంతనాలు సాగించినట్లు తెలిసింది. కాగా ముఖేష్‌గౌడ్ ముఖ్య అనుచరులు మెజార్టీగా టీఆర్ఎస్‌లోనే చేరారు. టీఆర్ఎస్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే.. మంచి మూహుర్తం చూసుకుని జెండా మార్చడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం.

గజల్ శ్రీనివాస్‌కు బెయిల్!

- షరతులు వర్తిస్తాయి : నాంపల్లి కోర్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరయింది. ఆయనకు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో ఏ2 నిందితురాలిగా పార్వతికి కూడా న్యాయ స్థానం ముందస్తు బెయిల్ ఇచ్చింది. ప్రతి బుదవారం, ఆదివారం పోలీసుల ఎదుట హాజరు కావాలని గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పైన కోర్టు విచారణ జరిపింది. బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు లాయర్ ఈ నెల 12న కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. గజల్ శ్రీనివాస్ 20 రోజులకు పైగా జైలులో ఉన్నారని, ఇప్పటికైనా బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాది మంగళవారం కోర్టును కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు పిటిషన్ విచారణ నిర్ణయాన్ని బుధ వారంకు వాయిదా వేసింది. ఇప్పుడు ఆయనకు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. పార్వతి కూడా ముందస్తు బెయిల్ దాఖలు చేశారు. పార్వతిని ఎందుకు అరెస్ట్ చేయలేదని కోర్టు చీవాట్లు పెట్టింది. పరారీలో ఉన్నందున ఆమెను అరెస్టు చేయలేదని పోలీసులు న్యాయస్థానానికి చెప్పారు. కాగా, గజల్ శ్రీనివాస్ ఇద్దరు మహిళలతో మసాజ్ చేయించుకోవడమే కాకుండా తన ఇంటి పనిమనిషితో శృంగారం, ఓరల్ సెక్స్ చేయించుకునే వీడియో క్లిప్పింగ్స్ లీక్ అయిన విషయం తెలిసిందే. ఇవి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపాయి.

పోలీసు పురస్కారాలకు 21 మంది ఎంపిక





హైదరాబాద్, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవం సందర్బంగా పోలీసులకు కేంద్ర ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించింది. ఈ పతకాలకు రాష్ట్రం నుంచి 21 మంది పోలీసు అదికారులు ఎంపికయ్యారు. వారిలో ఆరుగురికి పోలీసు శౌర్య పతకాలు, ఇద్దరికి రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకాలు, 13 మంది పోలీసులకు కేంద్ర ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. అదనపున డీజీ జితేందర్‌కు రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకం, ఎస్పీ మస్తీపురం రమేశ్‌కు ఉత్తమ పోలీసు ప్రతిబా పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది.

వరంగల్‌కు మహర్దశ
ఆధునిక హంగులతో కలెక్టరేట్

- కలెక్టరేట్ భవనశంకుస్థాపనలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి





హన్మకొండ, ప్రభ న్యూస్ : రాష్ట్రప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల విభజన నేపథ్యంలో వరంగల్ జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించడం జరిగింది. అందులో భాగంగా వరంగల్ అర్బన్ జిల్లాకు మొట్టమొదటిసారిగా కలెక్టరేట్ కార్యాలయాన్ని శంకుస్థాపన నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగరానికి ఇస్తున్న ప్రాధాన్యతను, వరంగల్ నగరానికి ఉన్న చరిత్రను దృష్టిలో ఉంచుకుని జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులందరు సమిష్టిగా పనిచేస్తామని కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ఉదయం అర్బన్ కలెక్టరేట్ ప్రాంగణంలో రూ.35.38 కోట్లతో నిర్మించనున్న జిల్లా కలెక్టరేట్ భవన సముదాయానికి ఉప ముఖ్యమంత్రి, శాసన సభాపతి, మంత్రులతో కలిసి శంకుస్థాపన చేశారు. మన జిల్లాకు ఉన్న ప్రత్యేకస్థానం నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, నగరం వారసత్వ సిటీగా, స్మార్ట్ సిటీగా ఎంపిక కావడమేవడమే గాక, రాష్ట్ర ప్రభుత్వం హైదారాబాద్ తర్వాత వరంగల్‌ను అంతకన్నా, ఎక్కువ స్థాయిలో అభి వృద్ధికి వారికి వార్షిక బడ్జెట్‌లో నగరాభివృద్ధికి రూ.300 కోట్లు కేటాయిస్తోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలల మేరకు అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు. పరిపాలన సంస్కరణలో భాగంగా, ప్రజాసౌలభ్యం కోసం రాష్ట్రాన్ని 31 జిల్లాలుగా మార్చడమే గాక, కొత్తగా ఏర్పడిన 21 జిల్లాలతో పాటు, పాత జిల్లాలలోని మరో అయిదు జిల్లాల్లో కలెక్టరేట్ భవన సముదాయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అందుకనుగుణంగా నిధులు మంజూరు చేసిందని అందులో భాగంగానే ఈ శంకుస్థాపన చేసు కున్నామన్నారు. శాసన సభారతి సిరికొండ మధుసూదనాచారి మాట్లా డుతూ అన్ని రంగాలు, వర్గాలు, ప్రాంతాల అభివృద్ధికి జిల్లాల పునర్విభజన జరిగిందని, కాకతీయ రోజుల పరిపాలనను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని, ప్రజల ముఖాలల్లో ఆనందం కోసం రాష్ట్ర సర్వతో ముఖా భివృద్ధికి పరిపాలన కొనసాగుతుందన్నారు.

రోడ్డు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ భవన సముదాయాన్ని సంవత్సర కాలంలో పూర్తిచేయడం జరుగుతుందని, కలెక్టర్ అభ్యర్థన మేరకు భవన నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులు మంజూరు చేస్తామన్నారు. నిర్మాణం పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ, నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి కొత్తగా రెండు జాతీయ రహదారుల కోసం నిధులు మంజూరు చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల కాలం లోనే దేశంలో 29వ రాష్ట్రమైన మన రాష్ట్రం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉంద న్నారు. మనందరం ఆత్మగౌరవంతో ముందుకు వెళ్లే విధంగా పరిపాలన కొనసాగించడం హర్షనీయ పరిణామమన్నారు.

రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ పార్టీ ద్వారా ఉద్యమకాలంలో తీసుకున్న నిర్ణయాలను మేనిఫెస్టోలో పెట్టి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రాష్ట్రప్రభుత్వం పరిపాలనలో అమలు చేస్తూ రాష్ట్రానికి దేశంలోనే ముందు స్థాయిలో ఉంచేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పార్లమెంట్ సభ్యులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ చన్న జిల్లాల ఏర్పాటు గొప్ప నిర్ణయమన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న కలెక్టరేట్ భవనంలో తన తండ్రి రెవెన్యూ శాఖలో పనిచేశారని, వారికి క్యారేజీ తాను తీసుకొచ్చేవాడినని ఈ సందర్భంగా ఆయన భవనంతో తనకున్న గుర్తు లను తెలిపారు.

అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి కాటా మాట్లాడుతూ 1857లో హైదరాబాద్ రాష్ట్రంలో వరంగల్, ఖమ్మం జిల్లాలో కలిసి ఉండేదని, 1885లో తిరిగి వరంగల్ సుభ ఏర్పడిందని, వరంగల్ చరిత్రను వివరిస్తూ, 1886 ఏర్పడిన సుభ భవన నిర్మాణం అప్పుడు జార్జ్ పామర్ ఉండేవారని, 1956 నుంచి 2016 వరకు 37 మంది కలెక్టర్లు పనిచేశారని, జిల్లా పునర్విభజన అనంతరం తాను మొదటి కలెక్టర్‌ని అన్నారు. మరో వంద సంవత్సరాల తర్వాత కూడా చరిత్రలో ప్రస్తుతం శంకుస్థాపనలో పాల్గొన్న వారి పేర్లన్నీ నిలిచిపోతాయన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి నాలుగు కోట్ల నిధులు అదనంగా అవసరముంటాయని కలెక్టర్ ఆర్ అండ్ బీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో శాసన సభ్యులు చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, టి.రాజయ్య, సిటి పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శృతిఓజాలను మాట్లాడారు. సమావేశంలో కార్పోరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

దొరలకో న్యాయం.. దళితులకో న్యాయమా?

- రేపోమాపో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం : మందకృష్ణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : 'తెలంగాణ రాష్ట్రంలో దొరలకు ఒక న్యాయం.. దళితులకు ఒక న్యాయమా..?. రాజ్యాంగం కొందరికి చుట్టంగా మారిందనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజా ఉద్యమాలను అణిచివేయాలని చూస్తున్న కేసీఆర్‌కు' మాదిగలు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం శాంతి యుతంగా 48 గంటల ఉపవాస దీక్షకు దిగితే.. కనీసం 48 నిమిషాలు కాకముందే అరెస్టు చేసి అక్రమ కేసులతో జైల్లో పెట్టారని ఆయన విమర్శించారు. ఈ విషయంపై గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. బుధ వారం ఆయన సికింద్రాబాద్ సివిల్ కోర్టుకు వచ్చి ఆయన సంతకం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్న వాళ్లకు పోలీసు వ్యవస్థ కక్ష తీర్చుకునే యంత్రాంగముగా మరొద్దని ఆయన హితవు పలికారు. మిలియన్ మార్చ్ ఘటనలో అత్యంత విధ్వంసం జరిగిందని, కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కవితలపై పోలీసులు 307 సెక్షన్ కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదయిన ఎందుకు అరెస్టు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఆ కేసులను తిరగదోడి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. కేసీఆర్ గతంలో పది రోజులు దీక్ష చేసినప్పుడు ఎందుకు కేసులు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు.

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన కోదండరామ్‌తో పాటు ఎమ్మార్పీఎస్‌కు రాష్ట్రంలో స్వేచ్ఛలేకుండా పోయిందన్నారు. కానీ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాన్ యాత్రకు మాత్రం ప్రభుత్వం స్వేచ్ఛగా అనుమతిచ్చిందన్నారు. మమ్ముల్ని తిరగనీయకుండా పోలీసులను పెట్టిన ప్రభుత్వం.. పవన్ కళ్యాణ్ తిరిగేందుకు పోలీసులను రక్షణగా పెట్టారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణాలో కేసీఆర్ పునాదులు కదులుతున్నాయనే పవన్‌ను తెలంగాణలో తిప్పుతున్నారని కృష్ణమాదిగ వివరించారు. పవన్‌ను చూసేందుకు అభిమానులు వస్తున్నారని, ఓటేసేందుకు కాదనే విషయం తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై ఈ నెల 27 లోపు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఆ తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ను మంద కృష్ణమాదిగ మార్యాదపూర్వకంగా కలిశారు.

సెల్ఫీమోజు ప్రాణంమీదకొచ్చింది

- ఎంఎంటీఎస్‌తో సెల్ఫీకి యువకుడి యత్నం.. గాయాల పాలై బతికి బయటపడ్డ వైనం...

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సెల్ఫీ పిచ్చి పరాకాష్టకు ఈ ఘటన నిలువెత్తు నిదర్శనం. వాట్సాప్ ప్రొఫైల్‌లో పెట్టుకునేందుకు రైలు పట్టాలపై లింగంపల్లి వైపు నుంచి ఎంఎంటీఎస్ రైలు వస్తుండగా చేయి అడ్డం పెట్టి సెల్ఫీకి నవ్వుతూ ఫోజిచ్చాడో యువకుడు. తాను సెల్ఫీకి సమాయత్తమయ్యేలోపే వెనుక నుంచి రైలు వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడి చేతికి, తలకు తీవ్రగాయాలయ్యాయి.

ఇదే సమయంలో అతడి స్నేహితులు సైతం అక్కడే ఉండి ఆ దృశ్యాన్ని తమ కెమెరాలలో బంధించినట్లు తెలుస్తోంది. కాగా, గాయపడ్డ యువకుడు వరంగల్‌కు చెందిన శివ. గాయపడ్డ శివని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మూడ్రోజుల పాటు శివ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ప్రస్తుతం శివకు ప్రాణాపాయమేదీ లేదని రైల్వే ఎస్పీ అశోక్ తెలిపారు. కాగా, ఘటనకు సంబందించి శివపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని, కోర్టు రూ.500 జరిమానా విదించింది. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్న శివ వరంగల్‌కు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. శివ సెల్ఫీ వీడియో తీసుకోవడంతో అతడ్ని రైలు ఢీకొనే దృశ్యాలు కూడా రికార్డయ్యాయి. ఇప్పుడు ఆ వీడియో వైరల్‌గా మారింది. సాహసోపేతమైన సెల్ఫీలు తీసుకోవాలనే ఉత్సాహంలో ప్రాణాలకు ప్రమాదమని తెల్సినా.. యువత ఇలాంటి ప్రయత్నాలు చేస్తూ ప్రాణాల మీదికి, ప్రాణాలను పోగొట్టుకోవడం విచారకరం. ఇప్పటికే చాలా మంది ఇలాంటి సెల్ఫీలు తీసుకుంటూ ప్రాణాలు కోల్పోయినప్పటికీ యువతలో ఎలాంటి అవగాహన రాకపోవడం శోచనీయం.

రోడ్డు ప్రమాదాల నివారణలో టీఎస్ టాప్!

- ఆర్టీసీని సామాజిక కోణంలో ఆదుకుంటాం: మంత్రి మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రోడ్డు ప్రమాదాల నివారణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందని రవాణా శాఖ మంత్రి పి. మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణ ఉద్యమంగా సాగాలని పిలుపునిచ్చారు. విస్తృత ప్రచారంతో ప్రాణాల విలువ చాటవలసి ఉందన్నారు. ఆర్టీసీ రోడ్డు భద్రత వారోత్సవాల్లో మంత్రి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు, జేటీసీ పాండు రంగనాయక్, కార్యనిర్వాహక సంచాలకులు సత్య నారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదీర్ఘ కాలం పాటు ప్రమాద రహితంగా బస్సులు నడిపించిన ఉత్తమ డ్రైవర్లను మంత్రి ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ కార్మికులను ఉద్దేశించి మహేందర్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించిన ప్రజా రవాణా సంస్థలకు టిఎస్ఆర్టీసీ మార్గదర్శకం అన్నారు. టిఎస్ఆర్టీసీ గత నాలుగు సంవత్సరాలుగా 0.07 ప్రమాద రేటుతో దేశంలోనే ప్రమాదాలు తగ్గించిన ప్రజా రవాణా సంస్థల్లో నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఆర్టీసీలో 20,112 మంది డ్రైవర్లు ఉండగా, సుమారు 5 వేల మంది ప్రమాదాలను నివారిస్తున్నారని తెలియచేశారు. ప్రమాద రహితంగా విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లను మంత్రి అభినందించారు. ఆర్టీసీలో ప్రయాణం భద్రతకు మారుపేరుగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు కేటాయించామని, కొత్త బస్సులను కొను గోలు చేయడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలియచేశారు. ఆర్టీసీ ఇటీవల తీసుకున్న చర్యలతో 97 డిపోలకు గాను 21 డిపోలు నష్టాలను తగ్గించు కున్నా యని, సగానికి పైగా డిపోలు నష్టాలను అధి గమించి లాభాలబాట పడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీని సామాజిక కోణంలో అదుకుంటామని, సిబ్బంది కష్టపడి సంస్థను లాభాలబాట పట్టించడంతో పాటుగా ప్రమాదాలను నివారించవలసి ఉందని కోరారు. ఆర్టీసీని దేశంలోనే గొప్ప ప్రజా రవాణా సంస్థగా తీర్చి దిద్దుతామని సంస్థ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు మాట్లాడుతూ, భద్రతకు పునరంకితమవుతామని కార్మికులకు పిలుపు నిచ్చారు. రోజు 36 వేల కిలో మీటర్ల గమనాన్ని సాధిస్తున్న ఆర్టీసీ కార్మికులను ఆయన అభినందించారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఆర్టీసీ నిలుస్తుందన్నారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్‌గా విధులు నిర్వహించి ఇటీవలి కాలంలో మృతి చెందిన అమీనుద్దీన్ (కరీంనగర్ -2) కుటుంబానికి ఈ సందర్భంగా రూ. 12 వేల నగదును ఆయన సతీమణి హైమాదీబేగంకు మంత్రి అందచేశారు. దాదాపు 30 ఏళ్లకు పైగా ప్రమాద రహి తంగా బస్సులు నడిపించిన ఎ. కృష్ణ (కరీంనగర్), బి. కేశయ్య (మహబూబ్‌నగర్), గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు చెందని బి. రాములు, జె.టి.రెడ్డి, ఎస్. విఠల్, కరీంనగర్ జోన్‌కు చెందిన ఎస్.కె. జహీర్ అహ్మద్, వి.బాబు, ఎన్. గంగాధర్, హైదరాబాద్ జోన్‌కు చెందిన ఎం.డి. మొహీనుద్దీన్, అబ్దుల్ రహెమాన్, కె. జనార్దన్‌లకు నగదు ప్రోత్సాహకాలను అందచేసి ఘనంగా సత్కరించారు. పలువురు రీజియన్ మేనేజర్లు, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలం

- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



మఠంపల్లి, ప్రభ న్యూస్ : టీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్ధాపురం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో నలుగురికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, మిగిలిన మూడు కోట్ల మందికి కరువు మిగిలిందని ఎద్దేవా చేశారు. తన హయాంలో జరిగిన అభివృద్ధే మండలంలో జరిగింది తప్ప టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్య మన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ కేతనం ఎగురవేస్తుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏకపక్షంలో రూ. 2 లక్షల రుణమాఫీ, వరి, పత్తి, మిర్చి పంటలకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా 2019 లో కాంగ్రెస్ పార్టీ 70 సీట్లు గెలిచి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అంతకముందు మఠంపల్లి మండలంలో నూతన లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కాల్వపల్లి తండాకు చెందిన కుటుంబాన్ని పరామర్శించారు.

'లీడర్‌షిప్ డెవలప్‌మెంట్' శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. పార్టీ హైకమాండ్ సూచన మేరకు నాయకత్వ సమస్య ఉన్న అసెంబ్లీ నియోజక వర్గాల్లో 'లీడర్‌షిప్ డెవలప్‌మెంట్' శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మొదటి విడతగా రాష్ట్రంలో ఉన్న 31 ఎస్సీ, ఎస్టీ అసెంబ్లీ రిజర్వుడు నియోజక వర్గాల్లో లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ శిక్షణా కార్యక్రమాల వల్ల నాయకులు, పార్టీ కేడర్‌లోనూ ఉత్సాహం కనిపించిందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కొనసాగింపుగా జనరల్ స్థానాల్లోనూ రెండో విడత 30 అసెంబ్లీ నియోజక వర్గాల్లో 'లీడర్‌షిప్ డెవలప్ మెంట్' శిక్షణా కార్యక్రమాలు చేపట్టి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలనే ఆలోచనకు టీ పీసీసీ సిద్ధమైంది. కా గా ఈ శిక్షణా కార్యక్రమాల్లో ప్రజల్లోకి ఎలా వెళ్లాలి, ప్రభుత్వ వ్యతిరేకతను అందిపుచ్చుకునే విధానం అంశాలపై పార్టీ సీనియర్లు పలు సూచనలు చేస్తారు. రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. కాగా ఒక్కో విడతకు 30 అసెంబ్లీలను ఎంచుకొని మూడు విడతలుగా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మేడారం జాతరకు ప్రముఖులు

- 2న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు, గవర్నర్లు
- కేంద్ర గిరిజన మంత్రి, పలువురు మంత్రుల రాక



భూపాలపల్లి, ప్రభన్యూస్ ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమక్క- సారలమ్మ మహా జాతరలో పాల్గొని తల్లులను దర్శించడానికి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు కేంద్ర మంత్రులు, తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు ఫడ్నవిస్, గవర్నర్‌లు నరసింహన్, విద్యాసాగర్ తోపాటు పలువురు మంత్రులు రానున్నారు. ఫిబ్రవరి 2న ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ నరసింహన్ రానున్నారని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రకటించిన విషయం విధితమే. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫిబ్రవరి 1న లేదా 3వ తేదీన వచ్చే అవకాశాలున్నాయి. వీరందరికి రాష్ట్ర ప్రభుత్వం, మేడారం ట్రస్టు బోర్డు తరఫున ఆహ్వానాలందాయి. కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రి జుయల్ ఓరం జాతరను సందర్శించే సమయంలో మేడారానికి జాతీయ హోదాను కూడా ప్రకటించే అవకాశం ఉంది. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన గిరిజన మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు జాతరకు రానున్నారు.

మేడారం జాతర విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ప్రత్యేక అధికారులను కోమురంభీం ఆసీఫాబాద్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆఫ్ ల్యాండ్ అప్‌డేషన్ మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణను నియమించారు. ప్రశాంత్ జీవన్ పాటిల్ మంగళవారం బాధ్యతలు చేపట్టగా బుధవారం వాకాటి కరుణ జాతర ఏర్పాట్ల బాధ్యతను స్వీకరించారు. మేడారంలో బుధవారం ఇద్దరు ప్రత్యేక అధికారులు స్థానిక జిల్లా అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరకు ముందు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మురళీ బదలీ కావడం, మంచిర్యాల కలెక్టర్‌కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంచార్జీగా బాధ్యతలు అప్పగించారు. దాంతో జాతర నిర్వహణ ఇబ్బందికరంగా మారకుండా ఉండటానికి మేడారం జాతరలో అనుభవం ఉన్న వాకాటి కరుణను, ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు బాధ్యతలు అప్పగించారు. బుధవారం మేడారం వచ్చిన వాకాటి కరుణకు జాయింట్ కలెక్టర్ అమయ్ కుమార్, ఐటీడీఏ పీఓ చక్రధర్ పుష్పగుచ్ఛాలందజేశారు. అంతకు ముందు మేడారం జాతర ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ జాతరలో పలు విభాగాలను జేసీ అమయ్‌కుమార్, సబ్ కలెక్టర్ తో కలిసి సందర్శించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో గిరిజనుల ఆరాధ్యదైవాలైన శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలు కొలువైన మేడారంలో మండెమెలిగే పండుగను పూజారులు (ఒడ్డెరుల) అత్యంత వైభవంగా కన్నులపండుగగా నిర్వహించారు. బుధవారం మేడారంలోని సమ్మక్క ఆలయం, కన్నెపెల్లి లోని సారలమ్మ ఆలయంలో మండె మెలిగే పండుగను పూజారులు ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు తమ ఇల్లను శుద్ధి చేసుకుని ముస్తాబు చేశారు. ఆ త్వర్వాత అడవికి వెళ్లి గడ్డిన సేకరించి తీసుకువచ్చారు. గడ్డిని గుడిపై వేశారు. అక్కడి నుంచి మేడారం ప్రారంభ ముఖ ద్వారం వద్ద ఆలయ ప్రవేశ మార్గం ముందు ద్వార స్థంబాలను (దిష్టితగులకుండా) ఏర్పాటు చేసి లేపారు. ద్వారానికి ఆనిక్కాయ, మామిడి తోరణం, కోడిపిల్లలను కట్టారు. అనంతరం బెల్లం, కల్లు శాఖలతో ఆరగింపు చేశారు. అక్కడి నుంచి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. పూజారి ఇంట్లో నుంచి పూజా సామాగ్రిని సమ్మక్క గుడికి తీసుకువచ్చారు. అనంతరం అక్కడ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గద్దెల పైకి దేవతామూర్తులను తీసుకువచ్చారు. మహిళలు రోజంతా ఉపవాసం ఉన్నారు.

ఉత్తర భారతాన పద్మావత్ సెగలు

● సినిమా విడుదలకు వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో అల్లర్లు ● జాతీయ రహదార్లు దిగ్బంధనం - వాహనాలు ధ్వంసం, దగ్ధం ● ఆందోళన కారుల అరెస్టు - భారీగా బలగాల మోహరింపు

● అట్టుడుకుతున్న రాజస్థాన్, హర్యానా మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ ● థియేటర్ల నిర్వాహకులకు కర్ణిసేన హెచ్చరికలు ● మహిళల ఆత్మాహుతి హెచ్చరికలతో చిత్తోర్‌గఢ్ కోట మూసివేత

న్యూఢిల్లీ/జైపూర్: పద్మావత్ చిత్రం విడుదలకు వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్రమయ్యాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు అల్లర్లతో అట్టుడుకుతున్నాయి. కర్ణిసేన, హిందుయువ వాణి వంటి సంస్థలు రోడ్డెక్కాయి. జాతీయ రహదారులను దిగ్బంధనం చేశాయి. పలుచోట్ల కర్ణిసేన కార్యకర్తలు బస్సులు, ద్విచక్ర వాహనాలను దగ్ధం చేశారు. మల్టీప్లెక్స్‌ల ఎదుట నిరసలకు దిగారు. సినిమా ప్రదర్శనను నిలిపివేయాలని హెచ్చరించారు. లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిం చారు. ఈ క్రమంలో రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో పంపిణీ దారులు వెనక్కి తగ్గారు. ఉద్రిక్తల మధ్య సినిమా రిలీజ్ చేయబోమని స్పష్టంచేశారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన చిత్తోర్‌గఢ్ కోట ఆందోళన కారణంగా రెండోసారి మూతప డింది. రాజ్‌పుత్ మహిళలు ఆత్మబలిదానాలకు సిద్ధమని ప్రకటించడం, కర్ణిసేన కార్యకర్తలు కోటలోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నం చేయడం వంటి పరిణామాలతో ముందస్తు జాగ్రత్త చర్యగా ఒకరోజు కోటను మూసిసేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పద్మావత్ ప్రదర్శనతో తమకు అవమానం జరిగితే, ఇదేకోటలో అగ్నిప్రవేశం చేసేందుకు 1900 మంది మహిళలు పేర్లను నమోదు చేసుకోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది. కాగా, అల్లర్ల నియంత్రణకు ఆయా రాష్ట్రాలకు సాయం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని హోంశాఖ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

● ఆందోళనకారులు గుర్గావ్‌లోని వజీర్‌పూర్-పటౌడి రోడ్డు మార్గాన్ని స్తంభింపజేశారు. సోహ్నా ప్రాంతంలో బస్సుకు నిప్పంటించారు. ఆందోళన కారులను కట్టడి చేసేందుకు ఇక్కడ పెద్దఎత్తున బలగాలు మోహరించాయి. ఢిల్లీ- అజ్మీర్ జాతీయ రహదారిపై కర్ణిసేన ఆందోళనకారులు ధర్నాకు దిగారు. టైర్లు దగ్ధంచేశారు. శిఖర్ ప్రాంతంలో బస్సుపై రాళ్లు రువ్వారు. పబ్‌లు, బార్లు తెరిచే వుంటాయని గుర్‌గావ్ డీపీసీ వినయ్ ప్రతాప్ తెలిపారు. ఎన్‌సీఆర్ ఏరియాలో 144 సెక్షన్ విధించామని చెప్పారు. ఇక్కడ దాదాపు 40 మల్టీప్లెక్స్ థియేటర్లు ఉన్నాయి.

● ఉత్తరప్రదేశ్‌లో హిందు యువవాణి కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. సినిమా విడుదలను నిలిపివేయాలని కోరుతూ బిజ్నోర్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారణాసిలో హిందూ సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి రోషన్ పాండే రక్తాక్షరాలతో లేఖ రాసి సిటీ మెజిస్ట్రేట్‌కు అందజేశారు. మల్టీప్లెక్స్‌ల ఎదుట దిష్టిబొమ్మలను దగ్ధంచేసిన కర్ణిసేన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్టిప్లెక్స్ నిర్వాహకులు తమ విజ్ఞప్తిని పెడచెవిన పెడితే, ఎంతకైనా తెగిస్తామని బహిరంగంగా హెచ్చరించారు. ముజఫర్ నగర్, కాన్పూర్‌లలో ఆందోళనకారులు సినిమా పోస్టర్లను చించివేశారు. సినిమా థియేటర్లలోకి ప్రవేశించి, సిబ్బంది దాడిచేశారు అని పోలీసులు వెల్లడించారు.

● హర్యానా, రాజస్థాన్‌లో భయాందోళలను సృష్టచడంలో కర్ణిసేన విజయవంతమైంది. 80శాతం థియేటర్లు సినిమా ప్రదర్శనకు విముఖత వ్యక్తం చేశాయి. పంపిణీదారులు సైతం వెనకడుగు వేశారు. ఈ క్రమంలో కనీసం పద్మావత్ పోస్టర్ ఎక్కడా కనిపించక పోవడం విశేషం. రాజస్థాన్‌లో చిత్తోర్‌గఢ్ కోటలోకి ప్రవేశించేందుకు కొందరు మహిళలు ప్రయత్నించగా, వారిని అడ్డుకున్నామని డిప్యూటీ ఎస్పీ గజేంద్ర సింగ్ చెప్పారు. అప్రమత్తంగా ఉండాలని అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీచేసినట్లు ఏడీజీ ఎన్ఆర్‌కే రెడ్డి తెలిపారు.

● మధ్యప్రదేశ్‌లోని హోషంగాబాద్ జిల్లాలో కర్ణిసేన కార్యకర్తలను హైవేలను దిగ్బంధనం చేశారు. సినిమా చూడాలని అనుకునేవాళ్లు ముందుగా బీమా చేయించుకోవాలంటూ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. సుమారు 200 మంది జాతీయ రహదారి-3ని దిగ్బంధించారు. అగ్రా-ముంబై వెళ్లే వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. ఇండోర్ జిల్లాలోని కిషన్‌గఢ్ ప్రాంతంలో గాజు సీసాలను రోడ్డుపై పగులగొట్టారు.

● ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ముంబైలో కర్ణిసేన కార్యకర్తలు 35మందిని పోలీసులు అరెస్టు చేశారు. అహ్మదాబాద్‌లో థియేటర్ల వద్ద అల్లర్లకు పాల్పడిన వారిలో 50 మందిని నిర్బంధించారు. మంగళవారం రాత్రి నుంచి మల్టీప్లెక్స్ వద్ద విధ్వంస కార్యక్రమాలు మొదలయ్యాయి. 150 వాహనాలను దగ్ధం చేశారు. పదుల సంఖ్యలో దుణాకాలు ధ్వంసం అయ్యాయి. ఇస్కాన్ సమీపంలోని ఎస్‌జీ జాతీయ రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ సందర్భంగా ఈ విధ్వంసం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

● నాసిక్‌లో 20 మంది కార్యకర్తలను నిర్బంధంలోకి తీసుకున్నారు. రాజ్‌పుత్ సంస్థ నాయకుడొకరు జల్‌సమాధి బెదిరింపు వ్యాఖ్యలు చేయడంతో ఈమేరకు చర్యలు తీసుకున్నారు. సినిమా విడుదలైతే, కార్యకర్తలతో కలిసి తాను గంగాపూర్ డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంటానని ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు.



చిత్తోర్‌గఢ్ కోట మూసివేత

● శతాబ్దాల చరిత్రలో ఇది రెండోసారి ● ఆత్మాహుతికి సిద్ధమైన 1900 మంది మహిళలు

పద్మావత్ సినిమాకు వ్యతిరేకంగా కర్ణిసేన ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రమయ్యాయి. సినిమా విడుదలను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న నాలుగు రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్ అల్లర్లతో అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో చారిత్రక చిత్తోర్‌గఢ్ కోటను మూసి వేశారు. శతాబ్దాల కోట చరిత్రలో ఇలా జరగడం ఇది రెండవసారి. ఈ సినిమా విడుదల అయితే గనుక కోటలో ప్రాచీన సంప్రదాయం పునరావృతం అవుతుందని రాజ్‌పుత్ మహిళలు హెచ్చరించారు. మంగళవారం రాత్రి కోటవద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. జౌహర్ (ఆత్మబలిదానం)కు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. నాడు అవమానభారంతో మంటల్లో దూకి ఇదే కోటలో పద్మావతి ఆత్మబలిదానం చేసుకుంది. ఆమెతోపాటు 16వేల మంది మహిళలు అగ్నిప్రవేశం చేశారు. ఇప్పుడు ఈ సినిమా ద్వారా రాజ్‌పుత్‌లను అవమానిస్తే తామంతా పద్మావతి తరహాలోనే అగ్నికి ఆహుతి అవుతామని హెచ్చరించారు. సుమారు 1900 మంది మహిళలు బలిదానానికి పేర్లను నమోదు చేసుకున్నారని కర్ణిసేన అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. పద్మావతి చరిత్రను వక్రీకరించడం ద్వారా రాజ్‌పుత్‌లను తక్కువ చేసి చూపే ప్రయత్నాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ కొనసాగనివ్వమని స్పష్టంచేశారు. కాగా, కోట వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అదనపు బలగాలను మోహరింపజేశారు. ప్రస్తుతం ఇక్కడ శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని డిప్యూటీ ఎస్పీ గజేంద్రసింగ్ వెల్లడించారు.

థియేటర్లలో కర్ఫ్యూ పాటించండి పౌరులకు కర్ణిసేన చీఫ్ కల్వి పిలుపు

దేశవ్యాప్తంగా పద్మావత్ సినిమాపై నిషేధం విధించాల్సిందేనని కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కల్వి డిమాండ్ చేశారు. బుధవారం జైపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా సేన కార్యకర్తలు విధ్వంసాలకు దిగిన నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం సినిమా విడుదలను అడ్డుకోండి. ఇందుకు ప్రజాకర్ఫ్యూను పాటించండి అని ప్రజలకు పిలుపునిచ్చారు. హింసకు మద్దతివ్వడం లేదు. ఈ ఉద్రిక్తతలకు ఏ ఒక్కరూ కారణం కాదు. సంజయ్ లీలా బన్సాలీదే బాధ్యత. అబద్దాలతో చరిత్రను వక్రీకరించడాన్ని అంగీకరించేది లేదు. బన్సాలీ ఆహ్వానిస్తే ప్రివ్యూకు వెళ్తానన్న ప్రకటనలో వాస్తవం లేదు. రాజ్‌పుత్ సామాజికవర్గం సెంటిమెంట్‌ను అర్థం చేసుకోవడంలో సర్వోన్నత ధర్మాసనం కూడా విఫలమైంది. రిలీజ్‌కు ముందు కొందరు సేన కార్యకర్తలు సినిమాను చూశారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఓ వర్గం మీడియా ఈ మేరకు తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ సినిమా పట్ల మా అభిప్రాయానికి కట్టుబడి ఉన్నామని కల్వి స్పష్టం చేశారు. తూటాలు, అరెస్టులకు వెనకడుగు వేయబోమన్నారు. రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆందోళనలు కొనసాగుతాయని చెప్పారు. ఇప్పటికే థియేటర్ల యాజమాన్యాలు, పంపిణీ దారుల నుంచి తమకు మద్దతు లభిస్తోందని చెప్పారు. మరొకవైపు మహారాష్ట్రలో మా ఆందోళనలకు శివసేన పార్టీ మద్దతు పలికిందని తెలిపారు.

ప్రదర్శనకు మల్టీప్లెక్స్‌లు నో



నిరసన జ్వాలలు ఎగసిపడుతున్న తరుణంలో పద్మావత్ ప్రదర్శనపై మల్టీప్లెక్స్‌లు యూటర్న్ తీసుకున్నాయి. ఇంతటి ఉద్రిక్తతల మధ్య సినిమా ప్రదర్శించలేమని తేల్చిచెప్పాయి. మంగళవారం రాత్రి నుంచి కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో జాతీయ మల్టీప్లెక్స్ అసోషియేషన్ సమావేశం అయింది. తాజా పరిస్థితులు, పద్మావత్ ప్రదర్శనపై చర్చించాయి. ఆయా రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు సినిమా విడుదలకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. శాంతిభద్ర తల దృష్ట్యా, ప్రభుత్వాల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు దీపక్ అషెర్ ప్రకటించారు. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో ప్రదర్శన ఉండబోదని చెప్పారు. వివాదం సద్దు మణిగే వరకు ఒక్క స్క్రీన్ మీద కూడా పద్మావత్ నడిపించ బోమని మల్టీప్లెక్స్ యాజమాన్యాలు తేల్చేశాయి. దేశంలోని 75శాతం మల్టీప్లెక్స్‌లు ఈ అసోసియేషన్ పరిధిలోనే ఉన్నాయి.

భారీగా బలగాల మోహరింపు

సుప్రీం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. పద్మావత్ విడుదలపై నిషేధం కుదరదన్న, సర్వోన్నత న్యాయస్థానం శాంతిభద్రతల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకోవాలని స్పష్టంచేసింది. మీకు అభ్యంతరం ఉంటే, సినిమాను నిషేధించాలని కోరడం కాదు.. ప్రజలను థియేటర్లకు వెళ్లొద్దని చెప్పండి. మనోభావాలు దెబ్బతింటాయని భావిస్తే సినిమాకు దూరంగా ఉండమనండి అని రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, హర్యానా ప్రభుత్వాలకు ధర్మాసనం సూచించింది. ఆందోళనలను అదుపు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని చెప్పింది. దీంతో నిరసన జ్వాలలను కట్టడి చేసేందుకు ఆయా ప్రభుత్వ యంత్రాంగాలు చర్యలు చేపట్టాయి. జిల్లాల వారీగా పరిస్థితు లను సమీక్షిస్తూ, ఎస్పీలకు ప్రత్యేక ఆదేశాలు జారీచేస్తున్నాయి. అవసరమైన చోట అదనపు బలగాలను మోహరింపజేస్తు న్నాయి. జాతీయ రహదారులపై ఆందోళన కారులను అరెస్టు చేస్తున్నాయి. శాంతి భద్రతలకు సహకరించాల్సిందిగా మల్టీ ప్లెక్స్‌లకు విజ్ఞప్తి చేశాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లకుండా చర్యలు ప్రారంభించాయి. అటు కేంద్ర ప్రభుత్వం కూడా పద్మావత్ పరిణామాలపై దృష్టిసారించింది.

పద్మావత్ విడుదల సంతోషమే: మమత

బన్సాల్ వివాదాస్పద చిత్రంపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికుతున్న తరుణంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. తమ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని, అల్లర్లు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టిందని అన్నారు. ఒకవేళ బెంగాల్‌లో ఈ సినిమా విడుదలైతే, సంతోషకరమేనని వ్యాఖ్యానించారు. కోల్‌కతా పోలీసులు ఇప్పటికే పకడ్బంది చర్యలు చేపట్టారు.

మల్టీప్లెక్స్‌ల వద్ద పహరా పెంచారు. థియేటర్ వెలుపుల కానీ, లోపలకానీ అవాంఛనీయ పరిణామాలు ఎదురవకుండా నిఘా ఉంచారు. సుప్రీం తీర్పును గౌరవించి తీరాలి. ధర్మాసనం ఆదేశాలకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలి. మా రాష్ట్రంలో ఆ సినిమా విడుదల కావడాన్ని స్వాగతిస్తున్నాను. బీజేపీ, భజరంగ్‌భళ్ శ్రేణులు ఆందోళనలు సృష్టించే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని మమత చెప్పారు. కాగా, ఇలాంటి ప్రతికూల పరిస్థితులతో పెట్టుబడులు దూరమయ్యే ప్రమాదం ఉందని, పారిశ్రామిక రంగం దెబ్బతింటుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అభిప్రాయపడ్డారు.

ఎల్.బి శాస్త్రి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకి కాదు: అద్వానీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దేశ రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆర్ఎస్ఎస్ సైద్ధాంతికంగా ఎన్నడూ వ్యతిరేకించలేదని బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్.కే అద్వానీ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ వార పత్రిక ఆర్గనైజర్ 70 వ వార్షికోత్సవ సంచికలొ రాసిన ప్రత్యేక వ్యాసంలో అద్వానీ ఎల్‌బి శాస్త్రికి సంబంధించిన విషయాలను తెలియజేశారు. శాస్త్రిని అంకితమైన కాంగ్రెస్ మెన్ గా అభివర్ణించిన అద్వానీ..నెహ్రూ లాగా శాస్త్రి ప్రవర్తించలేదన్నారు శాస్త్రి వ్యక్తిగత ఔతన్యమే ఆయన్ని దేశం గర్వించదగిన నాయకుడిని చేసిందన్నారు. శాస్త్రి ఎన్నడూ సిద్ధాంతపరమైన వైరుద్యాలకు పోలేదని.. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు నాటి ఆర్ఎస్ఎస్ చీఫ్ గురు గోళ్వంకర్ ను తరుచూ సంప్రదించి దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చించేవారని తెలిపారు. 1960 లో తాను ఆర్గనైజర్‌లో అసిస్టెంట్ ఎడిటర్ గా చేరానని.. ఆ పత్రిక ప్రతినిధి హోదాలోతాను చాలాసార్లు శాస్త్రిని కలిశానని అద్వానీ వెల్లడించారు.

త్రిపుర ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

అగర్తలా: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకోసం ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పోలింగ్ తేదీని ఫిబ్రవరి 18గా నిర్ణయించగా, ఓట్ల లెక్కింపు మార్చి 3న చేపడతారని కమిషన్ ప్రకటించింది. మొత్తం ఎన్నికల ప్రక్రియ మార్చి 5లోగా ముగుస్తుందని తెలిపింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవిఎం), వోటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వివిపిఎటీ) ఉపయోగించనున్నారు. 60 సభ్యులను కలిగివున్న త్రిపుర అసెంబ్లీ కాలపరిమితి మార్చి 14న ముగియనున్నది. ఎస్సీలకు 10 నియోజకవర్గాలు, ఎస్టీలకు 20 నియోజకవర్గాలను రిజర్వు చేశారు. మొత్తం 25,69,216మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి 3,214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో(2013) పోలిస్తే.. ఈసారి పోలింగ్ కేంద్రాలు 5.6శాతం పెరిగాయి. పోలింగ్‌కు ఏడురోజుల ముందు ఓటర్ల ఫొటోలతో కూడిన వోటర్ స్లిప్పులను పంపిణీ చేయాలని కమిషన్ సూచించింది. కాగా రాష్ట్రంలో వంద శాతం వోటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు(ఈపీఐసీ) జారీ అయ్యాయని కమిషన్ వెల్లడించింది. రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయంపై 19 మంది ఎన్నికల వ్యయ పరిశీలకులు నిఘా పెట్ట నున్నారు. మరోవైపు 300 కంపెనీల భద్రతా బలగాలను ఎన్నికల బందోబస్తుకు వినియోగించనున్నది. ఇప్పటికే 7500 మంది కేంద్ర బలగాలను రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోహరించిందని అదనపు చీఫ్ ఎలక్టోరలల్ ఆఫీసర్ తపస్ రాయ్ తెలిపారు. డబ్బు, మద్యం పంపిణీ వంటి తదితర చట్టవ్యతిరేక చర్యల నియంత్రణకు ప్రతీ నియోజకవర్గంలో ఒక మెజిస్ట్రేట్, ఒక పోలీస్ అధికారి, ఒక ఇన్‌కం టాక్స్, ఎక్సైజ్, డ్యూటీ అధికారులతో కూడిన సురక్ష బృందాలు పనిచేయనున్నాయి.

మోడీ ప్రసంగం భేష్

● దావోస్ వేదికగా చైనా ప్రశంస

వాషింగ్టన్ : దావోస్ వేదికగా భారత్ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం బాగుందని చైనా చెప్పుకొచ్చింది. ఉగ్రవాదం ప్రపంచానికి ఎంత ప్రమాదమో మోడీ వివరించడం ఎంతో బాగుందని వివరించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు పాల్గొన్న మొదటి ప్రధానిగా మోడీ పేరు సంపాదించుకున్నారు. అగ్రదేశాల రక్షణాత్మక విధానాలకు వ్యతిరేకంగా మోడీ తన అభిప్రాయం చెపడాన్ని చైనా ప్రశంసించింది. ప్రపంచీ కరణ ప్రోత్సహించడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచీలా వ్యవహరించడంలో ఇరు దేశాల ఆలోచన ఒకటే అని చైనా చెప్పింది. తాము కూడా భారత్‌లాగే ఆలోచిస్తున్నామని మోడీ ప్రసంగాన్ని స్వాగతించింది. ఈ విషయమై భారత్ అడుగు జాడల్లోనే తాము కూడా నడవాలని కోరుకుంటున్నామని చైనా విదేశాంగ ప్రతినిధి హుచునింగ్ పేర్కొన్నారు. భారత్‌తో కలిసి పని చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని ఆమె చెప్పారు. గతేడాది దావోస్ ప్రసంగంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రక్షణాత్మక విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

మోడీజీ.. బ్లాక్‌మనీ మోసుకొచ్చారా?

ప్రధానికి రాహుల్ వ్యంగ్య ట్వీట్

న్యూఢిల్లీ: విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తామంటూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆయనకు బుధవారం గుర్తు చేశారు. స్విట్జర్లాండ్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరై తిరిగి వస్తున్నప్పుడు అందులో కొంత భాగాన్ని విమానంలో తీసుకువచ్చారా అని మోడీని ట్వీట్ ద్వారా ఎద్దేవా చేశారు.

రాహుల్ గాంధీ ఆ ట్వీట్‌లో... ప్రియమైన ప్రధాని, స్విట్జర్లాండ్ తిరిగివచ్చిన మీకు స్వాగతం. నల్లధనంపై మీరు చేసిన వాగ్దానాన్ని గుర్తు చేస్తున్నాను. మీతో పాటుగా విమానంలో కొంత నల్లధనాన్ని తీసుకువచ్చారా అని భారతీయ యువత విస్తుపోతున్నది అని ఎద్దేవా చేశారు.

దావోస్ సదస్సులో ప్రసంగించిన ప్రధానమంత్రికి కాంగ్రెస్ అధ్యక్షుడు మంగళవారం కూడా వ్యంగ్య ట్వీట్ చేశారు. భారత్‌లో కేవలం ఒక్క శాతం ధనికులు దేశపు 76 శాతం సంపదను ఎలా దక్కించుకున్నదీ దావోస్‌లో వెల్లడించాలని మోడీని రాహుల్ కోరారు.

సయీద్‌పై చర్యలొద్దు

● పాక్‌కు లాహోర్ హైకోర్టు ఆదేశం

లాహోర్ : ముంబై దాడుల సూత్రధారి, జమాత్ ఉల్ దవా నేత హఫీజ్ సయీద్‌పై చర్యలు తీసుకోవద్దని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని లాహోర్ హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు నుండి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి చర్యలు, కేసులు నమోదు చేయవద్దని తేల్చి చెప్పింది. తనను అరెస్టు చేయకుండా ఆపాలని కోరుతూ సయీద్ మంగళవారం కోర్టును ఆశ్రయించాడు. ఐరాస భద్రత కౌన్సిల్ 1267 నిబంధనల కమిటీ ఇస్లామాబాద్ సందర్శించనున్న నేపథ్యంలో తనను అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో సయీద్ కోర్టును ఆశ్రయించాడు. అమెరికా, భారత్ డిమాండ్ మేరకు పాక్ సయీద్‌ను అరెస్టు చేసే అవకాశం ఉండటంతో అతను కోర్టుకు విన్నవించాడు. ముంబై దాడులతో తనకు సంబంధం ఉందని నిరూపించాలని కొన్నేళ్లుగా ఆ దేశాలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నాడు. ఈ వ్యవహారంపై మార్చి 17లోగా సమాధానం ఇవ్వాలని లాహోర్ హైకోర్టు పాకిస్థాన్‌ను ఆదేశించింది.

అంతర్జాతీయ ఉగ్రవాదిగా భారత సంతతి వ్యక్తి

వాషింగ్టన్ : భారత సంతతికి చెందిన సిద్దార్థ్ ధర్‌ను అమెరికా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. బ్రిటన్‌కు చెందిన సిద్దార్థ్ ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై ఎన్నో మారణహోమాలకు కారణమయ్యాడని వివరించింది. హిందువుగా ఉన్న సిద్దార్థ్ కొన్నేళ్లకు ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. అబు రుమ్యాసాగా పేరు కూడా మార్చుకున్నాడు. పలు కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలైన సిద్దార్థ్ అలియాస్ అబు రుమ్యాసా తన భార్య, పిల్లలతో కలిసి 2014లో సిరియా వెళ్లి పోయాడు. అతికొద్ది సమయంలోనే అతి క్రూరమైన ఉగ్రవాదిగా పేరు సంపాదించుకున్నాడు. వీడియో కెమెరాలకు ఫోజులిస్తూ.. అమాయకుల పీకలు కోయడంలో దిట్ట. చాలా వీడియోలో ఇతను ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. జిహాద్ అంటూ ఎన్నో ప్రాణాలు తీసినట్టు నిఘా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అతన్ని జిహాదీజాన్‌గా పిలుస్తుంటారు. ఐసిస్ ఉగ్రవాద సంస్థలో కీలక వ్యక్తిగా వ్యవహరిస్తున్నట్టు అమెరికా రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రపంచ ఉగ్రవాదుల జాబితాలో ఇతని పేరు కూడా చేర్చినట్టు ప్రకటించారు. సిద్దార్థ ముందుగా బ్రిటన్‌లో హిందువుగా నివాసం ఏర్పర్చుకున్నాడు. ప్రస్తుతం బ్రిటన్ టెర్రరిస్టు ఆర్గనైజేషన్ అల్ ముహాజిరౌన్ అనే విభాగాన్ని నడిపిస్తున్న వారిలో కీలకంగా పని చేస్తున్నాడు. 2015లో డ్రోన్ దాడిలో మహ్మద్ ఎమ్వాజీ హతం కావడంతో ఆ స్థానంలోకి సీనియర్ కమాండర్‌గా ఉన్న సిద్దార్థ్ వచ్చాడు. మహ్మద్ ఎమ్వాజీని జిహాదీ జాన్‌గా పిలిచేవారు. 2016 నుండి ఎంతో మంది అమాయకులను బంధీలుగా చేసి గొంతులు కోసి వీడియోను సోషల్ నెట్‌వర్క్‌లలో పెట్టేది ఇతడే అని అమెరికా తేల్చింది.

లాలూప్రసాద్‌కు ఐదేళ్ల జైలు

● దాణా స్కామ్‌లో సీబీఐ కోర్టు తీర్పు ● మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా కూడా దోషే



రాంచీ: దాణా కుంభకోణంలోని మరోకేసులో ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రిలాలూ ప్రసాద్ యాదవ్, మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాకు కు సీబీఐ న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షతో రూ.5 లక్షల జరిమానా విధించింది.1990 కాలంలో చయిబసా కోశాగారం నుంచి 37 కోట్లు 62 లక్షల రూపాయలు అక్రమంగా విత్ డ్రా చేయారన్న సీబీఐ ఆరోపణలతో ఏకీభవించిన న్యాయస్థానం మొత్తం 56 మందిని దోషులుగా తేల్చింది. ఈ కేసులో బీహార్ మాజీ మంత్రి నిశాద్, మాజీ పీఏసీ ఛైర్మన్ జగదీశ్‌శర్మ, మాజీ ఎమ్మెల్యేలు ధ్రువ్ భగత్, ఆర్.కే రాణా, పలువురు మాజీ ఐఏఎస్ అధికారులను సీబీఐ న్యాయమూర్తి ఎస్ఎస్ ప్రసాద్ దోషులుగా పేర్కొన్నారు. ఈ కేసులో న్యాయస్థానం మొత్తం 76 మంది దోషులుగా తేల్చగా.. ఇప్పటికే 14 మంది మరణించారు. ముగ్గురు అప్రూవర్లుగా మారారు. ఒకరు పరారీలో ఉండగా.. మరో ఇద్దరు ఇప్పటికే దోషులుగా తేలారు. ఈ కేసులో నలుగురు అధికారులను మాత్రం న్యాయస్థానం నిర్దోషులుగా నిర్ధారించింది.దాణా కుంభకోణంలో మొత్తం ఐదు కేసులు నమోదుకాగా.. దేవ్ గఢ్ ట్రెజరీ నుంచి రూ.89.27 లక్షలు అక్రమంగా విత్ డ్రా చేసిన కేసులో ఈనెల6న లాలూకు కోర్టు మూడున్నరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. లాలూతో పాటు మరో ఏడుగురికి న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. మరో ఏడుగురికి కూడా మూడున్నరేళ్ల జైలుతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించింది. ఇక చైబాసా కోశాగార కేసులో లాలూ ఇప్పటికే దోషిగా తేలారు. 37కోట్ల 50 లక్షల మోసపూరితంగా విత్ డ్రా చేసినందుకు గాను 2013 అక్టోబర్ లో న్యాయస్థానం లాలూకు 25 లక్షల జరిమానాతో పాటు..ఐదేళ్లు జైలు శిక్ష విధించింది. ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండానిషేదం విధించింది. అయితే అదే ఏడాది డిసెంబర్ లో లాలూ కు సుప్రీంకోర్టుకు ఉపశమనం కలిగింది.ఈ కేసులో సుప్రీంకోర్టు లాలూకు బెయిల్ మంజూరు చేసింది. 2014 లో జార్ఖండ్ హైకోర్టు మిగతా 4 కేసుల్లో విచారణపై స్టే విధించింది. ఒక కేసులో దోషిగా తేలిన వ్యక్తికి మిగతా కేసులను కూడా ఆపాదించడం సరికాదని వ్యాఖ్యానిం చింది. ఒక కేసులోని సాక్షులను అన్ని కేసుల్లో సాక్షులుగా భావించలేమని తెలిపింది.

ఉన్నత న్యాయస్థానాలకు వెళ్తాం

లాలూ ప్రసాద్ యాదవ్ కు న్యాయస్థానం శిక్ష ఖరారు చేసిన తర్వాత ఆయన కుమారుడు బీహార్ మాజీ మంత్రి తేజస్వి యాదవ్ స్పందించారు. తమకు న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉందని..సీబీఐ కోర్టు తీర్పు ఫైనల్ కాదని న్యాయం కోసం అవసరమైతే హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్తామన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన తండ్రిని ఎన్ని రకాలుగా వేధించినా...ఆయన సామాన్యప్రజల్లో హీరో అవుతున్నారని తేజస్వీ చెప్పుకొచ్చారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికలను ఈ ఏడాది డిసెంబర్ వరకు వాయిదా వేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.

అనర్హతపై స్టేకు నిరాకరణ

● ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఈసీకి ఆదేశం ● తదుపరి విచారణ 29కి వాయిదా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు నిర్ణయాన్ని నిలుపుదల చేయాలన్న విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. అయితే 29 వరకు ఈ అసెంబ్లీ సీట్లకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. బుధవారం ఈసీ అనర్హత నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. తమ వాదన వినకుండా ఈసీ ఏకపక్షంగా పై అనర్హత వేటు వేసిందని, ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. తమ వాదనలు వినేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరారు. దీనిపై ఈసీ, కేంద్ర ప్రభుత్వం తమ స్పందన తెలియజేయాలని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి విభూ బక్రు ఆదేశించారు. ఈ కేసుపై విచారణ జరిగే వరకు అసెంబ్లీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయొద్దని ఈసీని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ అనర్హత కేసుకు సంబంధించిన వివరాలన్నీ తమకు అందజేయాలని కోరింది. వచ్చే సోమవారం నుంచి ఈ కేసును రోజువారీగా విచారిస్తామని వెల్లడించింది. 29కల్లా కేసుకు సంబంధించిన వివరాలు కోర్టుకు అందజేయాలని కోరింది. అప్పటి వరకు ఈ సీట్ల ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఆదేశించింది. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేల తరపున న్యాయవాది కెవి.విశ్వనాథన్ వాదనలు వినిపించారు. కేంద్ర విడుదల చేసిన అనర్హత నోటిఫికేషన్ పై స్టే ఇవ్వని పక్షంలో కనీసం ఈసీ ఉప ఎన్నిక నిర్వహించకుండా ఆపాలనికోరారు. ఈసీని ఈ విషయంలో నిలువరించకపోతే ఈ కసరత్తు అంతా వ్యర్థమవుతుందన్నారు. ఈ కేసులు తుది తీర్పు వెలువడే వరకుఅనర్హత వేటుపడ్డ ఎమ్మెల్యేలు యథావిధిగా తమ విధులు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. లాభదాయక పదవుల్లో కొనసాగారన్న అభియోగాలపై 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ ఈసీ సిఫారసు చేయగా, రాష్ట్రపతి దానిని ఆమోదించారు. అయితే ఇదంతా బీజేపీ కక్ష సాధింపుతో చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. అనేక రాష్ట్రాలలో ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా కొనసాగుతున్నా తమపైనా వేటువేయడమేమటని ప్రశ్నించారు.

సోషల్ మీడియాలో ఈసీ

● ఇక నుంచి ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో చురుకైన పాత్ర ● దివ్యాంగులకు చేయూత

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా ఓం ప్రకాశ్ రావత్ బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది.ఎన్నికల కమిషన్ ఇక మీదట సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. సోషల్ మీడియాలోని రెండు కీలక వేదికలైన ఫేస్ బుక్, యూట్యూబ్ లలో ఈసీ చురుకైన పాత్రను పోషిస్తుందని ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో ఈసీ ప్రకటించింది. ఎన్నికల కమిషన్ వ్యవహారాలపై నెటిజన్లకు అవగాహన కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ తెలిపింది. ప్రస్తుతం ఫేస్‌బుక్, యూట్యూబ్ లో ఈసీ పరిమిత పాత్రను పోషిస్తుండగా.. ఇకమీదట చురుకుగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు ఈసీ కమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ ధీరేంద్ర ఓజా తెలిపారు. ప్రజలకు అవసరమైన పూర్తి సమాచారాన్ని ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో పోస్టు చేస్తామన్నారు.

దివ్యాంగులకు అర్థవంతమైన బాగస్వామ్యం:సీఈసీ

ఎన్నికల ప్రక్రియలో దివ్యాంగులకు ఇక మీదట అర్థవంతమైన భాగస్వామ్యం కల్పిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్ స్పష్టం చేశారు. దివ్యాంగులకు ఎన్నికల ప్రక్రియలో సరైన భాగస్వామ్యం కల్పించేందుకు వారిని సెంటర్ స్టేజ్ కు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. నిజమైన సాధికారత కోసం టోకెన్ విధానాన్ని తొలగించాలని నిర్ణయించాం. దివ్యాంగులకు పరిపాలనకు సంబంధించిన అన్ని అంశాల్లో భాగస్వామ్యం కల్పించాలి. నేడు అందుబాటులో ఉన్నది రేపు ఉండకపోవచ్చు.. రాష్ట్రాల ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనే దివ్యాంగులకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచుతాం. కాబట్టి దివ్యాంగులు ప్రజాస్వామ్య వ్యవహారాలన్నింటిలో భాగస్వాములు కావాలి అని రావత్ తెలిపారు.

క్రీడాప్రభ


కెర్బర్


హలెప్

ఇద్దరే...!

• కోహ్లి అర్థసెంచరీ • గోడ కట్టిన పుజారా • ఓపెనర్ల వైఫల్యం • మళ్లీ పేలవ బ్యాటింగ్ • భారత్ 187 ఆలౌట్ • దక్షిణాఫ్రికా 6-1

పాత కథే...! అచ్చివచ్చిన వాండరర్స్‌కు వచ్చినా భారత కథ మారలేదు. పేస్‌కు అనుకూలించే పిచ్‌పై ఓపెనర్లు ఎప్పటిలాగే బ్యాట్లెత్తేశారు. బౌన్సీ పిచ్‌పై ముగ్గురు కాదు... ఏకంగా అరివీర భయంకరులైన ఐదుగురు పేసర్లతో దిగిన దక్షిణాఫ్రికా దాటికి టీమ్‌ఇండియా బ్యాటింగ్ టీ విరామం తర్వాత ఆలౌటైంది. ఆడింది.. ఇద్దరే. పుజారా (50) గోడలా నిలబడి అర్థసెంచరీ చేయగా... కెప్టెన్ విరాట్ కోహ్లి (54) మరోసారి క్లాస్ ఇన్నింగ్స్ ఆడాడు. 60 ఓవర్ల తరువాత వెంటవెంటనే 144 పరుగుల వద్ద పుజారా, పటేల్, పాండ్య వెనుదిరగడంతో భారత్ శిబిరంలో ఆందోళన నెలకొంది. చివర్లో భువనేశ్వర్ (30) చివరి వరుస బ్యాట్స్‌మెన్‌తో కలిసి జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించాడు. టీమ్‌ఇండియా బ్యాటింగ్‌లో మూడు డక్‌లు... మూడు మాత్రమే రెండంకెల స్కోర్లు. ఇదీ దక్షిణాఫ్రికాతో చివరి టెస్టులో తొలి రోజు మొదటి ఇన్నింగ్స్‌లో స్థూలంగా భారత్ బ్యాటింగ్ కథ!.

జొహన్నెస్‌బర్గ్: చటేశ్వర్ పుజారా (50, 179 బంతుల్లో, 8 ఫోర్లు), విరాట్ కోహ్లి (54, 106 బంతుల్లో, 9 ఫోర్లు) అర్థసెంచరీలతో ఆదుకోవడంతో మూడో టెస్టులో బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 187 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా వికెట్ నష్టపోయి 6 పరుగులు చేసింది. భువనేశ్వర్ (1-3) మర్‌క్రమ్ వికెట్ పడగొట్టాడు. పిచ్ పరిస్థితి చూస్తే దక్షిణాఫ్రికాకు కూడా బ్యాటింగ్ ఏమంత సులువు అనిపించడం లేదు. వికెట్ పేసర్లకు అనుకూలిస్తుండడంతో రెండో రోజు భారత పేసర్లు విజృంభించే అవకాశాల్ని కొట్టిపడేయలేం. భారత్ జట్టులో రెండు మార్పులు జరిగాయి. రోహిత్ స్థానంలో రహానే... అశ్విన్‌కు బదులు భువనేశ్వర్ జట్టులోకి వచ్చారు.


కోహ్లి 54

గోడ కట్టిన పుజారా: టాస్ గెలిచి కోహ్లి అనూహ్యంగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. మరోసారి ఓపెనర్లు జోడీ విఫలమైంది. రాహుల్ 7 పరుగుల వద్ద... విజయ్ 13 పరుగుల వద్ద వెనుదిరిగారు. క్రీజులోకి అడుగుపెట్టిన పుజారా క్రీజులో పాతుకు పోవడానికే ప్రాధాన్యం ఇచ్చాడు. తొలి పరుగు సాధించ డానికి అతను 54 బంతులు ఆడాడు. పుజారా అసలుసిసలు టెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు. దక్షిణా ఫ్రికా బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టాడు. మరో వైపు కోహ్లి దూకుడుగానే ఆడాడు. పుజారా.. నిప్పులు చెరిగే దక్షిణాఫ్రికా పేసర్ల బౌన్సర్లకు వెరవకుండా నిలబడ్డాడు. ఇద్దరు విరుద్ధ మైన శైలిలో బ్యాటింగ్ సాగిం చారు. పుజారా, విరాట్ మూడో వికెట్ 84 పరుగు లు జోడించారు. వీరిద్దరు క్రీజులో ఉన్నంత సేపు భారత శిబిరంలో ఆశలు ఏర్పడ్డాయి. లంచ్ విరామానికి వీరిద్దరు మరో వికెట్ ఇవ్వలేదు. టీ విరామానికి ముందు కోహ్లి ఔటయ్యాడు. అప్పటికి పుజారా 145 బంతుల్లో 27 పరుగులతో ఆడుతున్నాడు. విరాట్ వెనుదిరిగాక రహనే (9) క్రీజులోకి వచ్చి 27 బంతలాడినా వెంటనే ఔటయ్యాడు. అప్పటికి భారత్ స్కోరు సెంచరీ దాటినా కోలుకున్నట్టే కోలుకొని తిరిగి సంక్షోభంలో పడింది. ఆ దశలో పుజారా ఐదో వికెట్‌గా వెనుదిరగడంతో భారత్ మరింత కష్టాల్లో కూరుకుపోయింది. అప్పటికి స్కోరు 5-144. అదే స్కోరు వద్ద పటేల్ (2), పాండ్య (0) క రాడా వెనుదిరిగి భారత్ మరింత సంక్షోభానికి కారకులయ్యారు. ఆ దశలో భువీ.. షమితో కలిసి 8వ వికెట్‌కు 19 పరుగులు జోడించాడు. కానీ మళ్లీ భారత్ వరుసగా రెండు వికెట్లు కోల్పోయింది. పదో వికెట్‌కు భువీ.. బుమ్రాతో కలిసి 21 పరుగులు జోడించి వెనుదిరిగాడు.

స్కోరు బోర్డు: భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డి కాక్ (బి) రబాడ 8, రాహుల్ (సి) డి కాక్ (బి) ఫిలాండర్ 0, పుజారా (సి) డి కాక్ (బి) ఫెహ్లుక్‌వయో 50, కోహ్లి (సి) డి విలియర్స్ (బి) ఎన్‌గిడి 54, రహానే (ఎల్బీ) (బి) మోర్కెల్ 9, పటేల్ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 2, పాండ్య (సి) డి కాక్ (బి) ఫెహ్లుక్‌వయో 0, కుమార్ (సి) ఫెహ్లుక్‌వయో (బి) రబాడ 30, షమి (సి) రబాడ (బి) ఫిలాండర్ 8, ఇషాంత్ (సి) డు ప్లెసిస్ 0, బుమ్రా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 26, **మొత్తం:** (77 ఓవర్లలో ఆలౌట్) **187**

వికెట్ల పతనం: 1-7, 2-13, 3-97, 4-113, 5-144, 6-144, 7-144, 8-163, 9-166, 10-187

బౌలింగ్: మోర్కెల్ 17-5-47-2, ఫిలాండర్ 19-10-31-2, రబాడ 19-7-39-3, ఎన్‌గిడి 15-7-27-1, ఫెహ్లుక్‌వయో 7-1-25-2

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ బ్యాటింగ్ 4, మర్‌క్రమ్ (సి) పటేల్ (బి) కుమార్ 2, రబాడ బ్యాటింగ్ 0, ఎక్స్‌ట్రాలు 0, **మొత్తం:** (6 ఓవర్లలో వికెట్‌కు) 6, **వికెట్ల పతనం:** 1-3, **బౌలింగ్:** కుమార్ 3-2-3-1, బుమ్రా 3-2-3-0.

దక్షిణ కొరియా 'ప్రొఫెసర్' హియోన్ చంగ్... చరిత్ర సృష్టించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీ ఫైనల్ చేరిన తొలి దక్షిణకొరియా ఆటగాడిగా రికార్డులకెక్కాడు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో 97వ ర్యాంకు ఆటగాడు టెన్నిస్ శాండ్‌గ్రెన్‌పై గెలిచాడు. సెమీస్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌ను ఢీకొంటాడు. రోజర్ రికార్డు స్థాయిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీ ఫైనల్ చేరాడు. ఇక్కడ ఐదు సార్లు విజేత ఫెదరర్... ఆరో టైటిల్‌పై కన్నేశాడు. ఫెడ్డీ కెరీర్‌లో 20వ టైటిల్ సాధించే ఊపులో ఉన్నాడు. అతను క్వార్టర్స్‌లో థామస్ బెర్డిచ్ (చెక్)ను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ సిమోన్ హలెప్ (రొమేనియా), 21వ సీడ్ కెర్బర్ (జర్మనీ) సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యారు. క్వార్టర్స్‌లో హలెప్... కరోలినా ప్లిస్కోవా (చెక్)పై, కెర్బర్... మాడిసన్ కీస్ (అమెరికా)పై సునాయాస విజయాలు సాధించారు. ఇటు పురుషులు, అటు మహిళల విభాగంలో సెమీ ఫైనల్ లైనప్ ఖరారై పోయాయి.

చంగ్ భళా!

• బెర్డిచ్‌పై గెలిచి సెమీస్‌కు ఫెదరర్ • సెమీ ఫైనల్ పోరుకు హలెప్, కెర్బర్ • ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: రోజర్ ఫెదరర్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆరో టైటిల్‌కు మరింత చేరువయ్యాడు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో ఫెదరర్ 7-6 (1), 6-3, 6-4తో వరుస సెట్లలో చెక్ రిపబ్లిక్ క్రీడాకారుడు బెర్డిచ్‌పై అవలీలగా గెలిచి సెమీ ఫైనల్ చేరాడు. తొలి సెట్ ఆరంభంలో బ్రేక్ పాయింట్ ఇచ్చుకున్న రోజర్... తర్వాత వరుసగా బ్రేక్ పాయింట్లు సంపాదించాడు. దీంతో తొలి సెట్ టైబ్రేకర్‌కు దారి తీసింది. టైబ్రేకర్‌ను దాటిన అతను తక్కిన రెండు సెట్లను తనదైన శైలిలో అలవోకగా గెలుచుకున్నాడు. ఓ దశలో సహనం కోల్పోయిన ఫెదరర్... అంపైర్‌తో వాదనకు దిగాడు. ఐతే తన రాకెట్‌కు పని చెప్పి తొమ్మి దోసారి బెర్డిచ్‌పై విజయం సాధిం చాడు. వరుస సెట్లలో గెలిచినా ఫెదరర్‌కు విజయం సునాయాసంగా దక్కలేదు. గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో 43వ సారి సెమీస్ చేరిన 36 ఏళ్ల రోజర్‌ను 19వ సీడ్ బెర్డిచ్ తీవ్రంగా ప్రతిఘ టించాడు. ఫెదరర్ 11వ సారి ఒక్క సెట్ అయినా ఓడకుండా గెలిచాడు. ఆరంభంలో వెనుకబడినా తొలి సెట్ కోసం 5-3 స్కోరుతో సర్వ్ చేస్తూ బెర్డిచ్ తప్పిదం చేసి మూల్యం చెల్లించుకున్నాడు. అపుడే హాక్‌ఐ వీడియో పని చేయకపోవడంతో రోజర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

సంచలనాల చంగ్: అన్‌సీడెడ్ హియోన్ చంగ్ చరిత్ర సృష్టించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీ ఫైనల్ చేరిన మొదటి దక్షిణాఫ్రికా ఆటగాడిగా రికార్డులకెక్కాడు. క్వార్టర్ ఫైనల్ పోరులో చంగ్ 6-4, 7-6, (7-5), 6-3తో మరో అన్‌సీడెడ్ అమెరికా క్రీడా కారుడు టెన్నిస్ శాండ్‌గ్రెన్‌ను ఓడించాడు. 2 గంటల 28 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో 21 ఏళ్ల చంగ్ ఆరు మ్యాచ్ పాయింట్లు కాచుకున్నాడు. రష్యాకు చెందిన మారత్ సఫిన్ (2010) తర్వాత చిన్న వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్ చేరింది చంగే. ఈ కొరియా సంచలనం బ్రిటన్ ఆశాకిరణం ఎడ్మండ్‌తో పాటు 2008 తర్వాత తొలిసారి సెమీ ఫైనల్ చేరిన అన్‌సీడెడ్ క్రీడాకారుడిగా రికార్డుల్ని తిరగ రాశాడు. అప్పట్లో ఫ్రాన్స్ క్రీడాకారుడు జో విల్‌ఫ్రైడ్ సోంగా అన్‌సీడెడ్ ఆటగాడిగా బరిలోకి దిగి సెమీస్‌లో ప్రవేశించాడు. చంగ్.. ఆరుసార్లు చాంపియన్ జకోవిచ్‌ను సంచలన రీతిలో ప్రి క్వార్టర్స్‌లో మట్టికరిపించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అంతకు ముందు జర్మనీ యువ సంచలనం ప్రపంచ నెంబర్ 4 అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించాడు. క్వార్టర్స్ పోరులో విజయానికి ముందు చంగ్ కొన్ని ఉద్విగ్న భరిత క్షణాలను చవి చూశాడు. 11 నిమిషాల పాటు సాగిన చివరి గేమ్‌లో ఆరో మ్యాచ్ పాయింట్ సాధించి విజయ బావుటా ఎగురవేశాడు. ''చివరి గేమ్‌లో 40-0తో ఉన్నపుడు గెలుపును సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఆడాను. బ్రేక్ పాయింట్లు సాధించిన తర్వాత వేడుకల గురించి ఆలోచించకుండా ఆటపైనే దృష్టి పెట్టాలనుకున్నాను'' అని చంగ్ చెప్పాడు. ఫెదరర్‌తో పోరులో తన విజయావకాశాలు 50 శాతమన్నాడు.


చంగ్

సెమీస్‌లో బోపన్న-బబోస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న, టిమియా బబోస్ (హంగరీ) జోడీ సెమీ ఫైనల్ చేరింది. బుధవారం క్వార్టర్ ఫైనల్లో బోపన్న, బబోస్ 6-4, 7-6(5)తో జువాన్ సెబాస్టియన్ కబాల్ (కొలంబియా), అబిగె యిల్ స్పియర్స్ (అమెరికా)పై గెలిచారు. ఐదో సీడ్ భారత్-హంగరీ జోడీ గంటా 15 నిమిషాల్లో ప్రత్యర్థి జోడీని మట్టికరిపించారు.

సెమీస్‌లో ఎవరితో ఎవరు?

పురుషుల సింగిల్స్

ఫెదరర్ X చంగ్
సిలిక్ X ఎడ్మండ్

మహిళల సింగిల్స్

హలెప్ X కెర్బర్
మార్టెన్స్ X వోజ్నియాకి

హలెప్.. హైలెస్సా

నెంబర్ వన్ హలెప్ (రొమేనియా)కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఎదురు లేదు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ పోరులో హలెప్ 6-3, 6-2తో ఆరో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను అలవోకగా మట్టికరిపించింది. రాడ్ లెవర్ ఎరీనాలో జరిగిన పోరులో 0-3తో వెనుకబడి చివరకు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. సెమీ ఫైనల్ చేరడం చాలా సంతోషంగా ఉందని హలెప్ వ్యాఖ్యానించింది. సెమీస్‌లో హలెప్.. 2016 విజేత ఏంజలిక్ కెర్బర్‌తో తలపడుతుంది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో ప్లిస్కోవాను ఓడించడానికి మూడుసెట్ల పాటు పోరాడిన హలెప్ ఈసారి అనాయాసంగా వరుస సెట్లలో నెగ్గింది. సర్వ్, గ్రౌండ్ షాట్లు కుదరక ఆరంభంలో తడబడినా అనంతరం పుంజుకుంది. 0-3తో ఉన్న దశలో బ్రేక్ పాయింట్‌ను కాపాడుకున్న తర్వాత ఇక్కడ ఎన్నడూ క్వార్టర్స్ దాటని ప్లిస్కోవాపై విజయంపై హలెప్‌లో విశ్వాసం ఏర్పడింది. ప్లిస్కోవా 2017 డబ్ల్యుటీఏ టూర్ మ్యాచ్‌లలో టాప్ సర్వర్‌గా పేరుతెచ్చుకున్న ప్లిస్కోవా... రెండో సెట్లో ఆరో గేమ్‌లో కాని మొదటి ఏస్ సంధించలేకపోయింది. తర్వాత పాయింట్ కోసం రెండో ఏస్ వేసింది. అప్పటికే మ్యాచ్ హలెప్ వైపు వెళ్లిపోయింది. ''నా శైలిలో ఆడాలని తీర్మానించుకొని ఆటను ఆరంభించాను. ఈ రోజు మెరుగ్గా సర్వ్ చేశాను. నాకు అన్నీ కలిసి వచ్చాయి'' అని హలెప్ అంది.

కీస్‌ను చిత్తు చేసిన కెర్బర్

మహిళల క్వార్టర్ ఫైనల్ పోరులో మాజీ చాంపియన్ ఏంజలి క్ కెర్బర్ 6-1, 6-2తో మాడిసన్ కీస్‌ను చిత్తు చేసింది. 2017లో ఏదీ కలిసి రాని ఈ మాజీ నెంబర్ వన్ ఈ పోరులో కీస్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి రాడ్ లెవర్ ఎరీనాలో 51 నిమిషాల్లోనే విజయాన్ని సొంతం చేసుకుంది. ఐతే గత ఏడాది యుఎస్ ఓపెన్ ఫైనల్ చేరిన కీస్ రెండో సెట్లో 3-1తో వెనుకబడేంతవరకు జోరందుకోలేదు. ఆ దశలో రెండు భారీ షాట్లతో కెర్బర్ సర్వ్‌ను బ్రేక్ చేసింది. కానీ కీస్ 21వ అనవసర తప్పి దం కెర్బర్‌కు వరమై బ్రేక్ లభించింది. కీస్ బంతిని నెట్‌కు కొట్టడంతో మూడో బ్రేక్ పాయింట్‌తో కెర్బర్ సెట్‌ను, మ్యాచ్‌ను వశం చేసుకుంది. ఆస్ట్రేలియాలో వరుసగా 14 మ్యాచ్‌లు గెలవడంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కెర్బర్ తిరిగి టాప్ టెన్‌లోకి ప్రవేశిస్తుంది. ''ఈ సారి కెర్బర్ భిన్నంగా కనిపిస్తోంది'' అని హలెప్ కూడా అంగీకరిం చింది. ''కోర్టులో వేగంగా కదులుతోంది. బంతిని బలంగా రిటర్న్ ఇస్తోంది. నేను కాళ్ల సత్తువతో సిద్ధం కావాలి. ప్రశాంతంగా ఆడాలి. మ్యాచ్‌లో ఆధిపత్యం సాధించాలి'' అని హలెప్ అంది.



సెమీస్‌లో పాకిస్థాన్

• అలీ జరియబ్ అర్థసెంచరీ • ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్

క్రైస్ట్‌చర్చ్: మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అలీ జరియబ్ (74 నాటౌట్, 111 బంతుల్లో, 5 ఫోర్లు) అజేయ అర్థసెంచరీతో రాణించి పాకిస్థాన్‌ను అండర్ 19 ప్రపంచకప్ సెమీ ఫైనల్ చేర్చాడు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో పాక్ యువ జట్టు 3 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా అండర్ 19 జట్టుపై గెలిచింది. ముందుగా దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 189 పరుగులు సాధించింది. కీపర్ మకెతు (60, 65 బంతుల్లో, 4 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే అర్థసెంచరీతో రాణించాడు. అనంతరం పాక్ 47.5 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేసి గెలిచింది. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియా అండర్ 19 జట్టు 31 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది.

ఆసీస్ 33.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ కాగా... ఇంగ్లండ్ 23.4 ఓవర్లలో 96 పరుగులకు ఔటై ఓడింది. ఆసీస్ బౌలర్ పోప్ 35 పరుగులకు 8 వికెట్లు పడగొట్టాడు. శుక్రవారం భారత్ యువకులు క్వార్టర్ ఫైనల్లో బంగ్లాదేశ్ అండర్ 19 జట్టుతో తలపడతారు.

బోణీ కొట్టారు

భారత్ 3-2తో న్యూజిలాండ్‌పై గెలుపు

హామిల్టన్: భారత పురుషుల హాకీ జట్టు నాలుగు దేశాల ఇన్విటేషనల్ హాకీ టోర్నీ రెండో అంచెలో బోణీ కొట్టింది. బుధవారం 3-2తో ఆతిథ్య న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. లలిత్ ఉపాధ్యాయ్ (7వ నిమిషం), హర్జీత్ సింగ్ (32వ ని.), రుపిందర్ పాల్ సింగ్ (36వ ని.) భారత్‌కు గోల్స్ అందించారు. న్యూజిలాండ్ తరపున డేనియల్ హారిస్ (23వ ని.), కేన్ రసెల్ (37వ ని.) గోల్స్ సాధించారు. ఆరంభంలో కివీస్ ఆధిపత్యం చెలాయించింది. ఆ జట్టు ఆటగాళ్లు భారత్ సర్కిల్‌లోకి చొరబడ్డారు. కానీ భారత్ రక్షణశ్రేణి అడ్డుగోడలా నిలిచింది. వివేక్ సాగర్ ప్రసాద్ సర్కిల్ పైవైపు వేగంగా కదిలి బంతిని గోల్‌పోస్ట్‌లోకి కొట్టాడు. కానీ దాన్ని కివీస్ కీపర్ తిరిగి కొట్టడంతో ఆ బంతిని అందుకున్న లలిత్ గోల్‌గా మలిచి భారత్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. రెండో క్వార్టర్‌లో న్యూజిలాండ్ పోరాడింది. నిలకడగా భారత్ సర్కిల్‌పై దాడులు చేసింది. ఆ క్రమంలో కివీస్ మ్యాచ్‌లో తొలి పెనాల్టీ కార్నర్ సంపాదించింది. కానీ రసెల్ డ్రాగ్ ఫ్లిక్‌ను శ్రీజేశ్ అడ్డుకున్నాడు. ఐతే భారత్ డిఫెండర్ చేసిన తప్పిదంతో కివీస్ తొలి గోల్ కొట్టి స్కోరును 1-1తో సమం చేసింది. రీబౌండ్ అయిన బంతిని అందుకుని హారిస్ ఈ గోల్ సాధించాడు. కెప్టెన్ మన్‌దీప్ సింగ్ 32వ నిమిషంలో తెలివిగా తొలి పెనాల్టీ కార్నర్ సాధించాడు. దీన్ని హర్జీత్ సింగ్ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా గోల్‌గా మలిచాడు. అనంతరం భారత్ 36వ నిమిషంలో రెండో పెనాల్టీ కార్నర్ సంపాదించింది. ఈసారి రుపిందర్ గురి తప్పకుండా బంతిని గోల్‌పోస్టులోకి పంపాడు. దీంతో స్కోరు 3-1 అయింది. మరో నిమిషం అనంతరం లభించిన పెనాల్టీ కార్నర్‌ను రసెల్ గోల్‌గా మలిచి భారత్ ఆధిక్యాన్ని 3-2కు తగ్గించాడు.

తెలంగాణ పిలుస్తోంది పెట్టుబడులతో రండి!

- భాగ్యనగరం..పరిశ్రమల స్వర్గధామం
- సోలార్ విద్యుత్‌లో దూసుకుపోతున్నాం
- దావోస్‌లో కేటీఆర్ పిలుపు
- పలు కంపెనీలతో పెట్టుబడులపై చర్చలు
- దావోస్‌లో ప్రపంచ దిగ్గజ కంపెనీలతో భేటీ
- పెట్టుబడులు రాబట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటున్న మంత్రి కేటీ రామారావు రెండవ రోజు బుధవారం పలు ప్రముఖ కంపెనీలతో సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో ఆయా కంపెనీలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానం, తెలంగాణలోని పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని మంత్రి వారికి వివరించారు. ఉదయం ఏయిర్ ఏషియా గ్రూప్ సీఈవో అంతోనీ ఫెర్నాండెస్, ఉప కార్యనిర్వహణ అధికారి ఏయిరీన్ ఒమర్‌తో మంత్రి సమావేశమయ్యారు. దేశంలో రానున్న రోజుల్లో విమానయాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్‌లోని విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు గెలుచుకున్నదని తెలిపారు.

నోవార్టిస్ కంపెనీ పబ్లిక్ పాలసీ హెడ్ పెట్రాలక్స్‌తో మంత్రి సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఫార్మాసిటీ గురించి వివరించారు. నగరం ఇప్పటికే భారతదేశ లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా ఉందన్నారు. నగరంలో నోవార్టిస్ కార్యకలాపాల విస్తరణపై ఈ సమావేశంలో చర్చించారు. నోవార్టిస్‌కు నగరంలో ఆర్‌అండ్‌బి, డేటా సపోర్టు, అనాలిటిక్స్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నదని, హైదరాబాద్ నగరంలో సంస్థ అభివృద్ధిపట్ల తాము సంతృప్తిగా ఉన్నామని లక్స్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న 90వేల చదరపు అడుగుల ల్యాబోరేటరీని రెట్టింపు చేయనున్నట్లు, మరో 150 మంది సిబ్బందిని కొత్తగా నియమించనున్నామని తెలిపారు. కంపెనీ కార్యకలాపాల విస్తరణ ద్వారా నగరంలో జినోమ్ వ్యాలీ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని, పూర్తి వివరాలను నోవార్టిస్ త్వరలోనే అందిస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు.

మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కెన్ కవాయి బృందంతో సమావేశమయ్యారు. తమ కంపెనీ భారీ ప్రాజెక్టుల అవకాశాల కోసం చూస్తుందని మంత్రికి వారు తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామికవాడలు, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు తదితర ప్రాజెక్టులపై మిత్సుబిషికి ఆసక్తి ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టుల నిర్మాణానికి తమ రాష్ట్రంలో అనేక అవకాశాలు ఉన్నాయని, కంపెనీ ప్రతినిధి బృందం స్వయంగా తెలంగాణలో పర్యటించాలని మంత్రి కోరారు. మిత్సుబిషి ముందుకు వచ్చి జపనీస్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ పార్కును తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. మొన్నటి జపాన్ పర్యటనలో ఇలాంటి పార్కు ఏర్పాటుకు జైకా వంటి ఆర్థిక సంస్థలు నిధులు అందించేందుకు సూత్రప్రాయంగా ఒప్పుకున్నాయని మంత్రి వారికి తెలిపారు.

కువైట్‌కు చెందిన ఫవద్ అల్గానిమ్ కంపెనీ సీఈవో మహమ్మద్ అల్గానిమ్‌తో మంత్రి సమావేశమయ్యారు. తెలంగాణ ఇప్పటికే సోలార్ విద్యుత్ ఉత్పాదనలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ రంగానికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పవర్, మెడికల్ డివైజస్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఉన్న పెట్టుబడుల అవకాశాలను వివరించారు. ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ దుబాయ్ సీఈవో మహమ్మద్ అల్ షయిభానీతో మంత్రి సమావేశమయ్యారు.

తెలంగాణలో టెక్‌సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతోపాటు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సమావేశంలో చర్చించారు. హ్యూలెట్ ప్యాకర్డ్ (హెచ్‌పి) సంస్థ ఉపాధ్యక్షులు అనా పిన్కుజుక్‌తో సమావేశమయ్యారు. హెచ్‌పి, టి-హబ్‌ల భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రి పిన్కుజున్‌ను కోరారు. దీంతోపాటు నగరంలో హెచ్‌పి కార్యకలాపాలను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ ఆర్థిక సదస్సులో సర్క్యులర్ అవార్డు గెలుచుకున్న టి-హబ్ సంస్థ బనయన్ నేషన్ సహ వ్యవస్థాపకుడు మని వాజిపేయ్ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ బృందానికి అభినందనలు తెలిపారు. టి-హబ్ సంస్థకు ప్రపంచ గుర్తింపు దక్కడంపట్ల మంత్రి హర్షం వ్యక్తంచేశారు.

కువైట్ ప్రభుత్వ క్షమాభిక్షను సద్వినియోగం చేసుకోండి

ఎన్ఆర్ఐలకు కేటీఆర్ సూచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కువైట్ ప్రభుత్వం కల్పిస్తున్న క్షమాబిక్ష అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా రాష్ట్ర ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కేటీ రామారావు తెలంగాణ ఎన్ఐఆర్‌లకు పిలుపునిచ్చారు. సరైన వీసాలు లేకుండా కువైట్‌లో నివసిస్తున్న వారికి క్షమాభిక్ష పెట్టేందుకు ఆ దేశ ప్రభుత్వం ఈనెల 23 నుంచి 29 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనుంది. ఆ దేశ అంతర్గత మంత్రిత్వశాఖ ఈ మేరకు డిక్రీ విడుదల చేసింది. కువైట్ ప్రభుత్వం కల్పిస్తున్న క్షమాబిక్ష అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తెలంగాణవాసులు వెంటనే వెనక్కి రావలసిందిగా కేటీఆర్ సూచించారు. అక్రమంగా ఉంటున్న వారిని ప్రయాణించకుండా నిషేధిస్తారని, కోర్టు కేసుల ద్వారా నిర్బంధిస్తారని ఆయన తెలిపారు. కువైట్‌లో ఉన్న భారతీయ రాయబార కార్యాలయాన్నిగానీ, రాష్ట్ర ప్రభుత్వ జిఎడిలోని ఎన్ఆర్ఐ విభాగాన్ని సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

పాక్‌పై అమెరికా డ్రోన్ దాడులు

- హక్కానీ కమాండర్ సహా ముగ్గురు మృతి
- ఇది మా దేశ సార్వభౌమత్వంపై దాడి : పాక్



పెషావర్: అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో హక్కానీ కమాండర్, అతడి ఇద్దరు సహచరులు బుధవారం మరణించారు. ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులో పాక్ సంక్షుభిత గిరిజన కుర్రమ్ ఏజెన్సీ ప్రాంతానికి సమీపంలో ఒక ఇంటిని లక్ష్యంగా చేసుకొని రెండు మిస్సైళ్ళను డ్రోన్ ప్రయోగించింది. హక్కానీ నెట్‌వర్క్ కమాండర్ ఎహ్సాన్ అలియాస్ ఖావరి అతడి ఇద్దరు సహచరులు మరణించారని డాన్ న్యూస్ పేర్కొంది. అమెరికా గూఢచర్య విమానాలు చేపట్టిన డ్రోన్ దాడులు అఫ్ఘన్ శరణార్థులకు చెందిన ఇంటిని లక్ష్యంగా చేసుకుందని డాన్ న్యూస్ వార్తాకథనం తెలిపింది. ఖావరి అనే వ్యక్తి మరణించినట్టు పోలీస్ అధికారి థాల్ అమీర్ జమన్ నిర్ధారించారు.



దావోస్ సదస్సులో కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, పీయూష్ గోయెల్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ.

అమెరికా ఫస్ట్...దావోస్ లాస్ట్!

- సమర్థించుకున్న యూఎస్ అధికారులు
- ట్రంప్ రాకకు రంగం సిద్ధం
- ప్రొటెక్షనిజంపై ప్రపంచ నేతల భయం

దావోస్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నినదిస్తున్న అమెరికా ఫస్ట్ అజెండా(ప్రొటెక్షనిజమ్) వల్ల ప్రపంచీకరణ, అంతర్జాతీయ వాణిజ్యం దెబ్బతింటుందంటూ వినవస్తున్న ఆందోళనలను అమెరికా ఉన్నతాధికారులు బుధవారం తిప్పి కొట్టారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్) జరుగుతున్న తరుణంలో అక్కడ ప్రసంగించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెవా, బ్రెజిల్ అధ్యక్షుడు మిచెల్ టెమెర్ సహా పలువురు ప్రపంచ నేతలు ట్రంప్ విధానాలు లక్ష్యంగా పెరుగుతున్న ప్రొటెక్షనిజమ్‌పై ఆందోళన వ్యక్తం చేశారు.

తన అమెరికా ఫస్ట్ ఎజెండా కింద ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(నాఫ్టా) ఉపసంహరించుకుంటానని ట్రంప్ బెదిరించారు. అంతర్జాతీయ పర్యావరణ మార్పు ఒడంబడికను తృణీకరించారు. ఐక్యరాజ్యసమితి, నాటో సహా అంతర్జాతీయ వ్యవస్థలను విమర్శించారు. ట్రంప్ గురువారం దావోస్ రావచ్చని భావిస్తున్నారు. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఆయన్నుంచి విమర్శలను ఎదుర్కొన్న అంతర్జాతీయవాదులను ఉద్దేశించి ట్రంప్ శుక్రవారం కీలకోపన్యాసం చేయవచ్చు. ట్రంప్ రాకను పురస్కరించుకొని అమెరికా కోశాగార కార్యదర్శి స్టీవెన్ నుచిన్, వాణిజ్య కార్యదర్శి విల్‌బర్ రాస్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. అమెరికా దూకుడు మీద తీసుకుంటున్న వాణిజ్య చర్యలను వెనకేసుకొచ్చారు. మున్ముందు అలాంటి చర్యలు మరిన్ని ఉంటాయని తెలిపారు.

ట్రంప్ చర్యలకు ప్రత్యర్థుల కవ్వింపు

ఇది అమెరికా ఫస్ట్ ఎజెండాకు సంబంధించినది. కానీ దానర్థం మిగతా ప్రపంచంతో కలిసి పనిచేయడం అని నుచిన్ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు అమెరికా కార్మికులు, అమెరికా ప్రయోజనాల కోసం చూస్తున్నారని దాని అర్థం. ఇతర నేతలు వారి ప్రయోజనాల కోసం చూస్తుంటారని ఆయన భావించడంలో ఎలాంటి వ్యత్యాసం లేదు అని రాస్ తెలిపారు. అమెరికా చేపట్టిన వాణిజ్య చర్యలు వాణిజ్యంలో మా ప్రత్యర్థులు అనుచిత ప్రవర్తనతో కవ్వించబడ్డాయని చెప్పారు. ఉదాహరణకు అమెరికన్ల ఉద్యోగాలను కాపాడే ఒక మార్గం అన్నట్టుగా వాషింగ్ మెషిన్లు, సోలార్ ప్యానెళ్ళపై దిగుమతి సుంకాలను అమెరికా మంగళవారం భారీగా పెంచింది. సుంకాల్లో పెంపుదలను చైనా, దక్షిణ కొరియా ఖండించాయి. ఈ విపరీత చర్యపై ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ)కు ఫిర్యాదు చేయడానికి దక్షిణ కొరియా సమాయత్తమవుతున్నది.

అయితే స్వేచ్ఛా వాణిజ్యం గురించి అనేక దేశాలు గొప్పగా ఎలుగెత్తి చాటుతుంటాయి. కానీ వాస్తవానికి అవి తీవ్రమైన ప్రొటెక్షనిజమ్‌ను పాటిస్తున్నాయి అని రాస్ విమర్శించారు. 2018లో ప్రొటెక్షనిజమ్, వాతావరణ మార్పు, సైబర్ దాడులు,యుద్ధం లాంటి భౌగోళిక రాజకీయ బెదిరింపులు ఊపందుకున్న పక్షంలో కాంతి మంతమైనఆర్థిక దృక్కోణం మసక బారుతుందని సదస్సులో అనేకులు ఆందోళన చెందుతున్నారు.



మీ శౌర్యం ఇతర బాలలకు స్ఫూర్తివంతం

ప్రధాని చేతులమీదుగా బాలలకు సాహస పురస్కారాలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 18 మంది బాలలకు జాతీయ సాహస పురస్కారాలను బుధవారం ప్రదానం చేశారు. వారిలో ఏడుగురు బాలికలు ఉన్నారు. ముగ్గురికి మరణానంతరం పురస్కారాలు దక్కాయి. ఈ సందర్భంగా ప్రధాని పురస్కార గ్రహీతలతో మాట్లాడుతూ వారి సాహస కార్యాలు ఇతర బాలలకు స్ఫూర్తిని ఇస్తుందని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. పురస్కార గ్రహీతల్లో అధికులు గ్రామీణ, నిరాడంబర నేపథ్యం నుంచి వచ్చారని మోడీ వ్యాఖ్యానించారు. దైనందిన జీవితంలో ఇక్కట్లు విపత్కర పరిస్థితులను తెగువతో ఎదుర్కొనేలా వారిని తీర్చిదిద్దాయన్న ప్రధాని మాటలను ఒక అధికారిక ప్రకటన ఉటంకించింది. ఈ పురస్కారాలను భరత్ పురస్కారం, గీతా చోప్రా పురస్కారం, సంజయ్ చోప్రా పురస్కారం, బాపు గెయిధాని పురస్కారం, సాధారణ జాతీయ సాహస పురస్కారాలు అనే ఐదు విభాగాలుగా విభజించారు.

శౌర్య డ్రైవర్‌కు పౌర పురస్కారం



న్యూఢిల్లీ: ఉగ్రవాదుల కాల్పుల్లో బుల్లెట్ గాయాలయి గాయపడ్డప్పటికి 52 మంది అమర్‌నాథ్ యాత్రీకులను రక్షించిన గుజరాత్‌కు చెందిన బస్ డ్రైవర్ షేక్ సలీం గఫూర్‌కు శౌర్య పతకాల్లో రెండో అత్యున్నత పౌర పురస్కారం 'ఉత్తమ జీవన రక్షా పతకం'ను కేంద్రం ప్రకటించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ మేరకు వివరాలను బుధవారం మీడియాకు తెలిపింది. అత్యుత్తమ ధైర్య సాహసాలను ప్రదర్శించిన పౌరులకు ఈ సర్వోత్తమ జీవన్ రక్షా పతకంను ఇస్తారని మంత్రిత్వశాఖ తన ప్రకటనలోపేర్కొంది. గత ఏడాది జూలై 10న జమ్ము, కశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రీకులు ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరుపగా బుల్లెట్ దెబ్బలు తగిలినప్పటికి బస్‌ను ఆపకుండా నడిపి ప్రయాణికుల ప్రాణాలను గఫూర్ కాపాడాడని హోం శాఖ తెలిపింది. ఉగ్రవాదుల కాల్పుల్లో ఏడుగురు యాత్రీకులు చనిపోగా, 14 మంది గాయపడ్డారు. కాగా 52 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటబడ్డారు. గఫూర్‌కు ఈ పురస్కా రంతోపాటు రూ.లక్ష నగదును కూడా అందించనున్నట్లు మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 107 మందికి పోలీసు శౌర్య పతకాలను ప్రకటించారు. ఇందులో ఎక్కువగా జమ్ము, కశ్మీర్ పోలీసులు 38 పతకాలు దక్కించుకుంది. మిగిలిన వాటిల్లో సీఆర్‌పీఎఫ్ 35 అవార్డులు, చత్తీస్‌గఢ్ 10, మహారాష్ట్ర 7, తెలంగాణ 6 తదితర రాష్ట్రాలున్నాయి.

కెంటకీ స్కూల్లో విద్యార్థి కాల్పులు

- ఇద్దరు విద్యార్థులు మృతి, 17 మందికి గాయాలు

బెన్‌టన్: అమెరికాలోని కెంటకీ రాష్ట్రం రూరల్ పరిధిలో ఉన్న మార్షల్ కౌంటీ హై స్కూల్‌లో విద్యార్థి హ్యాండ్‌గన్‌తో జరిపిన కాల్పులు తోటి విద్యార్థులను కకావికలం చేశాయి. కాల్పుల నుంచి తప్పించుకోవడానికి వందలకొద్దీ విద్యార్థులు స్కూల్ నుంచి బయటకు పరుగెత్తారు. దీనితో కొంత మంది విద్యార్థులు తొక్కిసలాటలో గాయపడ్డారు. బుధవారం మార్షల్ కౌంటీ హైస్కూల్ ఓపెన్ హాల్లో గుమికూడిన విద్యార్థులపై ఉద్దేశపూర్వకంగా, పద్ధతిప్రకారం 15ఏళ్ల విద్యార్థి హ్యాండ్‌గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ మేరకు వివరాలను నిందితుడి స్నేహితురాలు అలెగ్జాండ్రియా కపోరలి మీడియాకు తెలిపింది. కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు మరణించగా, 12మంది పైగా విద్యార్థులకు బుల్లెట్ గాయాలయ్యాయి. మరో ఐదుగురు విద్యార్థులు తొక్కిసలాటలో గాయపడ్డారు. కాల్పులు జరుపుతున్నప్పుడు తాను క్లాస్‌రూమ్‌లోకి పరిగెత్తి దాగున్నట్లు అలెగ్జాండ్రియా చెప్పింది. ట్రిగ్గర్‌ను లాగుతూ కాల్పులు జరుపుతున్నప్పుడు అతని ముంజేయి ముందుకు వెనక్కు కదలటం గమనించానంది. బుల్లెట్లు ఖాళీ అయిపోయేంతవరకు అతడు ట్రిగ్గర్ నొక్కుతూనే ఉన్నాడు. అనంతరంపారిపోయేందుకు పరుగు పెట్టాడని ఆమె తెలిపింది. కాగా పోలీసులు నిందితుడిని గుర్తించి చేతులకు బేడీలువేసి అరెస్టు చేశారు. హత్యకు పాల్పడటం, హత్యకు ప్రయత్నించడం కింద కేసులను నమోదు చేశారు. 2018లో దేశంలోని పాఠశాలలో జరిగిన తొలి కాల్పుల ఘటన ఇదని కెంటకీ రాష్ట్ర పోలీస్ లెఫ్టినెంట్ మైఖేల్ వెబ్ చెప్పారు. 2013వ సంవత్సరం నుంచి స్కూళ్లలో 283 కాల్పుల ఘటనలు దేశంలో చోటుచేసుకున్నాయని గన్ సేఫ్టీకోసం ఏర్పాటుచేసిన ఆంటీ వయోలెన్స్ గ్రూప్ పేర్కొంది.

చత్తీస్‌గఢ్‌లో నకల్స్ పంజా

- కాల్పుల్లో నలుగురు పోలీసులు మృతి

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లు మరోసారి రెచ్చిపోయారు. నారాయణ్‌పూర్ జిల్లాలోని అడవి ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో నలుగురు పోలీసులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఇర్పానర్ గ్రామం సమీపంలోని అభుజ్‌మడ్ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేతగా పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా నక్సలైట్లు అకస్మాత్తుగా కాల్పులు జరిపినట్లు స్పెషల్ డీజీపీ డీఎం అశ్వతి తెలిపారు. తేరుకుని ఎదురుకాల్పులు జరిపేలోపే నలుగురు పోలీసులు ప్రాణాలొదిలారు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.